


ప్రతి అక్షరం ప్రజల కోసం
www.prajapaksham.in
# ప్రజాపక్షం
PRAJAPAKSHAM ★

**ఫ్రాన్స్ హింసాకాండలో 1200 మంది అరెస్టు**

వలస ప్రజలే కారణమని ట్రంప్ విమర్శ

అల్ట్రాలెఫ్ట్ కారణమని ప్రభుత్వం నిందారోపణ

దేశవ్యాప్తంగా 5.50 లక్షల మంది వీధుల్లోకి

08

సంపుటి 09, సంచిక: 319 | సోమవారం | 19-10-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఐదు యూరప్ దేశాల్లో ప్రభుత్వాలపై
# వెల్లువెత్తుతున్న నిరసనలు

- జీవన వ్యయాలు, పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా ఆగ్రహ జ్వాలలు
- విద్య, ఉపాధి భారమవుతుందంటూ వీధుల్లోకి వచ్చి ప్రజలు ఆందోళనలు



**రోమ్ :** జీవన వ్యయాలు, పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా ఒక్క ఫ్రాన్స్‌దేశంలోనే కాకుండా యూరప్‌లోని ఇటలీ, బెల్జియం, పోర్చుగల్, ఆల్బేనియా దేశాలలో కూడా ప్రజలు ఎలాంటి సంబంధం లేకుండా వేరువేరుగా స్వచ్ఛంధంగా శనివారంనాడు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఈ అన్నిచోట్లా ముసుగులు ధరించిన యువకులు పోలీసులపై రాళ్ళదాడులు చేశారు. హింసకు పాల్పడ్డారు. యూరప్‌లోని ఐదు దేశాలలో ఒకేరోజు పాలకుల విధానాలకు వ్యతిరేకంగా అశాంతి చెలరేగింది. అల్‌–జజీరా వార్తాసంస్థ సమాచారం ప్రకారం ప్రధానంగా ఇటలీలో కూడా శనివారం జీవన వ్యయాల పెరుగుదలకు, యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు హింసాత్మకంగా మారాయి. దీంతో యూరోపియన్ యూనియన్‌లో ప్రభుత్వాలపై తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. ఇటలీలో శాంతియుతంగా ప్రారంభమైన నిరసన ప్రదర్శన ఆ తర్వాత హింసాత్మకంగా మారింది. అల్లర్ల నివారణ భద్రతాయంత్రాంగంపై ముసుగులు ధరించిన యువకులు రాళ్ళు, పేవింగ్ బ్లాక్‌లు, ఇతర వస్తువులు విసిరారు. బార్ టేబుల్స్‌తో చేసిన బారికేడ్లకు నిప్పుపెట్టారు. గుంపులను చెదరగొట్టడానికి పోలీసులు వాటర్ కేనన్స్, బాష్పవాయు గోళాలను ప్రదర్శించారు.ఇద్దరు పోలీసు అధికారులు గాయపడ్డారు.యాభైమంది ప్రదర్శకులను అదుపులోకి తీసుకున్నారు. ఇటలీ ప్రధానమంత్రి జార్జ్ మెలోనీ హింసాకాండను ఖండిస్తూ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు.నిరసన ప్రదర్శన చేయడం హక్కు..కానీ నగరాలను తగలబెట్టడం హింస, అది హక్కు కాదు అని ఆమె రాశారు.అదేవిధంగా ఆల్బేనియా రాజధాని నగరం తిరానాలో కూడా 135 రోజులుగా శాంతియుతంగా జరుగుతున్న నిరసన ప్రదర్శనలు శనివారం హింసాత్మకరూపం దాల్చాయి. పోలీసులు–ప్రదర్శకుల మధ్య ఘర్షణ చెలరేగింది. ముసుగులు ధరించిన యువకులు పోలీసులపై రాళ్ళు, పెట్రోలు బాంబులు విసిరారు. ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నవారంతా హైస్కూలు,యూనివర్శిటీ విద్యార్థులే.. పోలీసులు మొదటిసారి రబ్బరు బుల్లెట్లు కూడా ఉపయోగించారు. మధ్యాహ్నం

తరువాయి 12లో



# రాష్ట్రం పూలవనం

## అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

- భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వేడుకలు
- ట్యాంక్‌బండ్ అమరవీరుల స్మారకం నుంచి మహాబతుకమ్మ ర్యాలీ
- ర్యాలీలో 700 మంది కళాకారులు, 600 మందికిపైగా మహిళలు
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, విజయ్ దేవరకొండ- రష్మిక హాజరు
- జనసంద్రంగా మారిన హనుమకొండలోని పద్మాక్షి దేవాలయం, ఉర్సు గుట్ట



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే సద్దుల బతుకమ్మ సంబరాలు రాష్ట్రంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని బతుకమ్మ ఆడారు. ట్యాంక్‌బండ్ అమరవీరుల స్మారకం నుంచి మహా బతుకమ్మ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో 700 మంది కళాకారులు, 600 మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. మంత్రి సీతక్క ర్యాలీలో పాల్గొని, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. వేడుకల్లో ఏర్పాటుచేసిన ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, సినీ నటులు విజయ్ దేవరకొండ రష్మిక దంపతులు, యూఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ తదితరులు పాల్గొన్నారు.

**నీటి పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత : గవర్నర్**

ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టి జలవనరులను సంరక్షించుకోవడాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా

తరువాయి 8లో



## ఓట్ చోరీపై మోదీ, షా, జ్ఞానేశ్
# మూల్యం చెల్లిస్తారు!

- ఓట్ చోరీకి ప్రధాని ప్రణాళిక, హోంమంత్రి ఆదేశాలు, సిఇసి అమలు
- 'గోయ్ రఖోన్' యాత్రలో రాహుల్‌గాంధీ

**మార్గో :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెరవెనుక 'ఓట్ల దొంగతనం'కు ప్రణాళిక రచిస్తున్నారని, దీనిని హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు సిఇసి జ్ఞానేశ్ కుమార్ అమలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం ఆరోపించారు. మోదీ, షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ 'నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని, 'ఓట్ల దొంగతనం'పై వారు న్యాయాన్ని ఎదుర్కొని మూల్యం చెల్లించుకుంటారని ఆయన అన్నారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న చివరి 'గోయ్ రఖోన్' (గోవాను రక్షించండి) యాత్రలో ఆదివారం రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. సెప్టెంబర్ 22న ప్రారంభమైన ఈ ప్రజా ప్రచార యాత్రలో భాగంగా, తీరప్రాంత రాష్ట్రంలోని 40 అసెంబ్లీ నియోజకవర్గాలన్నింటినీ కవర్ చేస్తూ రాహుల్ గాంధీ మార్గోలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో కలిసి రెండు కిలోమీటర్లు నడిచారు. మార్గోలో జరిగిన ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ, కేంద్రం ఒక 'క్విడ్ ప్రో కో' (ఒకదానికి ఒకటి ఇచ్చిపుచ్చుకునే) తరహా వ్యవస్థను సృష్టిస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం చెప్పినట్లు చేసే కొందరు బిలియనీర్లకు కాంట్రాక్టులు ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు. 'ఇకపై ఎలాంటి

తరువాయి 8లో

## భక్తులపైకి దూసుకెళ్లిన ట్రక్కు
### 15 మంది మృత్యువాత

- మరో 25 మందికి గాయాలు
- మధ్యప్రదేశ్‌లో గ్వాలియర్ జిల్లాలో శితలామతి ఆలయం సమీపంలో ఘటన
- ట్రక్కు బలంగా ఢీకొట్టడంతో కూలిన ఆలయ గోడ
- ఘటనపై విచారణకు ఆదేశించిన సిఎం మోహన్ యాదవ్



**గ్వాలియార్/భోపాల్ :** మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఆదివాం తెల్లవారుజామున గ్వాలియార్ జిల్లాలో ఓ ట్రక్కు అదుపుతప్పి నవరాత్రి పూజల నిమిత్తం ఆలయ సమీపంలో గుమిగూడిన భక్తులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు యువకులు సహా మొత్తం 15 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 25 మందికిపైగా భక్తులు గాయపడనట్లు పోలీసులు తెలిపారు. పంజాబ్ రిజిస్ట్రేషన్ నంబర్ కలిగి వరి ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రక్కు, తెల్లవారుజామున సుమారు 1.30 గంటలకు చినార్ రోడ్డులోని నోఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించి, దర్శనం కోసం వేచి ఉన్న పలువురు భక్తులను, రోడ్డు పక్కన ఉన్న దుకాణాలను ఢీకొట్టి, ఆ తర్వాత శీతలా మాత ఆలయ ప్రవేశ ద్వారాన్ని ఢీకొట్టిందని వారు తెలిపారు. ఈ ధాటికి ఆలయ గోడలోని ఒక భాగం కూలిపోవడంతో, శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. ట్రక్కు డ్రైవర్ ఘటనా స్థలం నుండి పారిపోయాడని, పోలీసులు అతని కోసం గాలిస్తున్నారన్నారు. ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడం వల్ల, వాహనాన్ని నియంత్రించే తీవ్ర ప్రయత్నంలో డ్రైవర్ ఎడమ వైపుకు మళ్లించి ఉండవచ్చని ఒక దర్యాప్తు అధికారి తెలిపారు. ఒకవేళ అది నేరుగా ముందుకు వెళ్లి ఉంటే, కనీసం 600 నుండి 700 మంది భక్తులను ఢీకొట్టి ఉండేదని ఆయన అన్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన ప్రతి ఒక్కరికీ రూ. 50,000 చొప్పున ఎక్స్ గ్రేషియా సహాయాన్ని ప్రధాని మోదీని

తరువాయి 8లో

# మా తీర్పునే అమలు చేయరా?
## కాగితాలకే పరిమితం చేస్తారా?

- రుతుక్రమ ఆరోగ్యంపై కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- తదుపరి విచారణ నాటికి తాము కోరిన సమాచారంపై స్పందించకుంటే ధిక్కరణ నోటీసులిస్తామని కేంద్రానికి హెచ్చరిక




**న్యూఢిల్లీ :** రుతుక్రమ ఆరోగ్యాన్ని (బహిష్టు పరిశుభ్రత) ప్రాథమిక హక్కులో భాగంగా గుర్తిస్తూ ఇచ్చిన తీర్పు అమలుపై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు స్పందించకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం కోరినప్పటికీ ఇప్పటివరకు అవసరమైన వివరాలు అందించకపోవడంపై ప్రశ్నించింది. తదుపరి విచారణ నాటికి కూడా స్పందించకపోతే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 13న ఈ అంశంపై విచారించింది. బహిష్టు ఆరోగ్యానికి సంబంధించిన ప్రాథమిక హక్కు తీర్పు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుందని ధర్మాసనం గుర్తుచేసింది. రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్యం కూడా ఈ హక్కులో భాగమని సుప్రీం కోర్టు ఇప్పటికే ప్రకటించిందని తెలిపింది. సెప్టెంబర్ 1న ఇచ్చిన ఆదేశాల్లో తీర్పులో ప్రస్తావించిన లోపాల్ని పరిశీలించి, వాటిపై తీసుకున్న చర్యల వివరాల్ని తదుపరి విచారణకు సమర్పించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించినట్లు బెంచ్ గుర్తుచేసింది. అయినా కేంద్రం కోరిన సమాచారం ఇవ్వకపోవడంపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు తీర్పులో చెప్పిన అంశాలు కేవలం కాగితాలపైనే ఉంటే,

తరువాయి 8లో

# ఐటి కొలువులు అంతులేని ఒత్తిడి!

- ఉద్యోగ భద్రతపై ఆందోళన.. అనారోగ్యంతో ఆవేదన.. ఒంటరితనంతో మానసిక సంఘర్షణ
- అధిక వేతనాల వెనుక కనిపించని కష్టాలు..



ప్రజాపక్షం/హైదరాబాద్

చేతినిండా జీతం.. అత్యాధునిక కార్యాలయాలు.. అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు.. విలాసవంతమైన అపార్ట్‌మెంట్లలో నివాసం.. బయటకు చూస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీవితం ఎంతో సౌకర్యవంతంగా కనిపిస్తుంది. కానీ ఆ మెరుపుల వెనుక కనిపించని ఒత్తిళ్లు, ఉద్యోగంపై అనిశ్చితి, అనారోగ్యం, ఒంటరితనం, కుటుంబానికి దూరంగా గడపాల్సిన పరిస్థితులు కొందరిని తీవ్ర మానసిక సంఘర్షణకు గురిచేస్తున్నాయా? హైదరాబాద్‌లో ఇటీవల రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతి చెందడం ఈ ప్రశ్నలను ముందుకు తెచ్చింది. నానక్‌రామ్‌గూడలోని గోల్ఫ్ ఎడ్జ్ అపార్ట్‌మెంట్స్ 30వ అంతస్తు నుంచి కిందపడి ఉప్పల భరత్ (29) ప్రాణాలు కోల్పోగా, కొండాపూర్‌లోని స్నేహితుడి ఫ్లాట్‌లో సౌరభ్ శేఖర్ (36) మృతిచెందారు. ఈ రెండు ఘటనల వెనుక కారణాలు

తరువాయి 8లో

# పట్నం వాసుల పల్లెబాట



- నిర్మానుష్యంగా మారిన రహదారులు
- ట్రాఫిక్ చిక్కులకు తాత్కాలిక విరామం
- మెట్రో, సిటీ బస్సుల్లో దర్శనమిస్తున్న ఖాళీ సీట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

దసరా పండుగ నేపథ్యంలో నగర ప్రజలు పల్లెబాట పట్టడంతో పట్నం బోసిపోయింది. నిత్యం వాహనాల రద్దీతో కిక్కిరిసిపోయే రహదారులు నిర్మానుష్యంగా మారగా, ట్రాఫిక్ జామ్‌లతో సతమతమయ్యే నగరవాసులకు తాత్కాలికంగా ఉపశమనం లభించింది. స్కూళ్లు, కాలేజీలకు పండుగ సెలవులు, ఉద్యోగస్థులకు వారాంతపు సెలవులు రావడంతో దసరా, బతుకమ్మ పండుగలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి జరుపుకునేందుకు సొంతూళ్లకు తరలివెళ్లడంతో నగరంలో సందడి తగ్గింది.

**రోడ్లపై తగ్గిన వాహనాల రద్దీ..**

సాధారణ రోజుల్లో వాహనాల రాకపోకలతో రద్దీగా కనిపించే ప్రధాన రహదారులు, కూడళ్లు దసరా సెలవుల నేపథ్యంలో బోసిపోయాయి. ఉదయం, సాయంత్రం వేళల్లోనూ వాహనాల రద్దీ పెద్దగా కనిపించలేదు. నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులతో కార్యాలయాలకు చేరుకోవడానికి, గమ్యస్థానాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడే ప్రజలకు ప్రస్తుతం ఆ సమస్యలు చాలావరకు తగ్గాయి. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనాలు బారులు తీరడం, కిలోమీటర్ల మేర

తరువాయి 12లో

# వాస్తవికత... ఓ విస్తృత సాహిత్య భావన

సాహిత్యం జీవితాన్ని ప్రతిబింబిస్తుందని తరచుగా చెబుతాం. అయితే జీవితం అంటే మన కళ్లకు కనిపించే సంఘటనలు, మన చుట్టూ ఉన్న మనుషులు, సమాజంలో జరిగే పరిణామాలు మాత్రమే కాదు. మనిషి అంతరంగం, అతని కలలు, భయాలు, నమ్మకాలు, సామాజిక సంబంధాలు, రాజకీయ అధికారాలు, చారిత్రక జ్ఞాపకాలు కూడా జీవితంలో భాగమే. ఈ విస్తృతమైన జీవితానుభవాన్ని సాహిత్యం ఎలా చిత్రించాలి? అనేది ప్రశ్న. ఈ ప్రశ్న నుంచే వాస్తవికత (రియలిజం)కు సంబంధించిన చర్చ ప్రారంభమవుతుంది. వాస్తవికత అనేది ఒక నిర్దిష్టమైన సాహిత్య ఉద్యమం మాత్రమే కాదు. వాస్తవాన్ని గుర్తించడం, అర్థం చేసుకోవడం, కథనంగా నిర్మించడం వంటి ప్రక్రియలతో సంబంధం ఉన్న విస్తృతమైన సాహిత్య భావన. అయితే సాహిత్యం వాస్తవాన్ని యథాతథంగా ప్రతిబింబించగలదా? ఒక నవలలోని పట్టణం నిజమైన పట్టణంలా కనిపించినా, అందులోని పాత్రలు నిజ జీవితంలోని మనుషుల్లా ప్రవర్తించినా, ఆ నవల పూర్తిగా వాస్తవమే అవుతుందా? వాస్తవానికి సాహిత్య రచన అనేది ఎంపిక, కల్పన, పరిశీలన, వ్యాఖ్యానం కలిసిన సృజనాత్మక ప్రక్రియ. రచయిత వందల సంఘటనలలో కొన్నింటిని ఎంచుకుంటాడు. కొన్ని పాత్రలకు ప్రాధాన్యత ఇస్తాడు. కొన్ని అనుభవాలను వెలుగులోకి తెచ్చి, మరికొన్నింటిని పరోక్షంగా ఉంచుతాడు. అందువల్ల వాస్తవిక సాహిత్యం అనేది జీవితానికి అద్దం పట్టడం మాత్రమే కాదు, జీవితంలో ఏది ముఖ్యమో చూపించే ఒక దృక్పథం కూడా. ప్రపంచ సాహిత్య చరిత్రను పరిశీలిస్తే వాస్తవికత ఒక్కసారిగా పుట్టి, ఒకే రూపంలో కొనసాగలేదని స్పష్టమవుతుంది. సమాజంలో వచ్చిన మార్పులు, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, వర్గవిభజనలు, యుద్ధాలు, వలసపాలన, మానసిక శాస్త్ర అభివృద్ధి, రాజకీయ సిద్ధాంతాలు, సాంస్కృతిక ఘర్షణలు వాస్తవికతను అనేక దిశల్లోకి నడిపించాయి. సామాజిక వాస్తవికత, సహజవాదం, మానసిక వాస్తవికత, సోషలిస్టు వాస్తవికత, మాంత్రిక వాస్తవికత వంటి రూపాలు ఈ పరిణామ క్రమంలో ఏర్పడ్డాయి. వీటన్నింటినీ ఒకే సిద్ధాంతానికి చెందిన ఉపవిభాగాలుగా చూడటం కంటే, వాస్తవాన్ని వివిధ కోణాల్లో అర్థం చేసుకోవడానికి సాహిత్యం చేసిన భిన్నమైన ప్రయత్నాలుగా చూడటం సముచితం. వాస్తవికతకు సంబంధించిన భావనలు పందొమ్మిదో శతాబ్దానికి ముందే సాహిత్యంలో కనిపిస్తాయి. ప్రాచీన ఇతిహాసాలు, నాటకాలు, కథనాల్లోనూ సామాజిక జీవితం, మానవ స్వభావం, అధికార సంబంధాల చిత్రణ ఉంది. అయితే వాటిలో వాస్తవికతతోపాటు పురాణం, వీరగాథ, ఆదర్శీకరణ, దైవిక జోక్యం వంటి అంశాలు కూడా ప్రముఖంగా ఉండేవి. ఆధునిక వాస్తవికత ప్రత్యేక సాహిత్య ధోరణిగా ఎదగడానికి యూరప్‌లో పద్దెనిమిదో శతాబ్దపు జ్ఞానోదయ భావజాలం, మధ్యతరగతి ఎదుగుదల, నవలా ప్రక్రియ అభివృద్ధి ముఖ్యమైన నేపథ్యాన్ని అందించాయి. వ్యక్తి అనుభవం, దైనందిన జీవితం, సామాజిక స్థితిగతులు సాహిత్యానికి తగిన విషయాలుగా గుర్తింపు పొందాయి. పందొమ్మిదో శతాబ్దంలో యూరప్‌లో పారిశ్రామిక విప్లవం, పట్టణాల విస్తరణ, పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుగుదల, కొత్త మధ్యతరగతి జీవన విధానాలు సమాజాన్ని వేగంగా మార్చాయి. ఈ మార్పులు సాహిత్యానికి కొత్త ప్రశ్నలను అందించాయి. సంపద ఎలా ఏర్పడుతుంది? పేదరికం ఎందుకు కొనసాగుతుంది? కుటుంబం, వివాహం, ఆస్తి, సామాజిక గౌరవం వ్యక్తి జీవితాన్ని ఎలా నియంత్రిస్తాయి? చట్టం అందరికీ సమానంగా పనిచేస్తుందా? ఇటువంటి ప్రశ్నలు రచయితల దృష్టిని ఆకర్షించాయి. ఫలితంగా, ఊహాజనిత వీరులకంటే సాధారణ మనుషులు, వారి కుటుంబాలు, వృత్తులు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక పరిమితులు నవలల్లో ప్రధాన పాత్రలు పోషించడం ప్రారంభించాయి.

ఫ్రాన్స్‌లో ఆనోరే దె బాల్జాక్ తన 'లా కామెడీ హ్యూమేన్' రచనల సముదాయంలో వివిధ వర్గాల ప్రజ



లు, ఆర్థిక సంబంధాలు, అధికార ఆశలు, సామాజిక ఎదుగుదల కోసం జరిగే పోరాటాలను విస్తృతంగా చిత్రించాడు. గుస్తావ్ ఫ్లోబేర్ రచించిన 'మాదామ్ బొవరీ'లో వ్యక్తిగత ఆకాంక్షలు, రొమాంటిక్ కల్పనలు, ప్రాంతీయ మధ్యతరగతి జీవితంలోని పరిమితుల మధ్య ఏర్పడే ఘర్షణను సూక్ష్మంగా చూపించాడు. ఇంగ్లండ్‌లో చార్లెస్ డికెన్స్ తన 'హార్డ్ టైమ్స్' వంటి రచనల్లో పారిశ్రామిక సమాజంలోని అమానవీయ పరిస్థితులను, పేదల జీవితాలను, విద్యా వ్యవస్థలోని యాంత్రికతను ప్రశ్నించాడు. జార్జ్ ఎలియట్ రచించిన 'మిడిల్ మార్చ్' ఒక చిన్న పట్టణంలోని అనేక పాత్రల జీవితాల ద్వారా వ్యక్తిగత ఆశయాలు, సామాజిక బాధ్యతలు, రాజకీయ మార్పులు పరస్పరం ఎలా ప్రభావితం చేసుకుంటాయో వెల్లడిస్తుంది. అయితే, వీరంతా ఒకే శైలిలో రాయలేదు. అయినప్పటికీ, వ్యక్తి జీవితాన్ని అతను నివసించే సామాజిక ప్రపంచం నుంచి వేరుచేసి చూడకపోవడం అనేది వారి రచనల్లో కనిపించే సాధారణ లక్షణం.

ఈ దశలో అభివృద్ధి చెందిన సామాజిక వాస్తవికత సాహిత్యాన్ని వ్యక్తిగత జీవిత చిత్రణకు పరిమితం చేయకుండా, సమాజంలోని అసమానతలు, పేదరికం, వర్గభేదాలు, లింగ సంబంధాలు, కార్మికుల దోపిడీ, అధికార వ్యవస్థల ప్రభావం వంటి అంశాలను పరిశీలించే సాధనంగా ఉపయోగించుకునే స్థాయికి తీసుకెళ్లింది. సామాజిక వాస్తవిక రచయిత దృష్టిలో ఒక వ్యక్తి ఎదుర్కొనే కష్టం కేవలం అతని వ్యక్తిగత వైఫల్యం కాకపోవచ్చు. దాని వెనుక నిరుద్యోగం, ఆస్తి సంబంధాలు, కులం, వర్గం, లింగం లేదా ఇతర సామాజిక వ్యవస్థలు ఉండవచ్చు. అందుకే సామాజిక వాస్తవికతలో వ్యక్తి కథ క్రమంగా సమాజపు కథగా మారుతుంది. అయితే వాస్తవికతను కేవలం సమాజంలోని బాహ్య పరిస్థితులతో వివరించడం సరిపోదని మరో సాహిత్య ధోరణి సూచించింది. పందొమ్మిదో శతాబ్దంలోనే సహజవాదం (నేచురలిజం) అభివృద్ధి చెందింది. ఎమిల్ జోలా వంటి రచయితలు మనిషి ప్రవర్తనపై వారసత్వం, పర్యావరణం, పేదరికం, శారీరక అవసరాలు, సామాజిక పరిస్థితులు చూపే ప్రభావాన్ని పరిశీలించారు. సహజవాదంలో మానవ జీవితం కొన్నిసార్లు వ్యక్తి నియంత్రణకు అతీతమైన శక్తుల చేత ప్రభావితమయ్యే ప్రక్రియగా కనిపిస్తుం ది. సాధారణ వాస్తవికత పాత్రల జీవితాన్ని సమాజంతో అనుసంధానిస్తే, సహజవాదం ఆ జీవితాన్ని నిర్దిష్ట పరిస్థితులు ఎలా మలుస్తాయో మరింత తీవ్రంగా విశ్లేషిస్తుంది. పందొమ్మిదో శతాబ్దం చివరికి వచ్చేసరికి, సమాజాన్ని అర్థం చేసుకున్నంత మాత్రాన మనిషిని పూర్తిగా అర్థం చేసుకోగలమా? మనిషి ప్రవర్తనకు బాహ్య పరిస్థితులే కారణమా, లేక అతని అంతర్గత కోరికలు, అణచివేసిన భావాలు, జ్ఞాపకాలు, అపరాధ భావం కూడా కీలక పాత్ర పోషిస్తాయా? వంటి ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో మానసిక వాస్తవికత (సైకలాజికల్ రియలిజం) ధోరణి ప్రాధాన్యత పెరిగింది. ఫ్యోదర్ దోస్తయెవ్‌స్కీ రచించిన 'క్రైమ్ అండ్ పనిష్మెంట్'లో రస్కోల్నికోవ్ నేరం చేయడం కంటే, ఆ నేరం తరువాత అతను అనుభవించే మానసిక సంఘర్షణే కథకు ప్రధానమైనది. హెన్రీ జేమ్స్ రచించిన 'ది పోర్ట్రెయిట్ ఆఫ్ ఎ లేడీ'లో వ్యక్తిగత స్వేచ్ఛ, నిర్ణయాలు, ఇతరుల ఉద్దేశాలను అర్థం చేసుకోవడంలో ఏర్పడే సంక్లిష్టతలు ప్రాధాన్యత పొందుతాయి. తదనంతరం వర్జీనియా వూల్ఫ్, జేమ్స్ జాయిస్ వంటి ఆ ధునిక రచయితలు కాలం, జ్ఞాపకం, చేతనాప్రవాహం వంటి కథన పద్ధతుల ద్వారా మానవ మనస్సును మరింత ప్రయోగాత్మకంగా చిత్రించారు. ఇక్కడ వాస్తవికత బాహ్య ప్రపంచం నుంచి అంతరంగ ప్రపంచం వైపు విస్తరించింది.

ఇరవయ్యో శతాబ్దంలో వాస్తవికతకు రాజకీయ స్వరూపం కూడా మరింత స్పష్టమైంది. ముఖ్యంగా సామ్యవాద వాస్తవికత (సోషలిస్ట్ రియలిజం) సాహిత్యాన్ని సామాజిక మార్పు, వర్గపోరాటం, విప్లవాత్మక ఆశయాలతో అనుసంధానించింది. 1934లో సోవియట్ రచయితల తొలి మహాసభలో ఇది అధికారిక సాహిత్య సిద్ధాంతంగా స్థిరపడింది. కార్మికులు, రైతులు, సాధారణ ప్రజలు కొత్త సమాజ నిర్మాణంలో పోషించే పాత్రను చిత్రించడం దీని ప్రధాన లక్ష్యాలలో ఒకటి. మాక్సిమ్ గోర్కీ రచించిన 'మదర్' ఈ సంప్రదాయానికి ముందస్తు ప్రభావవంతమైన ఉదాహరణ. ఇదే సమయంలో ప్రపంచ సాహిత్యంలో వాస్తవికతకు మరికొన్ని రూపాలు అభివృద్ధి చెందాయి. 'అమెరికన్ వాస్తవికత', 'ప్రాంతీయ వాస్తవికత', 'విమర్శనాత్మక వాస్తవికత', 'కార్మిక వర్గ వాస్తవికత' వంటి ధోరణులు నిర్దిష్ట సమాజాల అనుభవాలను ప్రతిబింబించాయి. వలసపాలన, జాతి వివక్ష, కుల అసమానతలు, మహిళల అణచివేత వంటి అంశాలను కేంద్రంగా చేసుకున్న రచనలు కూడా వాస్తవికత పరిధిని విస్తరించాయి. యుద్ధానంతర కాలంలో అస్తిత్వవాద సాహిత్యం, ఆధునికవాదం, ఉత్తరాధునికవాదం వాస్తవాన్ని ఒకే స్థిరమైన దృష్టితో అర్థం చేసుకోవచ్చా? అనే ప్రశ్నను లేవనెత్తాయి. మానవ అనుభవం విచ్ఛిన్నంగా, అనిశ్చితంగా, పరస్పర విరుద్ధంగా ఉంటే, సాహిత్యం కూడా అదే సంక్లిష్టతను ప్రతిబింబించాలనే భావన బలపడింది.

ఇతర రూపాలైన 'వ్యంగ్య వాస్తవికత', 'విమర్శనాత్మక వాస్తవికత', 'గ్రామీణ వాస్తవికత', 'పట్టణ వాస్తవికత', 'మురికి వాస్తవికత' (డర్టీ లియమిజం), 'ఉత్తరాధునిక వాస్తవికత' వంటి పదాలు కూడా సాహిత్య విమర్శలో వినిపిస్తాయి. వీటన్నింటికీ ఒకే స్థాయి చారిత్రక గుర్తింపు లేదా ఒకే రకమైన సిద్ధాంతపరమైన నిర్వచనం ఉండదు. ఈ రూపాలు పరస్పరం పూర్తిగా వేరుపడవు. ఒకే నవలలో సామాజిక, మానసిక, చారిత్రక, మాంత్రిక వాస్తవికతల లక్షణాలు కలిసివుండవచ్చు. అందువల్ల సాహిత్యాన్ని వివిధ రకాల వాస్తవికతల ఆధారంగా అధ్యయనం చేయడం ఉపయోగకరమే అయినప్పటికీ, ప్రతి రచనను ఒకే వర్గంలో బంధించడం దాని సృజనాత్మకతను పరిమితం చేయవచ్చు. గొప్ప సాహిత్యం వాస్తవాన్ని యథాతథంగా చూపించడమే కాకుండా, మనం సాధారణంగా గమనించని సత్యాలను గుర్తించేలా చేస్తుంది. ఒక పేదవాడి ఆకలి వెనుక ఉన్న ఆర్థిక వ్యవస్థను, ఒక నేరస్థుడి మనస్సులోని సంఘర్షణను, ఒక మహిళ నిర్ణయాల వెనుక ఉన్న సామాజిక ఒత్తిడిని, ఒక సమాజపు పురాణాల్లో దాగి ఉన్న చారిత్రక అనుభవాన్ని వెలుగులోకి తెస్తుంది. కాబట్టి, వాస్తవికత అనేది సాహిత్యం జీవితాన్ని ఎంత ఖచ్చితంగా అనుకరిస్తుందనే ప్రశ్న మాత్రమే కాదు. జీవితం గురించి మన అవగాహనను ఎంత లోతుగా మారుస్తుందనే ప్రశ్న కూడా. కాలం మారినప్పుడల్లా సమాజం కొత్త సమస్యలను ఎదుర్కొంటుంది. ఆ సమస్యలను అర్థం చేసుకోవడానికి సాహిత్యం కొత్త దృక్కోణాలను, కొత్త కథన పద్ధతులను సృష్టిస్తుంది. అందుకే వాస్తవికతకు ఒకే అంతిమ రూపం లేదు. అది మానవ జీవితం మారుతున్న కొద్దీ మారుతూ, విస్తరిస్తూ, సాహిత్యానికి నిరంతరమైన విమర్శనాత్మక శక్తిని అందించే ప్రక్రియగా కొనసాగుతుంది.

– బిఎల్

## ఈ వారం కవితలు

### ఎంత గొప్పదానివే తల్లీ 'ఎఐ'!



ఎంత గొప్పదానివే తల్లీ ఎఐ!
నీకు కోటి కోటి దండాలు!
నువ్వు మానవ మేధస్సుకు దీటుగా
ప్రతి పనికీ ప్రత్యేక ప్రోగ్రామింగ్
అవసరం లేకుండానే నేర్చుకోగలవు.
సమస్యలను పరిష్కరించగలవు.

నిర్ణయాలను తీసుకోగలవు!
నువ్వు పనిచేయని రంగమేది?
అంతటా నీవే! నువ్వు లేని చోటేది?
నువ్వు లేకుండా ఏ పనీ సాగని పరిస్థితి!
కానీ...మరో కోణంలో చూస్తే,
నువ్వు సమాజానికి విషాదమైతివి.

కాసుల పంటగా మారితివి!
కార్పొరేట్లకు
కాసుల వర్షం కురిపిస్తూ,
కార్మికుల కడుపు కొట్టే
శక్తిగా ఎదిగితివి!

ఉద్యోగాల స్థానంలోకి చొరబడి,
నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తూ,
మానవ శ్రమకు విలువను
తగ్గించే ముప్పుగా మారితివి!
ఏఐ తల్లీ! నీ విజ్ఞానం మానవాళికి
ఎల్లవేళలా ప్రయోజనకరంగా
ఉండాలి!
నీ వినియోగం కార్పొరేట్లకే
లాభాల పంట పండిస్తోంది!

అది నిజంగా విషాదమే!
మానవ మేధస్సుకు నీవు తోడైతే
అది మానవాళికి
మహా ప్రయోజనం!
మానవ శ్రమను నీవు మింగేస్తే
దోపిడీదారుల పక్షాన నిలిచినట్లే!

– డా.మార్క శంకర్ నారాయణ

### జయహో గీతపనివారల సంఘమా



తాటి, ఈత
వనంతో పెనవేసుకున్న
గీతన్నల బ్రతుకులు
ఎక్కేచెట్టు దిగే చెట్టు
బొట్టు బొట్టు కల్లును
కుండలో వడిసిపట్టే వృత్తి

మోకు ముస్తాదుగట్టి
తాటి చెట్టు మొదళ్ళనుంచి
చివరిదాకా ఎగబాకుతూ
ఎప్పుడు కాలుజారునో
ఎప్పుడు కర్మమూడునే
ఎరుగని జీవనసమరమే

దినదిన గండం నూరేళ్ళ
ఆయుష్షు చందం గీతన్నల
బ్రతుకు పోరాటం నిత్యం
తాలిబొట్టు కళ్ళకద్దుకొని
భర్తను కాపాడమంటూ
కాటమయ్యను వేడుకొనే
గౌడమ్మల దీన గాథల వృత్తి

భూమికోసం భుక్తి కోసం
బానిస బ్రతుకు విముక్తి కోసం
సాగిన సాయుధ సమరంలో
దున్నేవాడిదే భూమంటూ
గీసే వానిదే చెట్టంటూ
మోగిందొక సమరనినాదం

ఆ నినాదమే ధర్మభిక్షం
చేతికి ఆయుధమయ్యింది.
త్రివిధ పన్నులు రద్దంటూ
హర్రాజ్ విధానం వద్దంటూ
సాగించిన సమరానికి
తొలి మెట్టయ్యింది.

ధర్మభిక్షం స్థాపించిన
గీతపనివారల సంఘానికి
'గార్ల' పురిటి గడ్డయ్యింది.
ఆ గడ్డమీద ఉదయించిన సంఘం
69 వసంతాల ఉద్యమమైయ్యింది.

– బొమ్మగాని నాగభూషణం

(గీత పనివారల సంఘం 19-10-2026 నాటికి 69 వసంతాలు పూర్తిచేసుకొని 70వ వసంతంలోకి ప్రవేశం సందర్భంగా)

# తలపులను మేలుకొలిపే 'తటిల్లతలు'

సామాజిక బాధ్యతగా సమాజ హితాన్ని కోరుతూ కవులు కవిత్వం రాస్తుంటారు. ఆ దృక్పథంతోనే కవి ఆనందాచారి 'తటిల్లతలు' కవితా సంపుటిని వెలువరించారు. 'తటిల్లతలు' అంటే మెరుపు తీగలు. 105 చిట్టిపొట్టి కవితలకు స్థానం కల్పిస్తూ, అనేక సమకాలీన జీవిత సత్యాలను, మానవీయ కోణంలో స్పందిస్తూ, తాత్విక చింతనతో, ప్రేమ భావనలతో మానవ భావోద్వేగాలన్నింటిని గుదిగుచ్చి, తెలుగు సాహితీ లోకంలోకి అడుగుపెట్టిన మరో కవితా సంపుటి 'తటిల్లతలు'. రచయిత అపారమైన జీవితా నుభవం, లోక పరిశీలన, నిరంతర అధ్యయనం అక్షరాల రూపంలో ప్రవహించింది. కవిత్వమై ప్రతిధ్వనించింది. అందుకే, 'ధ్వనిస్తూ వచ్చాను/ ధ్వనిస్తూనే పోతాను/మధ్య ప్రతిధ్వనే జీవితం' అంటాడు. అదే విధంగా, 'నిజాలు మరుగున/ అబద్ధాలు వెలుగున/ ఆశల లోకం/ వెలిగే శోకం' అని వాస్తవాన్ని కళ్ల ముందు ఉంచుతాడు. 'మన ఆలోచనలను అనివార్యంగా మార్చేది ఆచరణే!' అంటూ, తక్కువ పదాల కూర్పుతో లోతైన గంభీరమైన భావాన్ని స్ఫురింపచేశారు. అవసరాన్ని బట్టి ఈ కవితలు మూడు లైన్ల నుంచి ఎనిమిది లైన్ల వరకు నిడివిని కలిగి ఉండడం మనం గమనించవచ్చు. ఈ కవితలకు ప్రత్యేకమైన నిర్దిష్టమైన నియమాలేమి లేవు. అలా లేకపోవడమే ఓ ప్రత్యేకత. ఒక మృదువైన అనుభూతిగా పలకరిస్తున్న ఓ కవిత 'ఇలా పలకరించానంతే/ వేల జ్ఞాపకాల మూటను/ విప్పి పోసింది మనసు/ వాటిలో కన్నీటి జ్ఞాపకమే/



తీయగా తాకింది' అంటాడు. నిజమే. పలకరింపులన్నీ వర్తమానాలే కానక్కర్లేదు. అందులో గతాలు కూడా ఉంటాయి. మరోచోట 'కన్నీళ్ళ నీడలో/ నీ జ్ఞాపకాలు/ నన్ను ముంచెత్తుతాయి / అందుకే/ దుఃఖం నాకొక/ మధురానుభూతి' అంటున్నాడు. తీయని బాధగా మధురానుభూతిగా కన్నీటి జ్ఞాపకాలనే కవి ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నాడు. 'గతము తలచి వగచేకన్నా సౌఖ్యమే లేదు' అంటూ సీనియర్ సముద్రాల మాటలను గుర్తుచేసుకుంటే, ఏడవడంలోనూ ఆనందం ఉందని చెప్పడం కవులకే సాధ్యం అనిపిస్తుంది. కవులు ఇంతేనేమో! కవి హృదయమంటే ఇదేనేమో! 'నువ్వు/ రాకున్నా పర్వాలేదు/ కానీ కనీసం నీకోసం/ ఎదురు చూసే చూపుల్ని/ అడ్డుకోకు' ఎంతటి హృద్యమైన విశాలమైన ప్రేమ భావన ఇది. ప్రేమను ఇంతకన్నా గొప్పగా ఎవరు మాత్రం వ్యక్తం చేయగలరు. ఈ రకమైన వ్యక్తీకరణ నేటి సమాజానికి ముఖ్యంగా యువతరానికి చాలా అవసరం. ప్రేమంటే వేధింపు కాదు. వెంటపడడం కాదు. మౌనంగా ఆరాధించడం. దుఃఖానికి సంబంధించి కూడా ఇందులో అనేక కవితలు ఉన్నాయి. 'దుఃఖాన్ని తొలగించమని/ దేవున్ని వేడుకున్నాడు మానవుడు/ శతాబ్దాలు గడిచాయి/ దుఃఖ సముద్రం పెరుగుతూనే ఉంది/ గుళ్లూ దేవుళ్లూ, కన్నీళ్లూనూ!' అంటారు. నేడు విశ్వవ్యాప్తమై ఉన్నది దుఃఖ రసమేనంటూ, 'కవి.. ఆ కన్నీళ్లను కొన్ని/ అక్షరాలపై నించి చూడు/ అవి ప్రవహించి వెల్లువెత్తి/ కావ్యమౌతాయి కరుణమౌతాయి!' అంటూ కర్తవ్యాన్ని ఉపదేశిస్తూ సందేశమవుతున్నాడు కవి. ఇలా చెప్పూపోతే ఎన్నో అనుభూతులు... ఎన్నో ప్రత్యేకతలు. సరళత, స్పష్టత, పదాల క్లుప్తత, భావగాఢత ఆనందచారి రచనాశైలి. కవిత్వం జీవితం రెండూ పురి అల్లుకొని సాగడం ఆయన కవిత్వపు నడక. ఇందులోని ప్రతి కవితా ఆణిముత్యమే. ఈ కవితల సమాహారం అన్నిభావాల రుచులను, భావోద్వేగాలను కళాత్మకంగా అందించింది. ఇవి మెరుపు కవితలే కానీ, చదివి మరిచిపోయే కవితలు మాత్రం కావు. తలపులను మేల్కొల్పే తటి ల్లతలు ఇవి. వాటి భావపు వెలుగు మనలో మిగిలి ఉంటుంది.

– సమీక్ష: గడ్డం సులోచన,
7702891559.

# ప్రాచీనజ్ఞానం నుంచి క్వాంటం రహస్యాల వరకు..

ప్రాచీన భారతీయ తాత్విక ఆలోచనలు, పురాణ రహస్యాలు, ఆధునిక విజ్ఞానశాస్త్ర భావనలు కలిస్తే ఎలా ఉంటుంది? చరిత్ర, విశ్వాసం, చైతన్యం, విశ్వం ఉనికికి సంబంధించిన ప్రశ్నలను కల్పనతో మేళవిస్తే ఎలాంటి కథ ఆవిష్కృతమవుతుంది? రచయిత శమిత్ బాగ్చీ రచించిన 'బ్లడ్‌స్టోన్' నవల ఇలాంటి ఆసక్తికరమైన అంశాలతో పాఠకుల ముందుకు వచ్చింది. 2026 ఫ్రాంక్‌ఫర్ట్ పుస్తక ప్రదర్శనలో హబ్‌హాక్స్ ఈ నవలను అంతర్జాతీయ ప్రచురణ రంగానికి పరిచయం చేసింది. రచయిత స్వయంగా ప్రదర్శనలో పాల్గొనడం ఈ పరిచయానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. 'బ్లడ్‌స్టోన్' ప్రత్యేకత వివిధ ఆలోచనా ప్రపంచాలను ఒకే కథనంలో అనుసంధానించడంలో ఉంది. భారతీయ తాత్విక సంప్రదాయాల్లోని ప్రాచీన జ్ఞానం ఒకవైపు, క్వాంటం సిద్ధాంతంతో ముడిపడిన ఆధునిక శాస్త్రీయ భావనలు మరోవైపు ఈ నవలలో ఆసక్తికరమైన నేపథ్యాన్ని ఏర్పరుస్తాయి. పురాణం, మిస్టరీ, ఊహాజనిత సాహిత్య లక్షణాలను మేళవిస్తూ, మనిషికి తెలిసిన ప్రపంచానికి అవతల ఇంకా ఎలాంటి రహస్యాలు ఉండవచ్చనే ప్రశ్నను రచయిత పాఠకుల ముందుంచుతారు. భారతీయ తాత్విక సంప్రదాయాలు ఆత్మ, చైతన్యం, ఉనికి, విశ్వ స్వరూపం వంటి అంశాలపై శతాబ్దాలుగా ఆలోచనలను ప్రతిపాదించాయి. ఆధునిక విజ్ఞానశాస్త్రం కూడా విశ్వ నిర్మాణం, పదార్థ స్వభావం, సూక్ష్మ స్థాయి భౌతిక ప్రక్రియలను అర్థం చేసుకునేందుకు నిరంతరం పరిశోధనలు చేస్తోంది. ఈ రెండు రంగాల మధ్య సంబంధాల ను అన్వేషించడం ఆసక్తికరమైన సాహిత్య ప్రయత్నమే. అయితే తాత్విక భావనలకు, శాస్త్రీయం గా నిరూపితమైన సిద్ధాంతాలకు మధ్య తేడాను గుర్తించడం కూడా అంతే ముఖ్యం. ఈ నేపథ్యం లో 'బ్లడ్‌స్టోన్'ను శాస్త్రీయ పరిశోధనా గ్రంథంగా కాకుండా, విజ్ఞానం, తత్వశాస్త్రం, పురాణాల స్ఫూర్తితో రూపొందిన కల్పనా రచనగా చూడాలి. నేటి పాఠకులు సంప్రదాయ కథనాలతోపాటు చరిత్ర, విజ్ఞానం, తత్వశాస్త్రాల మధ్య సంబంధాలను అన్వేషించే రచనలపైనా ఆసక్తి చూపుతున్నారు. ఇటువంటి



సాహిత్యం తెలిసిన విషయాలను కొత్త కోణంలో చూడటానికి, సమాధానాలు లేని ప్రశ్నలను పరిశీలించడానికి ప్రేరణ కలిగిస్తుంది. అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనల్లో భారతీయ రచనలకు లభించే ప్రాతినిధ్యం కూడా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఫ్రాంక్‌ఫర్ట్ పుస్తక ప్రదర్శన ప్రపంచవ్యాప్తంగా రచయితలు, ప్రచురణకర్తలు, సాహిత్య ప్రతినిధులు కలుసుకునే వేదిక. ఈ వేదికపై 'బ్లడ్‌స్టోన్'ను పరిచయం చేయడం ద్వారా హబ్‌హాక్స్ భారతీయ ఆలోచనా సంప్రదాయాల స్ఫూర్తితో రూ పొందిన కథనాన్ని విస్తృత పాఠకలోకానికి చేరు వ చేసే ప్రయత్నం చేసింది. గతంలోని జ్ఞానాన్ని వర్తమాన ప్రశ్నలతో అనుసంధానిస్తూ, తెలియని ప్రపంచం పట్ల ఆసక్తిని రేకెత్తించడమే ఈ నవల ప్రధాన ఆకర్షణ. ప్రాచీన ఆలోచనలైనా, ఆధునిక శాస్త్రీయ అన్వేషణలైనా.. మనిషి తన ఉనికిని, విశ్వ స్వరూపాన్ని అర్థం చేసుకోవాలనే నిరంతర ప్రయత్నమే వాటి వెనుక ఉన్న ఉమ్మడి ప్రేరణ.

## చదవాల్సిన పుస్తకాలు

### రెండు పుస్తకాలు.. రెండు దృక్కోణాలు




మనుషుల జీవితాలను అర్థం చేసుకోవడానికి మనుషుల కథలే అవసరమా? మూగజీవుల అనుభవాలు మానవ సంబంధాల గురించి ఏమి నేర్పగలవు? ఒక మహిళ తనకు సమాజం నిర్దేశించిన పాత్రలను దా టి, తనదైన వ్యక్తిత్వాన్ని ఎలా నిర్మించుకోగలదు? ఈ ప్రశ్నలకు సాహిత్య రూపంలో సమాధానాలు అన్వేషిస్తున్న రచయిత తుషార్ ఛటర్జీ. ఆయన రచించిన 'బిహైండ్ దోస్ ఐస్', 'బికమింగ్ హర్' అనే రెండు పుస్తకాలను హబ్‌హాక్స్ సంస్థ 2026 ఫ్రాంక్‌ఫర్ట్ పుస్తక ప్రదర్శనలో అంతర్జాతీయ ప్ర చురణ రంగానికి పరిచయం చేసింది. భిన్నమైన అంశాలను ఎంచుకున్నప్పటికీ, ఈ రెండు రచనల్లోనూ మానవీయ అనుభూతులు, అనుభవాల ప ట్ల సానుభూతి, వ్యక్తిత్వ వికాసం ప్రధానాంశాలుగా నిలుస్తాయి. 'బిహైం డ్ దోస్ ఐస్' పుస్తకంలో పికు, నల, లైలా, చెల్సీ, డాలీ, రాణి అనే ఆరు కుక్కల జీవితాల ద్వారా రచయిత భావోద్వేగ ప్రపంచాన్ని ఆవిష్కరించా రు. ఆనందం, విషాదం, అనుబంధం, ద్రోహం, అమాయకత్వం, అనుభవాల ద్వారా కలిగే అవగాహన వంటి అంశాలు ఈ కథల్లో కనిపిస్తాయి. సాధారణంగా కుక్కలను విశ్వాసానికి, ప్రేమకు ప్రతీకలుగా చూస్తాం. అ యితే ఈ రచన వాటి జీవితాలను కేవలం మనుషులకు తోడుగా ఉండే జంతువుల కథలుగా పరిమితం చేయదు. వాటి అనుభవాల ద్వారా మాన వ సంబంధాల్లోని సంక్లిష్టతను పరిశీలిస్తుంది. మనుషులు తమ భావాలను మాటలతో వ్యక్తం చేస్తారు. కానీ జంతువులు మాటలతో సంబంధం లేకుండానే ప్రేమను, విశ్వాసాన్ని, బాధను వ్యక్తపరుస్తాయి. వాటి ప్రవర్తనను గమనించినప్పుడు మనుషుల సంబంధాల్లో కనిపించే స్వార్థం, అనురాగం, క్షమాగుణం, నిరాశ వంటి భావాలను కొత్త కోణంలో అర్థం చేసుకోవచ్చు. ఇతర జీవుల అనుభవాలను గుర్తించడం ద్వారానే నిజమైన సానుభూతి ప్రారంభమవుతుందనే భావన ఈ పుస్తకంలో అంతర్లీనంగా కనిపిస్తుంది. కాగా, 'బికమింగ్ హర్' పుస్తకం మహిళల జీవితాల్లోని భా వోద్వేగ సంఘర్షణలు, సంబంధాలు, సామాజిక అంచనాలు, స్వీయగుర్తింపు అన్వేషణపై దృష్టి సారిస్తుంది. ఆరు కథలతో కూడిన ఈ సంకలనం మహిళలు ఎదుర్కొనే ప్రేమ, విరహం, నిరాశ, బాధ్యతలు, వ్యక్తిగత స్వే చ్ఛ వంటి అంశాలను వివిధ కోణాల్లో పరిశీలిస్తుంది. సమాజంమహిళల కు నిర్దేశించే పాత్రలు, కుటుంబం విధించే అంచనాలు, సంప్రదాయ విశ్వాసాలు వారి వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తుంటాయి. అయితే ఒక మహిళ తన జీవితాన్ని ఇతరుల అభిప్రాయాలకు అనుగుణంగా మాత్రమే నడపాల్సిన అవసరం లేదు. తన అనుభవాలను అర్థం చేసుకుంటూ, తనకు తానుగా నిర్ణయాలు తీసుకుంటూ, నష్టాల నుంచి కోలుకుంటూ కొత్త జీవితాన్ని ప్రారంభించవచ్చు. ఈ పరివర్తన ఒక్కసారిగా జరిగే అద్భుతం కాదు. అనేక సందేహాలు, సంఘర్షణలు, ఆత్మపరిశీలనలతో కూడిన నిరంతర ప్రయాణం. బలహీనతలు, అనిశ్చితి ఉన్నప్పటికీ తన జీవితాన్ని తిరిగి నిర్మించుకోవడంలోనే మహిళల అంతర్గత బలం వ్యక్తమవుతుందని ఈ రచన సూచిస్తుంది.

ఈ రెండు పుస్తకాల మధ్య ప్రధానమైన అనుసంధానం ఇతరుల అంతరంగాన్ని అర్థం చేసుకోవాలనే తపన. ఒకటి జంతువుల అనుభవాల ద్వారా మానవ సంబంధాలను పరిశీలిస్తే, మరొకటి మహిళలు తమ వ్యక్తిత్వాన్ని, స్వతంత్ర నిర్ణయాధికారాన్ని ఎలా సాధించుకుంటారో వివరిస్తుంది. పైకి కనిపించే ప్రవర్తన వెనుక దాగి ఉన్న భావోద్వేగాలను గుర్తించడం, ముందస్తు అభిప్రాయాలను ప్రశ్నించడం, ఇతరుల అనుభవాలకు విలువ ఇవ్వడం ఈ రచనల్లోని ఉమ్మడి లక్షణాలు. భారతదేశంలోని ఉక్కు నగరంగా ప్రసిద్ధి చెందిన జంషెడ్‌పూర్‌లో పెరిగిన తుషార్ ఛటర్జీకి ప్రయాణాలు, ఎత్తైన పర్వత ప్రాంతాల్లో పర్యటనలు, లోతైన సంభాషణలు, సినిమాలపై ఆసక్తి సృజనాత్మక ప్రేరణనిస్తాయి. తన వృత్తిపరమైన జీవితంతోపాటు సాహిత్య రచనను కొనసాగిస్తున్న ఆయనకు జీవితం స్వీయపరిశీలనకు ప్రధానమైన పాఠశాలగా నిలుస్తోంది. '2026 ఫ్రాంక్‌ఫర్ట్ పుస్తక ప్రదర్శన'లో ఈ రెండు రచనలను అంతర్జాతీయ పాఠకులకు పరిచయం చేయడం వాటి విభిన్న దృక్పథాలను విస్తృత సాహిత్య వేదిక పైకి తీసుకెళ్లే ప్రయత్నం. జంతువుల నిశ్శబ్ద అనుభవాలైనా, మహిళల ఆత్మగౌరవ పోరాటాలైనా, ఇతరుల జీవితాలను మరింత శ్రద్ధగా అర్థం చేసుకోవాలనే మానవీయ సందేశమే ఈ రెండు పుస్తకాల అంతరార్థం.

### నైతిక నిశ్చయంపై ప్రశ్నలు..

మనిషి చేసే ప్రతి పనికీ అతని ఉద్దేశమే కొలమానమా? మంచి చేయాలనే సంకల్పంతో తీసుకున్న నిర్ణయం ఇతరులకు హాని కలిగిస్తే, ఆ వ్యక్తిని మంచివాడిగా పరిగణించగలమా? మనం నమ్మిన విలువలే ఇతరుల స్వేచ్ఛను హరిస్తే, మన నైతికతను మరోసారి పరిశీలించుకోవాల్సిన అవసరం లేదా? ఇలాంటి అసౌకర్యకరమైన, ఆలోచనాత్మకమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది ప్రశాంత్ కుమార్ వినకొటా రచించిన 'వై గుడ్ పీపుల్ ఆర్ యాక్చువల్లీ డేంజరస్' పుస్తకం. 2026 ఫ్రాంక్‌ఫర్ట్ పుస్తక ప్రదర్శనలో హబ్‌హాక్స్ ఈ రచనను అంతర్జాతీయ పాఠకులకు పరిచయం చేసింది. సమాజానికి హాని చేసేవారంతా తప్పనిసరిగా దురుద్దేశాలతోనే వ్యవహరించరని, ఒక్కోసారి తాము చేస్తున్నది సరైనదేనని గాఢంగా విశ్వసించే వ్యక్తులు కూడా ఇతరులకు నష్టం కలిగించవచ్చని ఈ పుస్తకం స్పష్టం చేస్తుంది. ఎందుకంటే, తమ నమ్మకాలపై అతిగా ఆధారపడినప్పుడు, తమ చర్యల పర్యవసానాలను పరిశీలించే సామర్థ్యాన్ని వారు కోల్పోవచ్చు. మంచి ఉద్దేశం ఉందనే నమ్మకం, తమ తప్పులను గుర్తించకుండా చేసే రక్షణ కవచంగా మారవచ్చు. సైరా, పాషి అనే రెండు పాత్రల జీవితాల చుట్టూ ఈ కథనం సాగుతుంది. వారి అనుభవాల ద్వారా మంచితనం, నైతికత, వ్యక్తిగత నమ్మకాలకు సంబంధించిన సాధారణ అవగాహనలను రచయిత ప్రశ్నిస్తాడు. ఇతరులను రక్షించాలనే ఉద్దేశంతో రూపొందించిన నియమాలే కొన్నిసార్లు వారిని ఒంటరితనానికి గురిచేయవచ్చు. సరైనదని భావించిన నిర్ణయమే సంబంధాలను దెబ్బతీయవచ్చు. ఈ విధంగా వ్యక్తిగత ఉద్దేశాలకు, వాటి వాస్తవ ప్రభావాలకు మధ్య




ఉండే అంతరాన్ని పుస్తకం పరిశీలిస్తుంది. ఈ భావనలను వివరించేందుకు రచయిత 'మిస్ట్', 'ట్రిల్' అనే రెండు ప్రత్యేక ఆలోచనా చట్రాలను ప్రతిపాదిస్తాడు. వ్యక్తి తన నమ్మకాలపై అతిగా ఆధారపడినప్పుడు అవగాహన ఎలా పరిమితమవుతుంది? మన దృక్పథం, వ్యక్తిత్వ భావన, విశ్వాసాలు మన నిర్ణయాలను ఎలా ప్రభావితం చేస్తాయి? అనే అంశాలను ఈ చట్రాల ద్వారా పరిశీలిస్తాడు. సంస్థాగత, సాంకేతిక వ్యవస్థల నిర్వహణలో దాదాపు రెండు దశాబ్దాల అనుభవం ఉన్న వినకొటా, వ్యక్తుల నిర్ణయాలు పెద్ద సంస్థల ద్వారా విస్తృత సమాజంపై ఎలా ప్రభావం చూపుతాయనే అంశాన్ని కూడా స్పృశిస్తాడు. నిర్ణయం తీసుకున్న వ్యక్తికి దాని పర్యవసానాలు వెంటనే కనిపించకపోవచ్చు. కానీ ఆ నిర్ణయాల ప్రభావాన్ని ఎదుర్కొనేది వాటిలో భాగస్వాములు కాని ఇతరులే కావచ్చు. ప్రతి విషయంలోనూ ఆత్మపరిశీలన అవసరమనే సందేశాన్ని ఈ పుస్తకం అందిస్తుంది. మనం మంచివాళ్లమని భావించడం కంటే, మన చర్యలు ఇతరులపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో తెలుసుకోవడం ముఖ్యం. మన నమ్మకాలపై ప్రశ్నలు వేసుకోవడం బలహీనత కాదు.. అది పరిపక్వతకు సంకేతం. మంచి ఉద్దేశాలు ఉండటం మాత్రమే సరిపోదు. వాటి ఫలితాల పట్ల బాధ్యత వహించడం కూడా అవసరం. మనం సరైనవాళ్లమని నిరూపించుకోవాలనే పట్టుదల కంటే, మన వల్ల ఎవరికైనా అన్యాయం జరుగుతోందేమోనని ప్రశ్నించుకునే వివేకమే నిజమైన నైతికతకు పునాది.

# అంజయ్య ప్రస్థానం నేటి తరానికి స్ఫూర్తిదాయకం



● టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ టి. అంజయ్య ప్రజాసేవా జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. అంజయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని లుంబినీ పార్క్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సామాన్య కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించిన టి.అంజయ్య అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ నిరంతరం ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అభిమానాన్ని చూరగొన్న అంజయ్య పేదల పెన్నిధిగా పేరొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వి.హనుమంతరావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెవిపి రామచంద్రరావు, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, సికింద్రాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దీపక్ జాన్, మాజీ ఆర్యవైశ్య కమిషన్ చైర్మన్ కల్వ సుజాత తదితరులు పాల్గొని టి. అంజయ్యకు నివాళులర్పించారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

● రహదారుల నిర్మాణానికి రూ. 90వేల కోట్లు

● ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి తొలి ప్రాధాన్యత నిస్తుందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదారులను అభివృద్ధి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఏన్కూరు, వైరా మండలాల్లో భట్టి విక్రమార్క పర్యటించారు. తొలుత ఏన్కూరు సమీపంలోని నాచారం అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే రూ.44 కోట్లతో నిర్మించే రహదారి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రహదారి నిర్మాణంతో భక్తులకు సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా స్థానికంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లతో పనులు చేపట్టామని తెలిపారు. ఇందులో గోదావరి పరివాహక ప్రాంత ఆలయాల అభివృద్ధికి రూ.2వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ.276 కోట్లు, బాసర ఆలయ అభివృద్ధికి రూ.354 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తున్నామని డైట్ ఛార్జీలను, కాస్మోటిక్ ఛార్జీలను పెంచామని తెలిపారు. రాష్ట్రంలో రూ.90 వేల కోట్ల రూపాయలతో రహదారుల అభివృద్ధి చేపట్టామని, విద్యుత్ డిమాండ్ 20వేల మెగా వాట్లకు పెరిగిన నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. వైరా నియోజక వర్గానికి సంబంధించి మరో బిటి రోడ్డును మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకు రావడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు. సాంప్రదాయ నృత్యాలు, డప్పు చప్పుళ్లతో భట్టికి ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీ నిర్వహించారు.

# ఎఐకెఎస్ మహాసభల లోగో ఆవిష్కరణ

● నల్లగొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు మహాసభలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా సమరశంఖం పూరించేందుకు అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) సిద్ధమవుతోంది. నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో జరిగే ఎఐకెఎస్ 36వ జాతీయ మహాసభల ప్రారంభం సందర్భంగా లక్ష మంది రైతులతో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు రైతు సంఘం నాయకులు వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో మహాసభల లోగోను ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1.58 కోట్లకుపైగా సభ్యులున్న ఎఐకెఎస్ రైతాంగ సమస్యలపై ఐక్య పోరాటాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా మహాసభలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్పొరేట్ అనుకూల విధానాలు, అసమాన మార్కెట్ వ్యవస్థ, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 850 మందికిపైగా ప్రతినిధులు, పరిశీలకులు, నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, నంద్యాల నర్సిహ్మారెడ్డి, పి.జంగారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాదినేని రమేష్, కందాల ప్రమీల, మల్లు నాగర్జునరెడ్డి, సహాయ కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, బొంతు రాంబాబు, మాటూరు బారాజుగౌడ్ లెల్లెల బాలకృష్ణ, ఉడత రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంవిఎస్ఆర్ యాజమాన్యంపై హత్యానేరం కేసు నమోదు

● ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్

● నిబంధనలు పాటించని ఎంవిఎస్ఆర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లోని ఎంవిఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 'దాండియా సంగమం' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో లైటింగ్ వ్యవస్థ కూలిపడి ఒక విద్యార్థిని మృతి చెందడం, పలువురు విద్యార్థులు గాయపడటం అత్యంత బాధాకరమని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన కళాశాల యాజమాన్యంపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, కళాశాల యజమానులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన ఎంవిఎస్ఆర్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమ నిర్వహణలో ఎంవిఎస్ఆర్ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, అనుమతులు లేకుండానే ఈవెంట్ నిర్వహించిందని, కళాశాల యాజమాన్యం పూర్తిగా ఉన్నత విద్యాశాఖ నిబంధనలు పాటించడం లేదని వారు వివరించారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పలు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువులు తక్కువ చెబుతూ ఈవెంట్లు ఎక్కువ నిర్వహిస్తున్నారని, ఇటీవల మల్లారెడ్డి కళాశాలలో సైతం సినిమా ఫంక్షన్ నిర్వహిస్తూ విద్యార్థులను పాశ్చాత్య సాంస్కృతి వైపు తీసుకెళ్తున్నారని వారు విమర్శించారు. అనుమతి లేకుండా ఈవెంట్లు నిర్వహిస్తూ విద్యార్థుల చదువులకు ఆటంకాలు కలిగిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో నిబంధనలు పాటించేలా ఉన్నత విద్యాశాఖ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

● కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల జూమ్ మీటింగ్‌లో నాయకులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహం అనుసరించాలని, నాయకులు, శ్రేణుల సమన్వయంతో కార్యాచరణతో ముందు వెళ్ళాలని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. మహబూబ్ నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయ సమావేశం ఆదివారం జరిగింది. ఎల్‌బి నగర్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఎమ్మెల్సీ ఎన్నికల ఎల్‌బినగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్, ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఐసిసి ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్, నియోజకవర్గ, డివిజన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# శ్రమజీవుల ఐక్యతకు ప్రతీక బతుకమ్మ



● ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బతుకమ్మ పండుగ శ్రమజీవుల ఐక్యతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీక అని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో మహిళా కార్మికుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి, ఐక్యతకు నిదర్శనమని నరసింహ పేర్కొన్నారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన మహిళా కార్మికులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావని, కార్యదర్శి హసీనా బేగం, కమతం యాదగిరి, ఎం.ఎస్.మూర్తి, రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మీ బాయి, ఎ.పార్వతి, జె.లక్ష్మి, బురనా, కరుణ కుమారి, కృష్ణవేణి, చంద్రమ్మ, కార్మిక సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు పాల్గొన్నారు.

# హరీశ్ ఆరోపణలు ఖండించిన ఆర్‌టిసి

● మహాలక్ష్మి పథకం, పండుగ బస్సుల నిర్వహణలో లోటుపాట్లు అవాస్తవం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాలక్ష్మి పథకం అమలు, దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సుల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేవని టిజిఎస్ఆర్‌టిసి యాజమాన్యం స్పష్టం చేసింది. పండుగ వేళ టికెట్ ధరల పెంపు, ప్రత్యేక బస్సుల రద్దుపై మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొంది. పండుగల సమయంలో టికెట్ ధరలకు సంబంధించిన నిర్ణయాలు 2003 నాటి ప్రభుత్వ ఉత్తర్వుల (జిఓ) ప్రకారం నిబంధనలకు అనుగుణంగానే తీసుకుంటున్నట్లు సంస్థ తెలిపింది. ప్రయాణికులపై అదనపు భారం పడకుండా నిబంధనల మేరకు వ్యవహరిస్తున్నామని వివరించింది.

**మహాలక్ష్మి పథకం విజయవంతం..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం విజయవంతంగా కొనసాగుతోందని ఆర్‌టిసి వెల్లడించింది. మహిళా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. దసరా పండుగ సందర్భంగా బస్సు సర్వీసులను తగ్గించలేదని, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 7 వేల అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్లు సంస్థ తెలిపింది. ఈ నెల 10వ తేదీ నుంచి ఇప్పటివరకు కేటాయించిన అదనపు బస్సుల్లో 97 శాతం సర్వీసులను విజయవంతంగా నడిపినట్లు వెల్లడించింది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొంది. సంస్థ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షిస్తున్నారని తెలిపింది. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన రవాణా సేవలు అందించడమే లక్ష్యంగా టిజిఎస్ఆర్‌టిసి నిరంతరం కృషి చేస్తోందని యాజమాన్యం స్పష్టం చేసింది.

# పండుగ వేళ ఆర్‌టిసి ఛార్జీల భారమా?

● పెంచిన చార్జీలు వెంటనే తగ్గించాలి

● బిఆర్ఎస్ఎల్‌పి ఉప నేత హరీశ్ రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బతుకమ్మ, దసరా పండుగ వేళ ప్రజలకు కానుకలు ఇవ్వాల్సింది పోయి టికెట్ ధరలను డబుల్ చేసి నిలువుదోపిడీ చేయడం సిగ్గుచేటని బిఆర్ఎస్ఎల్‌పి ఉపనేత టి.హరీశ్ రావు విమర్శించారు. రెగ్యులర్ బస్సులు తగ్గించి, స్పెషల్ బస్సుల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతున్నారని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. జెబిఎస్ నుంచి కరీంనగర్‌కు రూ.230 ఉండే టికెట్‌ను ఏకంగా రూ.400కు, మహబూబ్ నగర్ నుంచి ఎంజిబిఎస్‌కు రూ.220 ఉండగా రూ.290కి పైగా పెంచారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రూట్లలో ఛార్జీలు రెట్టింపు చేసి పండుగ సంబురాన్ని దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణమని చెప్పి పురుషులపై భారం మోపడం, ఒక చేత్తో ఇస్తూ మరో చేత్తో లాక్కోవడం ఏ విధమైన ప్రజాపాలన అని నిలదీశారు. కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో ఐదుసార్లు ఛార్జీలు పెంచారని, పేద, మధ్యతరగతి ప్రజలు సొంతూళ్లకు వెళ్లాలంటేనే భయపడేలా చేశారని విమర్శించారు. పెంచిన అడ్డగోలు ఛార్జీలను తగ్గించాలని, రెగ్యులర్ బస్సులను యథావిధిగా నడపాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

**టామ్‌కామ్ కుంభకోణంపై విచారణ**

ప్రభుత్వ రంగ సంస్థ టామ్‌కామ్ ద్వారా జర్మనీలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిలువునా ముంచిందని బిఆర్ఎస్ఎల్‌పి ఉపనేత టి. హరీశ్ రావు తీవ్ర ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. 15 జిల్లాల్లోని 75 మంది నిరుద్యోగుల నుంచి వీసాలు, పరీక్షల పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ.4.5 లక్షలు వసూలు చేసి రెండేళ్లుగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. తల్లుల పుస్తెలతాళ్లు తాకట్టు పెట్టి తెచ్చిన డబ్బుకు వడ్డీలు కడుతూ యువత రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లు గడిచినా కనీసం ఇంటర్వ్యూ ఇప్పించలేకపోగా, బి1 పాసైన వారికి బి2 అంటూ కొర్రీలు పెడుతున్నారన్నారు. లక్నో కోర్టుకు వెళ్లాలని బలవంతంగా సంతకాలు పెట్టించుకోవడం దారుణమని, ఆర్‌టిఐ ద్వారా అడిగినా సమాచారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఈ కుంభకోణంపై సిఐడి లేదా న్యాయ విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# అంతర్రాష్ట్ర నేరాల కట్టడికి ఉమ్మడి కార్యాచరణ

● హైదరాబాద్‌లో 23న దక్షిణ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల డిజిల సమావేశం

● ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో డిజిపి సివి.ఆనంద్ సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రాల సరిహద్దులు దాటి విస్తరిస్తున్న నేరాలను సమర్థంగా నియంత్రించడం, నేరగాళ్ల కదలికలపై నిఘా పెంచడం, కీలక సమాచారాన్ని పరస్పరం పంచుకోవడం ద్వారా అంతర్గత భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు తెలంగాణ పోలీసు శాఖ కీలక సమావేశానికి సిద్ధమవుతోంది. ఈ నెల 23న హైదరాబాద్‌లో దక్షిణ ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ (ఆర్‌పిసిసి) సమావేశం జరగనుంది. ఐదు దక్షిణాది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన డిజిపిలు పోలీసు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొని ప్రాంతీయ భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణ నుంచి సైబర్ నేరాల దర్యాప్తు వరకు వివిధ అంశాల్లో పోలీసు విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడమే ఈ సమావేశ ప్రధాన లక్ష్యం. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు, ప్రతిపాదనలు డిసెంబర్‌లో తిరుపతిలో జరగనున్న 61వ అఖిల భారత డిజిపిలు, ఐజిపి సదస్సు ఎజెండాలో చోటు చేసుకోనున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. సమావేశ ఏర్పాట్లపై డిజిపిల సమీక్ష హైదరాబాద్‌లో జరగనున్న ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాట్లపై తెలంగాణ డిజిపి సివి. ఆనంద్ ఉన్నతాధికారులతో ఆదివారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, చర్చించాల్సిన అంశాలు, వివిధ రాష్ట్రాల పోలీసు అధికారుల భాగస్వామ్యం, సమన్వయంతో చేపట్టాల్సిన కార్యాచరణపై సమీక్షించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. సమావేశం ద్వారా రాష్ట్రాల మధ్య పోలీసు సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన అంశాలపై దృష్టి సారించాలని డిజిపి సూచించారు. ప్రాంతీయ స్థాయిలో ఎదురవుతున్న భద్రతాపరమైన సవాళ్లను గుర్తించి, వాటి పరిష్కారానికి ఆచరణాత్మక ప్రతిపాదనలను సిద్ధం చేయడం ఈ సమావేశంలో కీలకంగా ఉండనుంది.

ప్రస్తుతం నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో ఒక రాష్ట్రంలో నేరానికి పాల్పడిన వ్యక్తులు మరో రాష్ట్రంలో తలదాచుకోవడం, వివిధ ప్రాంతాల నుంచి నేరాలకు పాల్పడటం, ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాల్లో విస్తరించిన నేర నెట్‌వర్క్‌లు పనిచేయడం వంటి సవాళ్లు పోలీసు వ్యవస్థకు ఎదురవుతున్నాయి.

వ్యవస్థీకృత నేర ముఠాల కార్యకలాపాలు, రాష్ట్రాల మధ్య నేరగాళ్ల కదలికలు, నేరాల దర్యాప్తులో ఎదురయ్యే సమస్యలు, శాంతిభద్రతలకు సంబంధించిన సవాళ్లు కూడా సమావేశంలో చర్చకు రానున్నాయి. హైదరాబాద్ సమావేశానికి మరో ముఖ్యమైన ప్రాధాన్యం ఉంది. ఇక్కడ జరిగే చర్చల్లో గుర్తించిన అంశాలు, తీసుకునే నిర్ణయాలు, ప్రతిపాదనలను డిసెంబర్‌లో తిరుపతిలో జరగనున్న 61వ అఖిల భారత డీజీపీలు, ఐజీపీల సదస్సు ఎజెండాలో చేర్చనున్నారు. దీంతో దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎదుర్కొంటున్న భద్రతాపరమైన సమస్యలు జాతీయ స్థాయి చర్చకు వెళ్లనున్నాయి.

# రూ.120 కోట్ల రుణం పేరుతో రూ.2.10 కోట్ల వసూళ్లు!




● 13 మందిపై కేసు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మినీ స్టీల్ ప్లాంట్ కొనుగోలుకు రూ.120 కోట్ల వరకు రుణం ఇప్పిస్తామంటూ నమ్మించి, వివిధ దఫాల్లో రూ.2.10 కోట్లు వసూలు చేసి మోసగించారని ఆరోపిస్తూ సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్)ను ఆశ్రయించారు. రుణం మంజూరు చేయకపోగా, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని గోపాల్ కిషన్ అగర్వాల్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు 13 మంది వ్యక్తులు, అమ్‌లా ట్రేడర్స్ సంస్థపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన గోపాల్ కిషన్ అగర్వాల్ సుమారు 25 ఏళ్లుగా ఇనుము, ఉక్కు వ్యాపారం చేస్తున్నారు. మినీ స్టీల్ ప్లాంట్ కొనుగోలు చేసేందుకు భారీ మొత్తంలో రుణం కోసం ప్రయత్నిస్తుండగా, వ్యాపార రుణాలు ఇప్పిస్తామని పరిచయమైన కొందరు వ్యక్తులు ఆయనను సంప్రదించారు. మధ్యవర్తుల ద్వారా ఇతర వ్యక్తులను పరిచయం చేసి, రూ.100 కోట్ల నుంచి రూ.120 కోట్ల వరకు ప్రైవేటు ఫైనాన్స్ ఇప్పిస్తామని నమ్మించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రుణం మంజూరుకు ముందస్తు రుసుములు, కమీషన్లు, న్యాయపరమైన ఖర్చుల పేరుతో పలుమార్లు డబ్బులు వసూలు చేసినట్లు బాధితుడు ఆరోపించారు. తొలుత రూ.15 కోట్ల రుణం ఇస్తామని చెప్పి రూ.32 లక్షలు తీసుకున్నారని, అనంతరం హైదరాబాద్‌లో రూ.25 కోట్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పి మరో రూ.20 లక్షలు వసూలు చేశారని పేర్కొన్నారు. ఆ తర్వాత కోయంబత్తూరు, తిరుచ్చి, తిరువనంతపురం, కొల్లం తదితర ప్రాంతాలకు పిలిపించి, వివిధ కారణాలు చూపుతూ మరిన్ని మొత్తాలు తీసుకున్నారని తెలిపారు. రూ.90 కోట్లు, రూ.100 కోట్ల రుణం మంజూరవుతుందని చెబుతూ డిమాండ్ డ్రాఫ్ట్‌లను సైతం చూపించారని, అయితే చివరకు ఒక్క రూపాయి కూడా రుణంగా విడుదల చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. రుణం కోసం ఇప్పటివరకు సుమారు రూ.2.10 కోట్లు చెల్లించానని, వివిధ ప్రాంతాలకు తిరగడం వల్ల మరో రూ.60 లక్షల వరకు ప్రయాణ, వసతి తదితర ఖర్చులు అయ్యాయని తెలిపారు. తనతోపాటు తన సంస్థకు చెందిన ఖాళీ సంతకం చేసిన చెక్కులు, లెటర్‌హెడ్లు, ప్రామిసరీ నోట్లు, స్టాంపు పేపర్లు, ఖాళీ కాగితాలను తీసుకున్నారని, వాటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని బాధితుడు ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తామని, కుటుంబ సభ్యులకు ప్రమాదం కలిగిస్తామని బెదిరించినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే తమిళనాడులోని నామక్కల్ జిల్లా క్రైమ్ బ్రాంచ్‌లో కేసు నమోదైనట్లు తనకు తెలిసిందని, అక్కడ అధికారులకు వాంగ్మూలం కూడా ఇచ్చినట్లు ఫిర్యాదుదారు వెల్లడించారు. తన నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇప్పించాలని, నిందితులపై చర్యలు తీసుకోవాలని, కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

# నాలుగు రోజుల పాటు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వచ్చే గురువారం వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశముండగా, తర్వాత మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం నెలకొనే అవకాశముందన్నారు. ఆదివారం నుంచి ఆదివారం నుంచి బుధవారం వరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. మంగళ, బుధవారాల్లో దక్షిణ, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఇదే తరహా పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. గురువారం నుంచి ఆదివారం వరకు రాష్ట్రంలో వర్షాల తీవ్రత తగ్గి, పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని చెప్పారు.

# నిరుద్యోగులకు తీపి కబురు

429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సర్కార్ గ్రీన్ సిగ్నల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలోని నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ జి.ఓ ఎంఎస్ నెంబర్ 142ను జారీ చేసింది. ఉన్నత విద్యా శాఖ పరిధిలోని రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ క్యాడర్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను తొలి దశలో ప్రత్యక్ష నియామకాలు ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నియామక ప్రక్రియను ప్రారంభించేందుకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి, సంబంధిత యూనివర్సిటీల రిజిస్ట్రార్లు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని ఏడు విశ్వవిద్యాలయాల్లో మొత్తం 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో అత్యధికంగా ఉస్మానియా యూనివర్సిటీలో 252 పోస్టులు ఉన్నాయి. కాకతీయ యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీల్లో చెరో 49 పోస్టులు, పాలమూరు యూనివర్సిటీలో 45 పోస్టులు భర్తీ కానున్నాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీల్లో చెరో 16 పోస్టులు ఉండగా, తెలంగాణ యూనివర్సిటీలో రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. పోస్టుల భర్తీకి సంబంధించి అర్హతలు, రిజర్వేషన్ నిబంధనలు, రోస్టర్ విధానం తదితర చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. జి.ఓ. 21, జి.ఓ 31లో పేర్కొన్న మార్గదర్శకాలకు అనుగుణంగా నియామక ప్రకటనలు జారీ చేయాలని ఆదేశించింది.



## నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మికతకు, భక్తిభావానికి చిహ్నాలు

ఎమ్మెల్యే వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మికతకు, భక్తి భావానికి చిహ్నాలని అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి మాత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయంలో చండీ హోమం, సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన అతిథులు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు ఎంతో పవిత్రమైనవని, తొమ్మిది రోజుల పాటు అమ్మవారు తొమ్మిది అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. దుర్గామాత ఆశీస్సులు సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. కల్వకుర్తి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో 37 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ప్రతి ఏటా ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయని కొనియాడారు. ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు అల్పాహారం, భోజనం, రాత్రి అల్పాహారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ, ఎనుముల కృష్ణారెడ్డి, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ జూలూరు రమేష్‌బాబు, ఉత్సమ కమిటీ అధ్యక్షుడు కలిమిచర్ల గోపాల్ ఆధ్వర్యంలో అతిథులను శాలువాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వి108 ఏ గవర్నర్ కలిమిచర్ల రమేష్, ఉత్సవ కమిటీ కార్యదర్శులు నారాయణ రాజు, పానుగంటి నవీన్, కోశాధికారులు గుబ్బ కిషన్, వాసమనిష్, పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు వాసా శేఖర్, చిగుల్లపల్లి శ్రీధర్, ముత్యాలు, సురేందర్, గుగ్గిళ్ల శంకర్, పాపిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దసరా పండుగకు ముస్తాబవుతున్న జమ్మిచెట్టు

**ప్రజాపక్షం/తాడూర్ :** దుర్గామాత నవరాత్రులు, దసరా పండుగ ఉత్సవాలను పురస్కరించుకొని తాడూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న జమ్మి చెట్టు పరిసరాలను పండుగకు ముస్తాబు చేశారు. ఐమాక్స్ లైట్లు, వీధి దీపాల ఏర్పాటు వీధుల పరిశుభ్రతతో పాటు జమ్మి చెట్టు వద్ద రంగులతో అలంకరణ పనులు చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ సంద మల్లయ్య తెలిపారు. పండుగకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు సభ్యుడు వస్పరి మల్లేష్, కృష్ణమాచారి, మారేదు శివశంకర్, ఎస్.కృష్ణయ్య, టి.నరేందర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఆయుధ పూజ సంప్రదాయానికి ప్రతీక

ఎస్పీ డా.సంగ్రామ్‌సింగ్ జి.పాటిల్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** విజయదశమి పండుగను పురస్కరించుకుని దుర్గాష్టమి సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా సాయుధ దళం (ఎఆర్) కార్యాలయంలో నిర్వహించిన ఆయుధ పూజ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్‌సింగ్ జి.పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖకు చెందిన ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ప్రతి సంవత్సరం దసరా పండుగను పురస్కరించుకుని ఆయుధ పూజ నిర్వహించడం గొప్ప సంప్రదాయమని తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. సమాజంలోని చెడును పారద్రోలి, ప్రజలకు రక్షణ కల్పిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీస్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు, నాగర్‌కర్నూల్ డిఎస్పీ శ్రీనివాస్, సిఐ అశోక్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు జగన్, రాఘవరావు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సమస్య నివారణకు మూడు కొత్త మోటార్లు ఏర్పాటు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామంలో ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి సమస్యను నివారించేందుకు గ్రామ సర్పంచు లతా శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మూడు కొత్త బోరు మోటార్లను ఏర్పాటు చేసి ప్రారంభించారు. గ్రామంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు సర్పంచు లతా శేఖర్ రెడ్డి తెలిపారు. గ్రామంలో నీటి సమస్య రాకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు రామచంద్రమ్మ, బుచ్చలయ్య, వార్డు సభ్యులు రామచంద్రి, శివప్రసాద్, వెంకటయ్య, మొగులాల్‌తో పాటు గ్రామస్తులు నరసింహ, రామస్వామి, కాశీములు, తదితరులు పాల్గొన్నారు.

## మఖ్తల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.6.82లక్షల ల్యాబ్ నిధులు మంజూరు

ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ప్రిన్సిపాల్ ఇ.నారాయణగౌడ్

**ప్రజాపక్షం/మఖ్తల్ :** మఖ్తల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రయోగశాల అవసరాల కోసం జిల్లా కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక ప్రత్యేక చొరవ చూపారు. కళాశాలలో ల్యాబొరేటరీ పరికరాల కొనుగోలు నిమిత్తం డి.ఎం.ఎఫ్.టి నిధుల నుండి రూ.6,82,462/ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఇ.నారాయణ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల శాస్త్ర విజ్ఞాన ప్రయోగాల మెరుగుదలకు ఈ నిధులు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు. కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు నిధులు మంజూరు చేసినందుకు జిల్లా కలెక్టర్ సి.హెచ్.ప్రియాంకకు విద్యార్థులు అధ్యాపక బృందం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి పారదర్శకతతో త్వరలోనే ఈ ల్యాబ్ పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ

మక్తల్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని రామ్‌లీలా మైదానంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో భాగస్వాములయ్యారు. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల మధ్య మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, ఆట పాటలతో పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండగ ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే ఈ పండుగ మహిళలు ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. పూల పండుగగా ప్రసిద్ధి చెందిన బతుకమ్మ మన సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని, తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మక్తల్ పట్టణంలో కులమతాలకు అతీతంగా అన్ని పండుగలను కలిసిమెలిసి జరుపుకోవడం మంచి సంప్రదాయమని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే సద్దుల బతుకమ్మ పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు, వైస్ చైర్ పర్సన్ శైవీ రెడ్డి, కౌన్సిలర్లు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# ఉనికి కోల్పోతామనే భయంతోనే చిట్టెం పాదయాత్ర

పదేళ్లు అధికారంలో ఉండి పేట రోడ్డు ఎందుకు పూర్తిచేయలేదు?

మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు




**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ఫోర్‌లైన్ రోడ్డును రూ.237కోట్లతో మంత్రి వాకిటి శ్రీహరి మరో 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తారని తెలిసి, రోడ్డు పూర్తయితే రాజకీయంగా తనకు పుట్టగతులు ఉండవని కేవలం క్రెడిట్ కొట్టేసేందుకు మాత్రమే మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాదయాత్రకు తెరలేపారని, పదేళ్లు అధికారంలో ఉండి మక్తల్‌పేట రోడ్డును ఎందుకు పూర్తిచేయలేదని మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కట్టా సురేష్‌గుప్తా, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్కారి రవికుమార్, అమర్ ప్రశ్నించారు. ఆదివారం మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మక్తల్ మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి నిత్యం మక్తల్ అప్పటి నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, నిత్యం మక్తల్ మీదుగానే నారాయణపేటకు రాకపోకలు సాగించేవారని, అయితే వారి హయాంలో పదేళ్లపాటు పేట రోడ్డుని పూర్తి చేయాలనే ఆలోచన వారికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. పదేళ్లలో నారాయణపేట రోడ్డును పట్టించుకోకుండా.. ఇప్పుడు మంత్రి వాకిటి శ్రీహరి హయాంలో నాలుగు లైన్ల రహదారి పనులు 15 రోజుల్లో ప్రారంభిస్తారని తెలిసి, నారాయణపేట రోడ్డు పూర్తయితే రాజకీయంగా తమకి ఇబ్బందులు తప్పవని, కేవలం తమ ఉనికిని కాపాడుకోవడానికి మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాదయాత్ర చేశారని మండిపడ్డారు. మున్సిపాలిటీలలో సిసి రోడ్లు వెల్లువలా పూర్తి చేసుకున్నామని, ఇంటిగ్రేటెడ్ స్కూల్ తో పాటు దాదాపు 1800 కోట్ల నిధులు తీసుకువచ్చి మక్తల్‌ను మంత్రి వాకిటి శ్రీహరి అభివృద్ధి చేస్తున్నారన్న సంగతి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు కలాల్ శ్రీవిద్య నీలగౌడ్, జుట్ల అనిత, మార్కెట్ డైరెక్టర్ ఫయాజ్, జుట్ల శంకర్, మూర్తి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అఫ్రోజ్, అశోక్ గౌడ్, కావాలి తాయప్ప, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

మానవతా దృక్పథంతో రక్షించిన కృష్ణ 108 అంబులెన్స్ సిబ్బంది

**ప్రజాపక్షం/కృష్ణ :** నారాయణపేట జిల్లా మండలం చేగుంట రైల్వే గేటుకు కిలోమీటరు దూరంలో రైల్వే ట్రాక్ పక్కన పడి ఉన్న ఓ ప్రయాణికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కృష్ణ 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించి, వెళ్లి అతడిని అతి కష్టం మీద అంబులెన్స్‌లో ఉండే స్కూప్ స్ట్రేక్చర్‌పైకి తీసుకుని ఒక కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ అంబులెన్స్‌లోకి షిఫ్ట్ చేసుకుని, మార్గమధ్యలో రక్త స్రావాన్ని ఆపుతూ, ప్రథమ చికిత్స చేస్తూ, ఆక్సిజన్ అందిస్తూ తీసుకువెళ్లి ఆసుపత్రిలో చేర్పించి మానవత్వాన్ని చాటుకున్నారు. పాలిమార్ సికింద్రాబాద్ ఫలక్‌నామా రైలు నుంచి జారిపడి, బీహార్ రాష్ట్రంకు చెందిన రాకేష్ కుమార్ సాహూ (38) ఆ వ్యక్తి జేబులో ఉన్న టికెట్‌ను పరిశీలిస్తే బెంగుళూరు టు ఢిల్లీ అని ఉంది (కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తూ కదులుతున్న ట్రైన్‌ను కృష్ణ, చెగుంటకు మార్గమధ్యలో ట్రైన్‌లో నుంచి, ఆ వ్యక్తి మద్యం మత్తులో ఉండి ట్రైన్‌లో నుంచి కిందకు పడిపోయి తలకు తీవ్రగాయాలు కావడంతో కృష్ణ 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి , గేటు వద్ద అంబులెన్స్‌ను ఆపి స్ట్రక్చర్ మీద పడుకోబెట్టి ఒక కిలోమీటర్ పొడవునా ఆ వ్యక్తి ని మోసుకుంటూ అంబులెన్స్ దగ్గరికి చేర్చి, అంబులెన్స్ లోనే ప్రథమ చికిత్స చేస్తూ కర్ణాటకలోని రాయచూరు జిల్లాలోని రిమ్స్ మెడికల్ కళాశాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రుడు మధ్య మధ్యలో పడి ఉండవచ్చని, అతని ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కృష్ణ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా...

# ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం పోటీలు

యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్ పిలుపు



**ప్రజాపక్షం/నారాయణపేట :** పోలీసుల త్యాగాలు, సేవలు, విధి నిర్వహణలో ప్రదర్శించే ధైర్యసాహసాలను ప్రతిబింబించేలా ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్ తెలిపారు. అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకుని ఈపోటీలను నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో, ప్రజల రక్షణలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తూ వీరమరణం పొందిన అమర పోలీసుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, పోలీసుల సేవలను ప్రజలకు తెలియజేయడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమని ఎస్పీ వివరించారు. పోలీసుల విధి నిర్వహణ, ధైర్యసాహసాలు, సమాజ భద్రత కోసం చేపట్టే కార్యక్రమాలను ప్రతిబింబించేలా ఫొటోలు, షార్ట్ ఫిలింలను రూపొందించాలని సూచించారు. జిల్లాలోని ఆసక్తి గల యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, షార్ట్ ఫిలిం రూపకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోటీల్లో పాల్గొనేవారు పోలీసులకు సంబంధించిన అంశాలపై చిత్రీకరించిన మూడు ఫొటోలు, మూడు నిమిషాలకు మించని నిడివి గల ఒక షార్ట్ ఫిలింను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఫోటోలు 10*8 అంగుళాల పరిమాణంలో ఉండాలని పేర్కొన్నారు. ఫొటోలు, షార్ట్ ఫిలింను తమ పూర్తి వివరాలతో పాటు పెన్‌డ్రైవ్ పొందుపరిచి ఈనెల 23వ తేదీ సాయంత్రం లోగా నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలోని పోలీస్ పిఆర్వోకు అందజేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన మూడు ఉత్తమ ఫొటోలు, మూడు ఉత్తమ షార్ట్ ఫిలింలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు వెల్లడించారు. పోలీసుల సేవలు, త్యాగాలను సృజనాత్మకంగా ప్రజలకు చాటిచెప్పే ఈ పోటీల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్పీ డా.జి.వినీత్ పిలుపునిచ్చారు.

# కల్వకోల్‌లో వాలీబాల్ టోర్నమెంట్

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** నాగర్‌కర్నూల్ వనపర్తి జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పెద్ద కొత్తపల్లి మండలంలోని కల్వకోల్ గ్రామంలో యువ సైన్యం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వాలీబాల్ టోర్నమెంట్ ఈనెల 20,21,22 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని, మొదటి బహుమతి 30,000, రెండవ బహుమతి 20,000, మూడవ బహుమతి 10,000 రూపాయలు ఉంటుందని ఆర్గనైజర్ ఎన్.రమేష్, కె.శివ తెలిపారు.

# సాగునీరు అందక ఎండిన పంటలు

రైతులను ఆదుకోవాలి, నష్టపరిహారం అందించాలి

కొల్లాపూర్ నియోజక వర్గం బిజెపి ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్ రావు



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** కాలువల ద్వారా సాగునీరు అందక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బిజెపి కొల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్ రావు విమర్శించారు. సాగునీరు అందక ఎండిపోయిన వరి పొలాల్లో రైతులు, పార్టీ కార్యకర్తలతో కలిసి కబడ్డీ, వాలీబాల్ ఆడి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం వీపనగండ్ల మండల పరిధిలోని సంగినేనిపల్లి, కల్వరాల, వీపనగండ్ల గ్రామాల్లో ఎల్లేని సుధాకర్ రావు పర్యటించారు. ఈ సందర్భంగా భీమా కాలువను, సాగునీరు అందక ఎండిపోతున్న వరి, వేరుశనగ, మినుము పంటలను రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలువల పరిస్థితిని, పంట పొలాల్లో నెలకొన్న దుస్థితిని చూసి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో రైతు ఎకరాకు సుమారు రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టినా సాగునీరు అందక పంటలు ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి ఏర్పడటంతో రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి సూజల్లి కృష్ణారావు తక్షణమే స్పందించాలని ఎల్లేని సుధాకర్ రావు కోరారు. మంత్రి నియోజకవర్గంలో పర్యటించి ఎండిపోయిన పంట పొలాలను, దెబ్బతిన్న కాలువలను స్వయంగా పరిశీలించి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ఆవుల నారాయణ, నాగర్‌కర్నూల్ జిల్లా బిజెపి పార్టీ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, చిన్నంబావి పార్టీ మండల అధ్యక్షుడు కురుమయ్య, నాయకులు శ్రీనివాస్, రాకేష్ యాదవ్, శివ యాదవ్, ఉన్నారు.



## ప్రభుత్వ భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వంగూర్ :** మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రం సంస్కృతి కార్యక్రమాల కేంద్రం, మహిళా సమైక్య భవనం, బస్‌స్టేషన్, గ్రంథాలయ భవనాలు పూర్తికావడంతో ఆదివారం ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ, కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ముఖ్యమంత్రి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మన స్థానికుడు కావడంతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చెంది చేసేందుకు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ వెంకటయ్య, ఉప సర్పంచ్ వేమారెడ్డి, జిల్లా ఉన్నత అధికారులు మండల అధికారులు, మండల మహిళ సమైక్య సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక చింతనతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఒఒ, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఒఒ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సిఒఒ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దుర్గాదేవి రూపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ, ట్రస్ట్ వ్యవస్థాపకుడు జూలూరి రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కలిమిచర్ల గోపాల్, కార్యదర్శి రాజు, సభ్యులు శ్రీధర్, శేఖర్, ముత్యాలు, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.



## కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

**ప్రజాపక్షం/పానుగల్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి అన్నదాతలు తల్లడిల్లుతున్నారని, ప్రస్తుత కరువు పరిస్థితులు కాలం తెచ్చింది కాదని కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు అని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. పానుగల్ మండల కేంద్రంలోని డీ 8 కాలువ ఎంజె3 సమీపంలో కరెంట్ సరిగ్గా లేకపోవడంతో ఎండిన వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు ఎలాగు ఇయ్యదు. కరెంటు అయినా సరిగ్గా ఇస్తే వేసిన పంటలు కొంతమేర పండుతాయని అన్నారు. పంట చేతికొచ్చే సమయంలో కరెంటు లేక, సాగు నీరు లేక ఎండిపోయిన వరి పంటలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. పంట చేతికొచ్చే కీలక సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో సాగులో ఉన్న వరి పంట పూర్తిగా ఎండిపోతున్నాయని రైతులు తమ గోడును, ఆవేదనను వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వానికి ఎందుకు పట్టడం లేదన్నారు.

మాజీ ఎమ్మెల్యే వెంట బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీరసాగర్, మాజీ రైతుబంధు మండల కోఆర్డినేటర్ వెంకటయ్య నాయుడు, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు అడ్వకేట్ రవికుమార్, కిష్టాపూర్ తాండ సర్పంచ్ కిషోర్ నాయక్, మాధవరావు పల్లి సర్పంచ్ రొడ్డ కృష్ణ, నాయకులు చంద్రునాయక్, మాజీ సర్పంచ్, నజీర్, సుధాకర్ రెడ్డి, రామచందర్ యాదవ్, బాలరాజు గౌడ్, ఆది హనుమంతు, పరమేష్, వెంకటేష్. అశోక్ రెడ్డి, నవీన్ రెడ్డి, రామకృష్ణ, అంబటి ప్రవీణ్, విష్ణు మూర్తి, మల్లేష్ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయం అందించాలి

**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండలంలోని ఆనంపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు వాబయ్య పాముకాటుకు గురై 40రోజులు మృత్యువుతో హాస్పిటల్లో పోరాడుతూ శనివారం మరణించడం జరిగిందని, ప్రభుత్వం అన్ని విధాలుగా కుటుంబాన్ని ఆదుకోవాలని తక్షణమే ఎక్స్‌గ్రేషియా 10 లక్షల రూపాయలు ఇవ్వాలని గోవింద్ రాజ్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు, భరత్‌కుమార్, సిఐటియు జిల్లా నాయకులు, పుంజనూర్ ఆంజనేయులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయనకు భార్య ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, పారిశుధ్య కార్మికునిగా పనిచేసుకుంటూ జీవనం కొనసాగించేవాడని అన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత పిఎఫ్, ఇఎస్ఐ వంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26,000 అమలు చేయాలని కార్మికులకు అన్నివిధాల ఆదుకోవాలని ఆయన కోరారు. మృతి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడి వాబయ్య మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్, నాయకులు రాయప్ప, ఉషనప్ప, ఎల్లప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పండుగ పూట విషాదం

నీట మునిగి యువకుడి మృతి



ప్రజాపక్షం/నూతనకల్ : ప్రమాదవశాత్తు యువకుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని గుండ్ల సింగారం రెవెన్యూ పరిధిలోని కత్వలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూర్(ఎస్) మండలం ముక్కుదుదేవులపల్లి గ్రామానికి చెందిన ఇరుగు వినయ్, మహారాష్ట్రకు చెందిన సుభాన్జి, జనగామకు చెందిన కడారి భానుప్రకాష్‌లు హైదరాబాద్‌లో స్నేహితులు. పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చిన వీరు గుండ్లసింగారం వద్దగల కత్వాలోకి ఈతకు వెళ్లారు. కడారి భాను ప్రకాష్‌కు ఈతరాక నీటి మునిగాడు. నీట మునిగిన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గాలింపు చేపట్టగా భాను ప్రకాష్ (23) మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## దసరా పండుగను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలి : ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : సూర్యాపేట జిల్లా ప్రజలందరూ దసరా పండుగను సంతోషంగా, ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహా కోరారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. పండుగవేళ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని, ఇతరుల మనోభావాలను దెబ్బతీయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. దసరా సెలవుల్లో దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలను నడపకూడదని తెలిపారు. ఎక్కువ రోజులు ఇంటికి తాళం వేసి వెళ్లే వారు విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇంటి భద్రత కోసం సిసి కెమెరాలు, అలారం వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. శాంతిభద్రతలను విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. అత్యవసర సమయంలో డయల్ 112 సంప్రదించాలన్నారు. సూర్యాపేట జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712686026, 8712686057 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

## దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి : కొప్పుల



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : గ్రామాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు, ప్రజల విశ్వాసాలకు ప్రతీకలుగా నిలిచే దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని లింగాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న శివాలయాన్ని ఆయన సందర్శించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా పూర్తి చేయాలన్నారు. శివాలయం నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు మరింత ఆధ్యాత్మిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం గ్రామంలోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని, ప్రజలందరికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

## రైస్‌మిల్లు కార్మికుల వేతనాలు, అలవెన్సులు పెంచాలి

టిఎస్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా రైస్ మిల్లులో పనిచేస్తున్న డ్రైవర్లు, దినసరి కూలీల వేతనాలు, అలవెన్సులు పెంచాలని టిఎస్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతలరోషపతి రైస్ మిల్లు యాజమానులను కోరారు. ఆదివారం హుజూర్‌నగర్ మార్కెట్ యార్డులో తురక రమేష్ అధ్యక్షతన నిర్వహించిన రైస్ మిల్లు కార్మికుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్ మిల్లు డ్రైవర్ల రెండేళ్ల వేతన ఒప్పందం ఈనెల 31వ తేదీతో ముగియనుండగా దినసరి కూలీల ఒప్పందం డిసెంబర్ 31తో ముగియనుందని తెలిపారు. రెండేళ్లకోసారి వేతనాలు, అలవెన్సులు పెంచాల్సి ఉన్నందున కార్మికులందరూ చర్చించి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల ద్వారా యాజమాన్యాలకు తమ కోర్కెల వినతిపత్రం అందించాలని సమావేశంలో తీర్మాణించినట్లు తెలిపారు. ప్రస్తుతం కిలో బియ్యం 40 నుంచి 80 వరకు పెరిగిందని, వంటనూనెతో పాటు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు సైతం విఫరీతంగా పెరిగాయని రోషపతి అన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గుండెబోయిన వెంకన్న, కంకణాల రామయ్య, తురక రమేష్, వెంకన్న, స్వరూప, నాగమణి, నాగరాజు, శ్రీనివాస్, జానకిరావు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : పంజాబ్ రాష్ట్రం పాటియాలాలోని సుశీలాదేవి పబ్లిక్ స్కూల్‌లో అక్టోబర్ 15 నుండి 20 వరకు జరుగుతున్న జాతీయ సిబిఎస్ఈ అథ్లెటిక్స్ మీట్ 2026లో చివ్వెంల మండలం ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని కుమారి బి. సాత్విక్ అండర్ 14 బాలికల 600 మీటర్ల పరుగు పందెంలో 1.42 సెకన్లలో మొదటి స్థానం సాధించి గోల్డ్‌మెడల్ సాధించింది. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని, ఫిజికల్ డైరెక్టర్ తూము హనుమంతరావుని స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి రాజం, కరస్పాండెంట్ శ్రీనివాస్, చైర్మన్ కొల్లు మధుసూదన్ రావు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# వరి పంట వేయొద్దు

ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి

వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్



ప్రజాపక్షం/కోదాడ రూరల్ : ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు తగు జాగ్రత్తలు పాటించి పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ సూచించారు. ఆదివారం మండలంలోని గుడిబండ గ్రామంలోని కాలిఫ్లవర్ రైతుల పొలాలను పరిశీలించి మాట్లాడారు. ఉద్యానశాఖ ద్వారా డ్రిప్ పరికరాలు, సబ్సిడీ విత్తనాలు రైతులకు అందజేయాలని ఆదేశించారు. భూగర్భజలాలు అడుగంటిపోవడం, వర్షాభావ పరిస్థితులు ఉండడం, కరెంటు ఉత్పత్తి తక్కువగా ఉన్న కారణంగా రానున్న రోజుల్లో కూరగాయలు కూడా దొరికే అవకాశం లేనందున రైతులు మొదటి ప్రాధాన్యతగా కూరగాయలు, పశుగ్రాసం పంటలను సాగుచేయాలన్నారు. ఎక్కడైతే రెండు నీటి తడులు అవకాశం ఉన్నదో అక్కడ మాత్రమే ఆరుతడి పంటలు, పప్పుధాన్యాలు పెసర, కంది, మినుము, జొన్నలు లాంటి పంటలు వేయాలని వరి పంట వేయవద్దని కోరారు. వ్యవసాయంలో స్ప్రింక్లర్లు, డ్రిప్ విధానాన్ని పాటించాలని తెలిపారు. రైతులకు కావల్సిన యంత్ర పరికరాలు త్వరలో సహకార సంఘాలు, ఎఫ్‌పిఓ, మహిళా సంఘాల ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. రైతు వేదికల ద్వారా అధికారులు ఎప్పటికప్పుడు ప్రస్తుతమున్న ఎల్‌నినో పరిస్థితుల గురించి రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సందర్శించిన వారిలో మండల వ్యవసాయ అధికారిణి పాలెం రజని, ఉద్యాన శాఖ అధికారి అనిత, వ్యవసాయ అధికారి రాజు, ఏఈఓలు మహేష్, నగేష్, పిచ్చయ్య, ఉద్యాన విస్తరణ అధికారి ఇస్మాయిల్, సొసైటి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



తమ స్వగ్రామమైన నార్కట్‌పల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి దంపతులు. అనంతరం సర్పంచ్ సంగిశెట్టి రాణమ్మ శ్రీనివాస్‌తో కలిసి బతుకమ్మను అందంగా, ఆకర్షణీయంగా పేర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు.

## సంస్కృతి,సంప్రదాయాలను భావితరాలకు అందిద్దాం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

ఎమ్మెల్యే నివాసంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



ప్రజాపక్షం/నకిరేకల్: తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ అత్యంత వైభవంగా జరుపుకోవాలని, మన విశిష్ట సంస్కృతిని భావితరాలకు సగర్వంగా అందించాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆకాంక్షించారు.తెలంగాణ ఆడబిడ్డల అతిపెద్ద పండుగైన సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని నకిరేకల్‌లోని ఆయన నివాసంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు తంగేడు,గునుగు,బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి,మంగళహారతులు సమర్పించారు.అనంతరం జానపద గీతాలు, మహిళల ఉత్సాహభరితమైన ఆటపాటల నడుమ బతుకమ్మలతో వేడుకలకు బయలుదేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వానికి,ఆడబిడ్డల ఆత్మీయతకు, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో ప్రజా గాయని వేముల పుష్ప,నాయకులు లింగాల వెంకన్న,చౌగోని శ్రీనివాస్,పన్నాల రాఘవరెడ్డి,పన్నాల పావని శ్రీనివాస్ రెడ్డి,వీరార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సంస్కృతికి శిరస్సు వంచి.. బతుకమ్మను తలనెత్తి**

తన నివాసంలో పూలబోనాన్ని తలకెక్కి ఎత్తుకొచ్చిన ఎమ్మెల్యే వీరేశం సద్దుల బతుకమ్మ వేడుకల వేళ ఒక అరుదైన,ఆత్మీయ దృశ్యం ఆకట్టుకుంది.

## రాష్ట్రంలో కరువు పరిస్థితులకు కారణం కాంగ్రెస్సే

మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట : రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితులకు కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కు పాలన చేతకావడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలను వదిలేసి కేవలం అవినీతి, కమీషన్ల కోసమే సిఎం, మంత్రులు పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణకు రావాల్సిన కృష్ణా జలాల్లో ఇప్పటి వరకు కనీసం 18 టిఎంసిలు కూడా వినియోగించుకోలేకపోయారని మండిపడ్డారు. గురుశిష్య బంధంతో పక్క రాష్ట్రానికి మేలు చేసే విధంగా ప్రభుత్వం ఉందన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ప్రారంభించి ఉంటే రాష్ట్రంలోని చెరువులు, ప్రాజెక్టులన్ని నిండుకుండల్లా ఉండేవని స్పష్టం చేశారు. గోదావరి నుంచి 250 టిఎంసిల నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా పట్టించుకోలేదన్నారు. ఎల్‌నినో ప్రభ్వాం ఉంటుందని జాతీయ, అంతర్జాతీయ వాతావరణ నిపుణులు ఏడాది ముందే నుంచే హెచ్చరించినా ప్రభుత్వం ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా మొద్దు నిద్రలో ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులకు ఎల్‌నినో కారణం కాదని సర్కార్ నిర్లక్ష్యమేనని విమర్శించారు. సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులకు తట్టెడు మట్టి పోయాల్సిన అవసరం లేదని వాటిని వినియోగంలోకి తెచ్చి నీరందించాలని డిమాండ్ చేశారు. నిరంతర విద్యుత్ ఇవ్వడం చాతకాక అధికారులపై నెపం మోపడం సిగ్గుచేటన్నారు. విద్యుత్, సాగునీటిని అందించడం చేతకాకపోతే తమకు అధికారం అప్పజెప్పాలని ఎలా అందించాలో చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పిపిఇ కిట్ల పంపిణీ

ప్రజాపక్షం/నేరేడుచర్ల: మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి ఆదివారం మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ నూకల సందీప్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు పిపిఈ కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణ సమయంలోవ్యక్తిగత రక్షణ, ఆరోగ్య భద్రత దృష్ట్యా పిపిఈ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కిట్లలో దుస్తులు, సబ్బులు, కొబ్బరినూనె, ఆప్రాన్స్, చెప్పులు, గ్లౌజులు, టవల్స్ ఉన్నాయన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర విధుల్లో తగిన జాగ్రత్తలు పాటిస్తూ పిపిఈ కిట్లను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐదవ వార్డు కౌన్సిలర్ నన్నెపంగు శ్రీనివాస్,9వ వార్డు కౌన్సిలర్ ఇంజమూరి శ్రీకాంత్, 11వ వార్డు కౌన్సిలర్ షేక్ సహనాజ్, 13వ వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి లక్ష్మయ్య, ఆకోప్షన్ సభ్యురాలు మొగలాబి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

నల్లగొండ జిల్లాలో ఘనంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు

ఎన్‌జి కళాశాల మైదానంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



ప్రజాపక్షం/నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఎన్‌జి కళాశాల మైదానంలో విద్య, అటవీ,ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బతుకమ్మలకు పూజలు నిర్వహించి,వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంతో పాటు అన్ని గ్రామాలు, మండలాలు,రెవెన్యూ డివిజన్లలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని తెలిపారు.మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు ప్రతిరోజూ నాలుగైదు జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఎన్‌జికళాశాల మైదానంలో ఉత్సవాలు నిర్వహించామని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కాకుండా ప్రజలు స్వచ్ఛందంగా నిర్వహించుకోవడం సంతోషమని, అన్ని మున్సిపాలిటీలలో ఈ ఏడాది వైభవంగా నిర్వహించారని తెలిపారు. సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారన్నారు.జిల్లా ప్రజలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, డీఈఓ సుశీందర్ రావు,ఆర్ అండ్ బీ,అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేయండి

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ. 2.25కోట్లు మంజూరు చేయాలని మంత్రి అజారుద్దీన్‌ను కోరిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలోని ముస్లిం, క్రైస్తవ మైనార్టీ సామాజిక, సాంస్కృతిక అవసరాలను తీర్చేందుకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ ఆదివారం మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

**నాలుగు కమ్యూనిటి హాళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు.....** దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం, మైనార్టీల కోసం దేవరకొండ, చింతపల్లి, డిండి ప్రాంతాల్లో ఒక్కో కమ్యూనిటి హాల్ నిర్మాణానికి రూ. 50 లక్షల చొప్పున మొత్తం. రూ. 1.50కోట్లు మంజూరు చేయాలని ఎంఎల్‌ఏ కోరారు. అదే విధంగా దేవరకొండలో క్రైస్తవ మైనార్టీల కోసం ప్రత్యేక కమ్యూనిటి హాల్ నిర్మాణానికి రూ. 75లక్షలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈనాలుగు నిర్మాణాలకు రూ. 2.25కోట్ల నిధులు అవసరమవుతాయని వివరించారు. మైనార్టీ వర్గాల ప్రజల సమావేశాలు నిర్వహించుకోవడానికి, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడానికి, విద్యా సంబంధిత కార్యక్రమాలు నిర్వహించడానికి కమ్యూనిటి హాళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎంఎల్‌ఏ బాలు నాయక్ పేర్కొన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో మైనార్టీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదిత కమ్యూనిటి హాళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా త్వరితగతిన మంజూరు చేసి, నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను ఎంఎల్‌ఏ బాలునాయక్ కోరారు.

## కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఆదివాసీలు

గ్రామస్థాయి నుంచి ఆదివాసీ కమిటీల బలోపేతం

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్



ప్రజాపక్షం/నల్లగొండ : ఆదివాసీలు కాంగ్రెస్ పార్టీకి ఎల్లవేళలా వెన్నుదన్నుగా ఉంటారని ఎమ్మెల్సీ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆదివాసీ చైర్మన్ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు.శనివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో సంఘటన్ సృజన్ లో భాగంగా రాష్ట్రస్థాయి ఆదివాసీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో ఆదివాసీలను బలోపేతం చేసే దిశగా ఈ సమావేశం నిర్వహించామని,రాష్ట్రంలోని ఆదివాసీ నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. వీరిని 33 జిల్లాలకు పంపించి జిల్లా కమిటీలను ఎంపిక చేయనున్నామని, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీలు వేస్తామని పేర్కొన్నారు.రానున్న హైదరాబాద్‌రంగారెడ్డి,ఖమ్మంవరంగల్‌నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామ రామ్మోహన్ రెడ్డి,సర్వోత్తమ్ రెడ్డిల గెలుపు కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 75 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, గత పదేళ్ల టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు.బీజేపీ మతాల పేరుతో రాజకీయం చేస్తుందని,ఈ రెండు పార్టీల వల్ల ప్రజలకు ప్రయోజనం లేదని అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ బడ్జెట్ రూ.26 వేల కోట్ల నుంచి రూ.36 వేల కోట్లకు చేరినా,దాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 23న సీఎం రేవంత్ రెడ్డితో ఆదివాసీ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఆదివాసీ వైస్ చైర్మన్లు లింగం నాయక్,హనుమంతు నాయక్, మోహన్,గణేష్,శ్రీనివాస్,చంద్రకళ,మల్లికార్జున్,మల్లీశ్వరి నాయక్,కోట్యా నాయక్,తిరుమల నాయక్ పాల్గొన్నారు.

## బతుకమ్మ చీరెల పంపిణీ ఎక్కడ?



ప్రజాపక్షం/నేరేడుచర్ల: ఈనెల 18తో సద్దుల బతుకమ్మ పండుగతో బతుకమ్మ పండుగ పూర్తవుతున్నా ఇంత వరకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేయలదని, ఇంకెప్పుడు చేస్తారని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు దూళిపాళ ధనుంజయనాయుడు ప్రశ్నించారు. ఆదివారం నేరేడుచర్లలో మాట్లాడుతూ 2017 సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తెలంగాణ మహిళలకు బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమం మొదలుపెట్టిందని, 2024 లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం ఒకసారి మాత్రమే చీరెల పంపిణీ చేశారని, గత రెండు సంవత్సరాలుగా బతుకమ్మ చీరెల పంపిణీ జరగలేదన్నారు. ముఖ్యమంత్రి రానున్న దసరాకు సొంత ఆడపడుచులు ఇంటికి వస్తే ఎలాంటి మంచి చీర పెడతామో అలాంటి చీరలే తెలంగాణ మహిళలకు అందిస్తామని ప్రకటించారన్నారు. చీరెల ఖరీద్ ఎంత అన్నది ముఖ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వం తమకు పండుగ సందర్భంగా చీరెలు అందించారని మహిళలు సంతోషపడతారని, ఇవాళ వారికి ఆ సంతోషాన్ని దూరం చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో చిలకరాజు శ్రీను, కొమ్రరాజు వెంకట్, ఊదర వెంకన్న, పరికె భరత్, బత్తిని శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

## నేడు యాచారం మండలానికి సిఎం



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద అనుబంధ గ్రామమైన మంగలి గడ్డ తండాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రానున్నారు. ఇందుకోసం అధికార యంత్రాగం అన్ని ఏర్పాట్లు చేశారు. ఇబ్రహీంపట్నం సమిపంలోని అక్టోపస్‌లో ప్యూఛర్‌సిటీ కమిషనర్ కార్యాలయం భవనాన్ని అయన ప్రారంభించనున్నారు. మిర ఖాన్ పేట్ వద్ద ప్యూచర్ సిటీ కమిషనర్‌రేటు భవనం నిర్మాణం కోసం శంఖుస్థాపన చేయనున్నారు. యాచారం మండలం మంగలి గడ్డ తండా సమీపంలో నేషనల్ ఇన్‌స్ట్యూట్ అఫ్ అర్బన్ మేనేజ్‌మెంటు భవనానికి భూమి పూజ చేయనున్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ పనులను పరిశీలించనున్నారు. ఆదివారం ఇబ్రహింపట్నం ఎసిపి రాజు, ఎస్‌హెచ్‌ఒలు సత్యనారాయణ, టిజి ఐఐసి అదికారులు కృష్ణారెడ్డి సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

## రోడ్డు పనులు పూర్తిచేయాలి



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండలం రావులపల్లి రోడ్డు పనులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పరిశీలించారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మండలం పిఏసిఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి,రావులపల్లి కలాన్ సర్పంచ్ సువర్ణ కృష్ణమూర్తి,వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ బొజ్జ సరిత వెంకట్ రెడ్డి,ఆలం ఖాన్,మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి వార్డు సభ్యులు సుప్రజా శ్రీకాంత్ రెడ్డి,మీనా మల్లేష్,ఉత్తరపల్లి ప్రభాకర్, పట్నం శ్రీనివాస్ (రాజు) పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/కొత్తూరు:** షాద్‌నగర్‌కు ఈశాన్యంగా ఉన్న ప్రాంతం నుండే అధికార పార్టీ శ్రేణులు గులాబీ గూటికి చేరుతుండటంతో పార్టీలో కొత్త జోష్ మొదలైందని చెప్పవచ్చు. ఆదివారం కొత్తూరు మండలం పెంజర్ల గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ శంతన్‌రెడ్డితోపాటు 8మంది వార్డు సభ్యులు, వందమంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరారు. వారందరికి గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వేదాంత చారి, ఎస్‌కె అర్బాస్, మంద మాధవి శ్రీను, అకనపల్లి మాధవి సహదేవ్, రాముట్ల రాములు, మైబుజీ, రమాదేవి, శేఖర్‌తోపాటు పెంజర్ల గ్రామానికి చెందిన యువకులు చేరారు.

## గ్రామపంచాయతీ అభివృద్ధి చేస్తా



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఎమ్మెల్యే సహకారంతోనే గ్రామ పంచాయతీని అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్ వివరించారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని కత్వగడ్డ తండాల్లో తాగునీటి సమస్యను తీర్చేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఏర్పాటు చేసిన బోరును సర్పంచ్ చందునాయక్‌తో కలిసి ఉప సర్పంచ్ శ్రీలత తిరుపతయ్య తదితరులు ప్రారంభించారు.

## పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ



**ప్రజాపక్షం/యాచారం :** దసరా పండుగను పురస్కరించుకోని పంచాయతీ కార్మికులకు బట్టలను పంపిణీ చేసినట్లు బిఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మేన్ బిలకంటి శేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామవార్డు సభ్యులు నూకం శ్రీలత మహెంధర్,మహ్మద్ హాజీ,సభావత్ హరిశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి ...

**ప్రజాపక్షం/యాచారం :** రొడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌదర్‌పల్లి గేటు సమిపంలో అదివారం జరిగింది. మేడిపల్లి గ్రామానికి చెందిన కలకోండ పద్మ భర్త మల్లేశ్ బైక్ పై చౌదర్‌పల్లి గేటు వద్ద బంతి పూలు తీసుకోని మేడిపల్లి గ్రామానికి వేల్తుండగా వేనుక నుండి అతీ వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం బలంగా డీకొంది. దీంతో పద్మ (45) రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయాలయి అక్కడికి అక్కడే మృతిచెందింది. ఈమేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నందిశ్వర్‌రెడ్డి తెలిపారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఆటోనగర్‌లో డీర్ పార్క్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయపడ్డారు. వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన వారిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బి నగర్‌కు చెందిన తల్లిపల్లి వంశీ దసరా పండుగ సందర్భంగా తన భార్య వాణి, ఇద్దరు కుమారులు మన్విష్, యుగ్విష్‌లతో కలిసి ద్విచక్ర వాహనంపై హయత్ నగర్‌లోని తన అక్క ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి కారణమైన కారులో కట్ల నితిన్ గౌడ్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు ఫిర్యాదుదారుడు పోలీసులకు తెలిపాడు.

# పోలీసుల అనుమతి లేకుండానే దాండియా వేడుకలు

ఎంవిఎస్‌ఆర్ కళాశాలలో
భద్రతా వైఫల్యం.. లైటింగ్ వ్యవస్థ కూలిన
ఘటనపై కేసు నమోదు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థుల సంబరాల కోసం నిర్వహించిన దాండియా వేడుకలు విషాదాన్ని మిగిల్చాయి. నాదర్‌గుల్‌లోని ఎంవిఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో లైటింగ్ వ్యవస్థ కూలిపడటంతో ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనతో కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి పోలీసుల అనుమతి తీసుకున్నారా? కళాశాల యాజమాన్యం అనుమతి కోసం దరఖాస్తు చేసుకుందా? విద్యార్థుల భద్రతకు అవసరమైన ఏర్పాట్లు చేశారా? అన్న ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. పోలీసుల అనుమతి తీసుకోలేదని, అనుమతి కోసం కళాశాల యాజమాన్యం దరఖాస్తు కూడా చేసుకోలేదని వచ్చిన సమాచారం నేపథ్యంలో కార్యక్రమ నిర్వహణపై మరింత విచారణ జరగాల్సిన అవసరం కనిపిస్తోంది. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. వేదిక నిర్మాణం, లైటింగ్ పరికరాల ఏర్పాటు, విద్యుత్ భద్రత, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లే మార్గాలు, జనసమ్మర్ధాన్ని నియంత్రించే చర్యలు ముందుగానే పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఎంవీఎస్‌ఆర్ కళాశాలలో జరిగిన దాండియా వేడుకలకు పోలీసుల అనుమతి తీసుకోలేదని, అనుమతి కోసం దరఖాస్తు కూడా సమర్పించలేదని సమాచారం. ఈ నేపథ్యంలో కార్యక్రమ నిర్వహణకు సంబంధించి యాజమాన్యం ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది? భద్రతా ఏర్పాట్లను ఎవరు పర్యవేక్షించారు? లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసిన సంస్థకు అవసరమైన భద్రతా ప్రమాణాలపై అవగాహన ఉందా? అనేఅంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. దాండియా వేడుకలు కొనసాగుతున్న సమయంలో లైటింగ్ వ్యవస్థ కూలిపడటంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో ఓ విద్యార్థిని మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్న కార్యక్రమంలో ఒక్కసారిగా ప్రమాదం చోటుచేసుకోవడంతో విషాదం నెలకొంది. వేడుకల కోసం ఏర్పాటు చేసిన భారీ లైటింగ్ వ్యవస్థకు తగిన స్థిరత్వం ఉందా? పరికరాలను సక్రమంగా బిగించారా? ప్రమాదం జరగకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించారా? అన్న అంశాలు కీలకంగా మారాయి. ప్రమాదానికి కచ్చితమైన కారణాలు, బాధ్యత ఎవరిదన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

### కొంప ముంచిన డిజె శబ్దం..?

ఈ ఘటనకు డిజె శబ్దమే ప్రధానకారణమని తెలుస్తుంది. ఈ ధ్వనికి లైటింగ్ సిస్టమ్ ఊగిపోయి పడిపోయిందనే అనుమానాలు కలుగుతున్నాయి. ఈకార్యక్రమలో డిజెను కూడా ఏర్పాటు చేశారు. అధిక ధ్వని కాలుష్యం, రాత్రి వేళల్లో శబ్ద నియంత్రణ నిబంధనల అమలుపై మరోసారి చర్చ మొదలైంది. శబ్ద కాలుష్య నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలు, కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి అమలు ఎంతవరకు జరుగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే డిజె ఏర్పాటు చేసిన విషయానికి, లైటింగ్‌వ్యవస్థ కూలి జరిగిన ప్రమాదానికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని చెప్పడానికి ఆధారాలు లేవు. ఈ రెండు అంశాలను విడివిడిగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

## కళాశాలల్లో ప్రతి ఈవెంట్‌కూ అనుమతి తప్పనిసరి : కొత్వాల్

ఎంవిఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో దాండియా వేడుకల సందర్భంగా లైటింగ్ వ్యవస్థ కూలి విద్యార్థిని మృతి చెందడం, పలువురు గాయపడిన ఘటనపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ తీవ్రంగా స్పందించారు. ఇకపై కళాశాలల్లో నిర్వహించే ప్రతి కార్యక్రమానికీ పోలీసుల అనుమతి తీసుకునేలా చర్యలు చేపట్టాలని అన్ని పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కళాశాలల్లో సాంస్కృతిక వేడుకలు, ఉత్సవాలు, ఇతర భారీ కార్యక్రమాల నిర్వహణ సందర్భంగా భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ముందస్తు అనుమతులు, భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ ఆదేశించినట్లు సమాచారం.

## ఎంవిఎస్‌ఆర్ యాజమాన్యంపై.. కఠిన చర్యలు తీసుకోవాలి

బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

నాదర్‌గూల్‌లోని ఎంవిఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో దాండియా ఈవెంట్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం, మరో విద్యార్థిని తీవ్రంగా గాయపడటం అత్యంత బాధాకరమని బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.350 ఎంట్రీ టికెట్‌లతో వేలాది మంది విద్యార్థులను సమీకరించి ఈవెంట్ నిర్వహిస్తుంటే విద్యాశాఖ, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కనీస భద్రతా చర్యలు, ఫైర్ సేఫ్టీ, అంబులెన్స్ కూడా లేకపోవడం ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. బాధిత కుటుంబాలకు చెరో రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలని, కాలేజీ సెక్రటరీ, ప్రిన్సిపాల్‌లపై హత్య కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, గాయపడిన మీనాకు ప్రభుత్వమే ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు.

## ఎంవిఎస్‌ఆర్ ప్రమాదంపై డిసిసి అధ్యక్షురాలు పారిజాత దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి..
క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎంవిఎస్‌ఆర్ (ఎంవిఎస్‌ఆర్) కళాశాలలో శనివారం రాత్రి జరిగిన ప్రమాద ఘటనపై రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ (డిసిసి) అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు.ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రమాదంలో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా విద్యాసంస్థల యాజమాన్యాలు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, అగ్నిమాపక నివారణ ఏర్పాట్లను పక్కాగా అమలు చేయాలని పారిజాత నర్సింహారెడ్డి స్పష్టం చేశారు.విద్యార్థుల ప్రాణరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ,భద్రతా ప్రమాణాల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని ఆమె పేర్కొన్నారు.

## భయం, అత్యాశ, నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని మోసాలు

సంస్కృతి.. సైబర్ అవగాహనల
సమ్మేళనం 'సైబర్ దాండియా'
సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం.రమేష్




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సైబర్ నేరగాళ్లు ప్రజల్లోని భయం,అత్యాశ, నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు పోలీసులకు, ప్రజలకు మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో సైబరాబాద్ పోలీసులు 'సైబర్ దాండియా' కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ నాయకత్వంలో, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబరాబాద్ డిసిపి సైబర్ క్రైమ్స్ పుష్ప మార్గదర్శకత్వంలో కార్యక్రమం కొనసాగింది. సుమారు 1,500 మంది ప్రభుత్వ అధికారులు, పోలీసు సిబ్బంది, ఐటీ ఉద్యోగులు, యువత, మహిళలు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపి డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ సాంస్కృతిక వేడుకలతో పాటు సైబర్ భద్రతపై అవగాహనను ప్రజలకు చేరువ చేయడమే సైబర్ దాండియా ముఖ్య ఉద్దేశమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, డిసిపిలు అన్నపూర్ణ, పుష్ప, లావణ్య, రితిరాజ్, ఎస్.శేషాద్రిని రెడ్డి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, ఎస్‌సీఎస్‌సీ, సిఎంసి ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు,ఐటీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు నిరంతర ప్రోత్సాహం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** క్రీడాకారులకు నిరంతర ప్రోత్సాహం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను క్రీడాకారులు కలిసి విజయం సాధించిన మెమోంటోను అంధించారు. దాంతో విజయం సాధించిన జట్టును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా భావిస్తూ ముందుకు వెళ్తేనే భవిష్యత్ ఉంటుందని వివరించారు. ఫైనల్ మ్యాచ్‌లో షాద్‌నగర్..బాలానగర్ జట్లు పాల్గొనడం, బాలానగర్ జట్టు విజయం సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, పట్టుదల పెంపొందించడంతోపాటు ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడుతాయని వివరించారు. క్రీడాకారులు ప్రతిభను మెరుగుపరుచుకొని ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. క్రీడలకు సహకారం అంధించిన మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, పురుషోత్తంరెడ్డిలకు నిర్వాహకులు రవితేజ, కబీర్, భరత్, వినోద్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

## దేవాలయాల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తానని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో ఎల్లమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తాడిపర్తి గ్రామంలో ఎల్లమ్మ దేవాలయం నిర్మాణం చేస్తుండగా టిజి ఐఐసి అధికారులు నిలుపుదల చేశారు. ఈవిషయాన్ని అదివారం గ్రామ నాయకులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకురాగా గ్రామస్తులకు అయన హామీ ఇచ్చారు. టిసి ఐఐసి అధికారులతో మాట్లాడి గుడినిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాననన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్న పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందరి సహకారంతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకు పోతున్నానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు నీలం రాములు, గ్రామ మాజీ సర్పంచ్ దూస రమేశ్, యాచారం మహెశ్, యాచారం అంజయ్య, ముప్పిడి మల్లారి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు
చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి
ఘనంగా పూల పండుగ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ అని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ (డిసిసి) అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌లో నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబురాలలో ఆమె పాల్గొన్నారు. స్థానిక మహిళలతో కలిసి ఆమె బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని ఆడిపాడారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ ప్రకృతిని, పూలను ఆరాధిస్తూ తెలంగాణ ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ అన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ సంస్కృతిని పరిమళింపజేస్తూ, మహిళల ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరగడం సంతోషకరమన్నారు. వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ, ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

**యాచారం :** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు రంగురంగు పూలతో బతుకమ్మలను పేర్చి అందంగా బతుకమ్మలను తీర్చి దిద్దారు. బతుకమ్మ ఆటపాటలతో అయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్ళు కోలాహలంగా మారాయి. బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. అనంతరం బతుకమ్మలను గంగమ్మ ఒడికి చేర్చారు. మండలంలోని చెరువు కుంటల్లో నీరు లేక పోవడంతో గ్రామాల్లో ఉన్న చిన్నపాటి నీటి తొట్లతో బతుకమ్మలను వేశారు. కార్యక్రమాల్లో అయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**హయత్ నగర్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ అని తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి అన్నారు. ఆదివారం హయత్‌నగర్ మండలం మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద జక్కిడి శివ చరణ్ రెడ్డి అభిమాన సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీక అన్నారు. మహిళలు, యువత సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ సన్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జక్కిడి ప్రభాకర్ రెడ్డి, సత్య తేజ్ రెడ్డి, సామిగౌడ్, ఈరిగి రమేష్‌రాజు, సమాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# సిఇసి వైదొలగాలని కాంగ్రెస్ డిమాండ్

- పార్టీలకు 'చదవగలిగే' ఓటర్ల జాబితాలివ్వాలన్న 'ఇసి నిర్ణయం'పై స్పందన



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్టీ 'ఎస్ఐఆర్' కు, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి)కి వ్యతిరేకంగా మరొకసారి గట్టి స్వరాన్ని వినిపించింది. పార్టీలకు 'చదవగలిగే' ఓటర్ల జాబితాలను అందించాలని ఎన్నికల సంఘం (ఇసి) నిర్ణయించడంతో, 'ఓటు దొంగలకు వ్యతిరేకంగా యావత్ దేశం వీధుల్లోకి రావడం ఇది సాధ్యమైందని కాంగ్రెస్ ఆదివారం పేర్కొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి వైదొలగాలని, అలాగే, ప్రత్యే సమగ్ర సవరణ (సర్)ను తక్షణమే రద్దు చేయాలని తమ డిమాండ్లను గట్టిగా వినిపించింది. గత రెండేళ్లుగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ అన్ని రాజకీయపార్టీలకు ఓటర్ల జాబితాలను వెతకగలిగే ఫార్మాట్‌లో అందించాలని, భారత ఎన్నికల సంఘాన్ని పట్టుదలతో, నిలకడగా డిమాండ్ చేస్తూ వచ్చాయని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్–చార్జి కమ్యూనికేషన్స్ జైరామ్ రమేశ్ అన్నారు. 'మధ్య ప్రదేశ్‌లో లక్షలాది బోగస్ ఓటర్లను కాంగ్రెస్ కనుగొన్నప్పుడు, భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) శోధించగలిగే ఓటర్ల జాబితాలను అందజేయడం నిలిపివేసింది. ఈ డిమాండ్‌ను ఇసిఐ పదే పదే తిరస్కరించింది. 'ఓట్ చోరీ'ని అమలుచేయాలన్న డిమాండ్‌ను 8 ఏళ్లుగా తిరస్కరిస్తూ వచ్చింది' అని జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. రెండేళ్ల విరామం తర్వాత 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత రాష్ట్రాలలో తిరిగి ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర సవరణ కోసం ఓటర్ల జాబితాలను రాజకీయ పార్టీలకు శోధించగలిగే ఫార్మాట్‌లో అందించాలని, 2026 అక్టోబరు 15న భారత ఎన్నికల సంఘం ఉత్తర్వును జారీ చేసిందని జైరామ్ రమేశ్ చెప్పారు. 'దేశం అంతా ఓటు దొంగలకు వ్యతిరేకంగా వీధుల్లోకి రావడం వల్లే ఇలా జరుగుతోంది' అని రమేశ్ పేర్కొన్నారు. 'ప్రతీసారి ఓటు దొంగతనం పట్టుబడినప్పుడు మోదీ ప్రభుత్వం ఒక కొత్తగడ వేస్తుంది. స్పష్టంగా చదవగలిగే ఓటర్ల జాబితాను అడ్డుకోవడం, నకిలీ ఓటర్లను చేర్చడం వంటివి చేస్తుంది కానీ ఈసారి అలా కాదు' అని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి అన్నారు. 'ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు పని చేస్తూ భారత ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని దెబ్బతీసిన ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఏదీ కాపాడలేదని జైరామ్ రమేష్ అన్నారు. ఆయన తప్పనిసరిగా వెళ్లిపోవాలి. కానీ అది ఒక్కటే సరిపోదు. దాని ఐటి వ్యవస్థను కూడా సమూలంగా ప్రక్షాళన చేయాలి' అని ఆయన అన్నారు.13కోట్లకు పైగా భారతీయుల రాజ్యాంగ బద్ధమైన ఓటు హక్కును ప్రమాదంలోకి పడేసిన ప్రత్యేక సమగ్ర సవరణను కూడా తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాది ప్రారంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలతో సహా 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితాల స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో తుది ఓటర్ల జాబితా జనవరి 4న విడుదల చేయబడుతుంది. ఎన్నికల చట్టం ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ప్రతీ ఏటా తప్పనిసరి చేసే ప్రక్రియ అని, దీనిని ప్రత్యేకంగా ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలలో నిర్వహిస్తారని ఎన్నికల సంఘం సీనియర్ అధికారి ఒకరు వివరించారు. ఈ 17రాష్ట్రాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తి అయ్యింది. అసోంలో చట్టపరమైన కారణాల వల్ల ప్రత్యే సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు బదులుగా ప్రత్యేక సవరణ జరిగింది. మొట్టమొదటి సారిగా, పార్టీలకు ముసాయిదా, తుది దశలలో హార్డ్, సాఫ్ట్ వెర్షన్లలో 'చదవగలిగే' ఓటర్ల జాబితాలు అందించబడతాయి. ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాలను ఈఆర్ఓ, ఇతర వ్యక్తులకు కూడా అమ్మకానికి అందుబాటులో ఉంచుతారు.

## లేహ్, కార్గిల్ న్యాయవాదులకు
# సుప్రీంకోర్టులో దృశ్యమాధ్యమ అవకాశం

- లడాఖ్‌లో ధర్మాసనం ప్రారంభించిన సిజెఐ



లేహ్: లేహ్, కార్గిల్ న్యాయవాదులకు సుప్రీం కోర్టులో వాదనలు వినిపించేందుకు వీలుగా లడాఖ్ హైకోర్టు ధర్మాసనం నుండే దృశ్యమాధ్యమ విధానంలో అవకాశం కల్పిస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ చెప్పారు. జమ్ముకశ్మీరు హైకోర్టుకు సంబంధించిన లడాఖ్ ధర్మాసనాన్ని లడాఖ్‌లో ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,2019లో కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పడిన తర్వాత లడాఖ్ హైకోర్టు అనే పేరు భారత యూనియన్ జాబితాలో చేరడాన్ని చరిత్రాత్మకమైన విషయంగా పేర్కొన్నారు. 1870వ సంవత్సరంలోనే లడాఖ్‌లో న్యాయస్థానం ఏర్పడిందని, ఇక్కడకు చేరుకోవడానికి శీతాకాలంలో అనేక భౌగోళిక సవాళ్ళు ఆనాటి న్యాయవాదులకు ఎదురయ్యేవని గుర్తు చేశారు. మహా హిమాలయాలకు ఆవల లడాఖ్‌లో హైకోర్టు ఒక శతాబ్దంపైగా పనిచేసిందని గుర్తుచేశారు. లెటర్‌హెడ్‌పై లడాఖ్ హైకోర్టు అని ఉండటం ఒక పద్ధతి అయితే, నేరుగా లడాఖ్‌లోనే ప్రజల ముందుకు హైకోర్టు ధర్మాసనం అందుబాటులోకి రావడం మరో గొప్ప విషయమని అన్నారు. లేహ్, లడాఖ్‌జిల్లాలకు చెందిన న్యాయవాదులు వ్యయ ప్రయాసలకోర్చి ఢిల్లీవరకూ సుప్రీంకోర్టుకు రావాల్సిన అవసరం లేకుండా, సమయాన్ని, ధనాన్ని ఆదాచేసేవిధంగా దృశ్యమాధ్యమ పద్ధతిని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. లేహ్, కార్గిల్ జిల్లాలకు చెందిన న్యాయవాదులకు లడాఖ్ ధర్మాసనం ద్వారా సమాన అవకాశాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. లడాఖ్‌లో ప్రతి మారుమూల నివసించే ప్రజలందరూ ఈ న్యాయస్థానాన్ని తమదిగా భావించినప్పుడే ఈ ధర్మాసనం లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ఈ ప్రాంతానికి సంబంధించిన కేసులను సుప్రీంకోర్టులో ఒకేరోజున జాబితాలో చేర్చి విచారణ జరిపేవిధంగా చర్యలు తీసుకుంటామని, ఆ విధంగా ఏకకాలంలో లేహ్, కార్గిల్, లడాఖ్ ప్రాంతాలకు చెందిన కేసులన్నీ విచారణకు వస్తాయని చెప్పారు. దీనివల్ల ప్రజలు ఢిల్లీకి, లడాఖ్‌కు మధ్య దూరాభారం అవుతుందనే భావన కలిగే అవకాశం ఉండదని అన్నారు. న్యాయస్థానానికి ఈ దేశంలో దూరాభారంతో పనిలేదని, ప్రజలకు సేవలు అందించడంలో అందుబాటులో ఉండటమే ముఖ్యమైన విషయమని అన్నారు. ''ఇప్పుడు మనం ఇక్కడ (లేహ్) సముద్ర మట్టానికి 3,500 మీటర్ల ఎత్తులో ఉన్నాం, మన దేశంలోని ఏ హైకోర్టు ధర్మాసనం కూడా ఇంత ఎత్తులో లేదు, ఐతే ఈరోజు విషయపరంగా ముఖ్యమైనది లడాఖ్ ధర్మాసనం ఆవిర్భావాంశమని, ఇప్పుడు వ్యవస్థలు సన్నిహితంగా వచ్చాయని అన్నారు. న్యాయపరమైన చైతన్య ప్రజలకు చాలా ముఖ్యంగా ఉండాలని ఆయన ఉద్ఘాటించారు. ఈనాడు లేహ్‌లో, కార్గిల్‌లో, సుబ్రాలో తరగతి గదుల్లో ఒక మూల కూర్చుని చదువుకునే పిల్లలు ఏదో ఒకనాటికి న్యాయస్థానంలో చేరి ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించేరోజు వస్తుందని ఆ రోజు వచ్చినప్పుడు ఈ ధర్మాసనం కేవలం లడాఖ్‌కు మాత్రమే చేరుకోలేదని, ఇక్కడ వేళ్ళూనుకుందనే విషయం మనం తెలుసుకోగలుగుతామన్నారు.

# కోల్‌కతాలో తొక్కిసలాట ఘటన
# ఏడుగురు అరెస్టు



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చోర్‌బగాన్ సర్వజనీన్ (సర్వజనీన) దుర్గా మండపం వద్ద శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో ఘటనలో మృతుల సంఖ్య 19మందికి చేరింది. ఈ క్రమంలో ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిర్వాహక కమిటీ సభ్యులతో సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నిర్లక్ష్యం వల్ల నిర్వహణ చర్యల్లో లోపాలు చోటు చేసుకొన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గాయపడిన 25మందిని మెరుగైన చికిత్స కోసం కలకత్తా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తరలించారు. హత్యగా పరిగణించరాని నేరపూరిత నరహత్య కింద పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా శనివారం రాత్రి పోలీసులు 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని ఆ ఐపిఎస్ అధికారి పిటిఐకి తెలిపారు. అరెస్టు అయిన వారిలో పూజా కమిటీ కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, ఒక ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీకి చెందిన ఇద్దరు ఉద్యోగులతో పాటు మరికొందరు ఉన్నారని ఆయన చెప్పారు. 'చోర్‌బగన్ పూజా కమిటీకి రాజ్‌కుమార్ సియోడా కార్యదర్శిగా, శాంతను దుబే ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. పండాల్ వద్ద వెదురు నిర్మాణాన్ని ఏర్పాటు చేసే బాధ్యతను బిప్లబ్ ముఖోపాధ్యాయ్ చూసుకోగా, జనసమూహ నియంత్రణ బాధ్యతలను కౌశిక్ సాహా, పింటూ దే పర్యవేక్షించారు' అని అధికారి తెలిపారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ ఉద్యోగులైన సుమన్ చక్రవర్తి, రాజేష్ పాల్‌లను కూడా అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు.

**ఆసుపత్రిలో క్షతగాత్రులకు అమిత్ షా పరామర్శ**

ఉత్తర కోల్‌కతాలోని దుర్గా పూజా పండాల్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడిన 14 మంది చికిత్స పొందుతున్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం ఉదయం సందర్శించారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారితో కలిసి వచ్చిన షా, వైద్యులతో మాట్లాడి, గాయపడిన వారికి జరుగుతున్న చికిత్సను సమీక్షించారని ఆయన చెప్పారు. ఆ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు రోగులతో కూడా హోం మంత్రి మాట్లాడారని రాష్ట్ర ప్రభుత్వ అధికారి తెలిపారు.

భద్రతా ఏర్పాట్ల సమీక్షకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసిన సిఎం

**మంటపాల సందర్శన షురూ**

పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ఉన్న ప్రధాన దుర్గా పూజా మంటపాల వద్ద భద్రతా ఏర్పాట్లను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ, ఆదివారం కోల్‌కతాలోని సామూహిక పూజా మంటపాలను సందర్శించడం ప్రారంభించిందని ఒక అధికారి తెలిపారు. చోర్‌బాగన్ దుర్గా పూజా మంటపం వద్ద జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో ముఖ్యమంత్రి సువేందు అధికారి ఈ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో విపత్తు నిర్వహణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ అనుజ్ శర్మ ఉన్నారు. వినూత్న థీమ్‌ల కారణంగా భారీ సంఖ్యలో భక్తులను ఆకర్షించే సీల్దా స్టేషన్ సమీపంలోని సంతోష్ మిత్రా స్క్వేర్ నుండి తమ పర్యటనను ప్రారంభించిన కమిటీ సభ్యులు, ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు, లైటింగ్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

**మృతుల్లో ఒకరు బిహార్ వాసి: సిఎం**

చోర్‌బాగన్ దుర్గా పూజా మంటపం వద్ద జరిగిన తొక్కిసలాటలో మరణించిన 19 మందిలో, 18 మంది బాధితులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారని, ఒకరు బిహార్‌లోని ముజఫర్‌పూర్‌కు చెందినవారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఆదివారం తెలిపారు. రాష్ట్ర సిఐడి ప్రధాన కార్యాలయమైన భవానీ భవన్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశం అనంతరం బయటకు వచ్చిన అధికారి, పోస్ట్‌మార్టం అనంతరం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో మృతుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని చెప్పారు. మృతదేహాలను ఆయా కుటుంబాలకు అప్పగించడానికి తమ మేజిస్ట్రేట్ మరియు డిఎస్‌పి స్థాయి అధికారులను నియమించామని, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అధికారులు కుటుంబాలతోనే ఉంటారన్నారు. మృతుల కుటుంబాలను తాను స్వయంగా సందర్శించి, సంతాపం తెలిపి, రూ. 25 లక్షల పరిహార చెక్కులను అందజేస్తానని అధికారి చెప్పారు.

# ఇప్పుడున్న విద్యావ్యవస్థ కాదు.. బహిష్కరణ వ్యవస్థ

- లక్షలాదిమంది యవతను దూరంగా ఉంచుతున్నారు
- మోదీ సర్కార్‌పై రాహుల్‌గాంధీ ఆగ్రహం



ఫైల్ ఫోటో

**న్యూఢిల్లీ :** విద్యావ్యవస్థకు సంబంధించి మోదీ సర్కార్‌పై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో నెలకొని ఉన్నది విద్యా వ్యవస్థ కాదని, లక్షలాది మంది భారత యువతను దూరంగా ఉంచడానికి రూపొందించిన 'బహిష్కరణ వ్యవస్థ' అని అన్నారు. ఇటీవల కొంత మంది విద్యార్థులతో జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోతో పాటు ఒక ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మీకు డబ్బు, అధికారం లేకపోయినా, లేదా మీకు ఇంగ్లీష్ రాకపోయినా, ఈ వ్యవస్థ ఏమాత్రం ఆలోచించకుండా మిమ్మల్ని బయటకు నెట్టేస్తుంది' అని గాంధీ అన్నారు. దీనిని విద్యా వ్యవస్థ అని పిలవలేరని, ఇది లక్షలాది మంది భారత యువతను దూరంగా ఉంచడానికి రూపొందించిన బహిష్కరణ వ్యవస్థ అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంగా రాహుల్‌గాంధీ విద్యార్థులతో సంభాషించడంతో పాటు, తన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున వారితో మమేకమవుతున్నారు. ఈ నెల ప్రారంభంలో చెన్నైలో జరిగిన తన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో రాహుల్‌గాంధీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని 'మొగంబో మోదీ' అని పిలుస్తూ ఆయనపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు దేశ విద్యార్థులతో మాట్లాడుతూ 'మీరు దేనికీ భయపడాల్సిన అవసరం లేదు, మేము మీతో ఉన్నాము, మనమందరం కలిసి మోదీని కూల్చివేస్తాము' అని కూడా అన్నారు. దక్షిణ భారత దేశంలో మొట్టమొదటిసారిగా జరిగిన 'ఛాత్రోన్ కీ గూంజ్' ఆరవ ఎడిషన్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చెన్నైకి ముందు, 'ఛాత్రోన్ కీ గూంజ్' కోట, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్, పుణె, ఇండోర్‌లలో జరిగింది.

## శబరిమల నూతన ప్రధాన అర్చకుడిగా
# సుబ్రహ్మణ్యన్ శంకర నంబూద్రి



**తిరువంతపురం :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమల అయ్యప్పస్వామి దేవాలయం కొత్త ప్రధాన అర్చకుడిగా అరీక్కర సుబ్రహ్మణ్యన్ శంకర నంబూద్రి ఎంపికయ్యారు. మరికొద్ది రోజుల్లో మండల మకరవిలక్కు యాత్ర సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరువాంకూర్ దేవస్వం బోర్డు అధికారుల నూతన ప్రధాన అర్చకుడిని ఎంపిక చేశారు. అలాగే, శబరిమల ఆలయానికి 100 మీటర్ల దూరంలో ఉన్న ప్రసిద్ధ మలికప్పురం దేవి ఆలయ నూతన ప్రధాన అర్చకుడిగా ఎ. దామోదరన్ నంబూద్రి ఎంపికయ్యారు. ఈ ఇద్దరు ప్రధాన అర్చకులను డ్రా విధానంలో ఎంపిక చేశారు. పందళం రాజకుటుంబానికి చెందిన చిన్నారులతో డ్రా తీయించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ సారి కూడా ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున పూజల అనంతరం డ్రా తీశారు. శబరిమల ప్రధాన అర్చక పదవి కోసం తుది పరిశీలన జాబితాలో మొత్తం ఏడుగురు అర్చకుల పేర్లు పోటీలో నిలిచాయి. వారిలో అరీక్కర సుబ్రహ్మణ్యన్ శంకర నంబూద్రి పేరు డ్రా విధానం ద్వారా ఎంపికైంది. కొత్తగా ఎంపికైన ఇద్దరు ప్రధాన అర్చకులు నవంబరు 16వ తేదీన బాధ్యతలు స్వీకరిస్తారు. మరుసటి రోజు, అంటే నవంబరు 17న మండలమకరవిలక్కు యాత్ర సీజన్ ప్రారంభం అవుతుంది. ఈ సందర్భంగా ఆలయం తలుపులు తెరుచుకుంటాయి. వీరి ఆధ్వర్యంలోనే స్వామివారి నిత్య పూజలు, ఉత్సవాలను నిర్వహించనున్నారు. ప్రస్తుతం శబరిమల ఆలయ ప్రధాన అర్చకుడిగా త్రిశూర్‌కు చెందిన ప్రసాద్ ఇ.డి., మలికప్పురం ఆలయ మేల్‌శాంతిగా కొల్లామ్‌కు చెందిన మను నంబూద్రి ఎం.జి. బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నవంబరు 16తో వీరి పదవీకాలం పూర్తికానుంది. తిరువనంతపురానికి చెందిన శంకర నంబూద్రి ప్రస్తుతం ప్రసిద్ధ పజవంగడి గణపతి ఆలయ ప్రధాన అర్చకుడిగా సేవలందిస్తున్నారు. గత 21 సంవత్సరాలుగా ఆయన వివిధ దేవాలయాల్లో ప్రధాన అర్చకుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. గతంలో తిరువనంతపురంలోని నెడుమంగ్‌డ భగవతి ఆలయం, కొట్టాయం ఆలయం, ఢిల్లీలోని ఆర్.కె. పురం అయ్యప్ప ఆలయం, తైకాడ్ శాస్త ఆలయాలలో ఆయన ప్రధాన అర్చకులుగా పనిచేసిన అనుభవం ఉంది. ఇక కోజికోడ్ జిల్లా వడకర ప్రాంతానికి చెందిన ఎ. దామోదరన్ నంబూద్రి, ప్రస్తుతం పయ్యోలి కీఊరులోని మహావిష్ణు ఆలయ ప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్నారు.

## 'ఎస్ఇఎం' సకాలంలో రాకపోవడం వల్లే...
# సిజెపి నేతల బెయిల్ విచారణలో ఆలస్యం

- హక్కుల కార్యకర్త రత్నాసింగ్ •నలుగురు పూచీదారులను అస్పష్ట కారణాలతో తిరస్కరించారని ఆరోపణ



**న్యూఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా బెయిల్ విచారణ ఆదివారం నాడు 'ఆలస్యమైంది' అని, దానికి కారణం స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ (ఎస్ఇఎం) నిర్ణీత సమయానికి రాకపోవడంవల్లేనని హక్కుల కార్యకర్త రత్నా సింగ్ పేర్కొన్నారు. నలుగురు పూచీదారులను అస్పష్టమైన కారణాలతో వారి బెయిల్‌ను తిరస్కరించారని ఆమె ఆరోపించారు. నిర్దేశిత నిరసన ప్రదేశంగా ప్రకటించబడినప్పటికీ, జంతర్‌మంతర్ వద్ద తాళం వేసిన గేట్లను ఎక్కి లోపలకు ప్రవేశించినందుకు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను అక్టోబరు 14న ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. తాము జాతీయ జెండాను ఎగురవేసి నినాదాలు చేశామని సిజెపి నేతలు వాదించారు. రత్నాసింగ్ 'ఎక్స్' లో పెట్టిన ఒక పోస్ట్‌లో మధ్యాహ్నం 12గంటలకు విచారణ జరగాల్సి ఉండగా, తాను ఉదయం 11గంటల నుంచే పోలీస్ స్టేషన్‌లో ఉన్నానని తెలిపారు. సాయంత్రం 4.42 గంటల వరకు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు రాలేదని చెప్పారు.'ఇది నిజంగా ఆందోళన కలిగిస్తోంది. వారు ఇప్పటివరకు అస్పష్టమైన కారణాలతో నలుగురు పూచీదారులను తిరస్కరించారు. నిరసనలో పాల్గొన్నందుకు ఎఫ్ఐఆర్ లు ఉన్న వ్యక్తులను నేర చరిత్ర ఉన్న వారిగా చిత్రీకరించారు' అని సింగ్ ఆరోపించారు. ఆరోపణలపై పోలీసుల నుంచి ఎలాంటి స్పందనా రాలేదన్నారు. రత్నాసింగ్ మరొక పోస్ట్‌లో ఇలా అన్నారు. 'భారత జాతీయ జెండాను ఎగురవేయడం నేరం కాదు. ప్రక్రియలో జాప్యం కారణంగా బాలురను నిర్బంధంలో ఉంచకూడదు. దేశ రాజధాని ఢిల్లీలో ఎస్ఇఎం కోర్టుల పనితీరును ప్రశ్నిస్తూ, అధికార శ్రేణిని అనుసరించాలని ఉన్నత న్యాయస్థానాలు అధికారులను కోరాయని, ఇది అధికారాన్ని పూర్తిగాదుర్వినియోగం చేయడమే' అని ఆరోపించారు. శనివారం నాడు తాము సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను సంప్రదించామన్నారు. ఆదివారంలోగా సౌరవ్‌దాస్, అశుతోష్ రాంకాలను విడుదల చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సిజెపి 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. 'రేపటిలోగా అశుతోష్ రాంకా, సౌరవ్‌దాస్‌లను విడుదల చేయనిపక్షంలో, వారు ఎలాంటి నేరం చేయకపోయినా, వారిపై అభియోగాలు మోపకపోయినా, వారిని నిర్బంధంలో ఉంచడానికి ఉద్దేశపూర్వకంగా కృషి చేసిన వారందరిపైనా మేం చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని సిజెపి హెచ్చరించింది. వారిని ఉద్దేశపూర్వకంగా జైలులో ఉంచడానికి, కాలయాపన చేసే ఎత్తుగడలను ప్రశ్నించకుండా వదిలిపెట్టలేం. బాధ్యులను జవాబుదారీలుగా చేస్తాం' అని అదిపేర్కొంది. ఈ ప్రక్రియ ఓటర్ల హక్కులకు ముప్పు కలిగిస్తుందని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా సిజెపి నిరసన తెలియజేస్తోంది.

# మహారాష్ట్రలో ఘోర రోడ్డుప్రమాదం

**బీడ్:** మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. కారు, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మరణించారు. ఈ ఘటన ఆదివారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మజల్‌గావ్‌కు చెందిన బాధితులు ధారాశివ్ జిల్లాలోని తుల్జాపూర్‌కు వెళ్తుండగా, షిండేవాడి క్రాస్ రోడ్డు వద్ద ఖమ్‌గావ్ – పందర్‌పూర్ జాతీయ రహదారిపై, ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. సమీపంలోని సిసి టివి ఫుటేజ్ పరిశీలించిన పోలీసులు, బ్రిడ్జిపై గుంతల కారణంగా కారు అదుపుతప్పి బస్సును ఢీకొట్టినట్లు గుర్తించారు. భారీ ఎత్తున అక్కడికి చేరుకున్న స్థానికులు ఘటనపై ఆందోళన నిర్వహించారు. బ్రిడ్జిపై గుంతల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల ఆందోళన కారణంగా ఖమ్‌గావ్ – పందర్‌పూర్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న జిల్లా అధికారులు, పోలీసులు అక్కడి చేరుకుని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

# బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు.. సల్మాన్ ఖాన్‌తో పనిచేసే వారే టార్గెట్?



**ముంబయి :** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ లక్ష్యంగా దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఆదివారం సాయంత్రం ముంబయిలోని జుహూ ప్రాంతంలో బైక్‌లపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు.. టైగర్ వాహనంపై కాల్పులు జరిపారు. ఈ ఘటనపై కారులో ఉన్నవారు అప్రమత్తం కావడంతో టైగర్ సురక్షితంగా బయటపడ్డారు. అయితే ఆయన కారు డ్రైవర్‌తో పాటు, మరో ఆటో డ్రైవర్ గాయపడ్డారు. ఈ ఘటనపై జుహూ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఘటనాస్థలిలోని సిసిటివి ఫుటేజీ ఆధారంగా దుండగుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాల్పుల స్పందించిన ముంబై పోలీసులు.. టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి తూటా గాయాలు కాలేదని స్పష్టం చేశారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

**బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో బెదిరింపు పోస్ట్**

ఈ కాల్పుల ఘటనకు పాల్పడింది తామేనంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు సంబంధం ఉన్నట్లు చెప్పబడుతున్న వ్యక్తుల పేరుతో సోషల్ మీడియాలో ఓ పోస్ట్ వెలుగులోకి వచ్చింది. అనిల్ పండిట్, అనిల్ హర్మన్ సంధు ఈ దాడి వెనుక ఉన్నారని ఆ పోస్ట్‌లో పేర్కొన్నట్లు సమాచారం. మేము అతడికి ఫోన్ చేసి విషయం వివరించడానికి ప్రయత్నించాం. కానీ అతడు అర్థం చేసుకోలేదు. ఈరోజు అతడికి సరైన రీతిలో వివరించాం అనే అర్థం వచ్చేలా ఆ పోస్ట్‌లో వ్యాఖ్యలు ఉన్నాయి. ముంబై చిత్ర పరిశ్రమలో తమ మాట వినని వారు లేదా సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేసే వారు తదుపరి లక్ష్యమవుతారని ఆ పోస్ట్‌లో బెదిరించినట్లు సమాచారం. ఈ బెదిరింపు నేపథ్యంలో బాలీవుడ్ వర్గాల్లో ఆందోళన నెలకొంది. కాల్పులకు గల కారణాలు, దాడి వెనుక ఉన్న వ్యక్తుల వివరాలపై పోలీసుల దర్యాప్తులో మరిన్ని అంశాలు వెల్లడికావాల్సి ఉంది.

**2014లో బాలీవుడ్ ఎంట్రీ**

టైగర్ ష్రాఫ్ ప్రముఖ నటుడు జాకీ ష్రాఫ్ కుమారుడు. 2014లో 'హీరోపంతి' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టారు. యాక్షన్ సన్నివేశాలు, స్టంట్లతో గుర్తింపు పొందారు. ఇటీవల ఆయన నటించిన 'బాఘీ 4'లో సంజయ్ దత్, సోనమ్ బజ్వా, హర్నాజ్ సంధు తదితరులు నటించారు.

## 2026-27 టెండర్‌లో...
# చక్కెర ఆధారిత ఇథనాల్‌ను నిషేధించిన భారత్

- మొక్కజొన్నపై ప్రోత్సాహకం తగ్గింపు



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్త పెట్రోల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే, దేశీయ చక్కెర సరఫరాలను పరిరక్షించుకోవాలని ప్రభుత్వం కోరుకుంటున్న నేపథ్యంలో, ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు 2026–27 సప్లయ్ సంవత్సరానికి, పెట్రోల్ కలపడానికిగాను తమ తాజా సేకరణ టెండర్ నుండి చెరుకు రసం, చక్కెర సిరప్, బి–హెవీ మొలాసిస్ నుంచి తయారు చేసిన ఇథనాల్‌ను నిషేధించాయి. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల (ఓఎంసిలు) తరపున భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) అక్టోబరు 16న జారీ చేసిన ఈ టెండర్, పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్‌ను కలపాల్సిన అవసరాన్ని తీర్చడానికి, నవంబర్‌లో ప్రారంభమయ్యే సప్లయ్ సంవత్సరానికి సుమారు 11బిలియన్ లీటర్ల ఇథనాల్ కోసం బిడ్లను కోరుతోంది. ఇది మొక్కజొన్న ఆధారిత ఇథనాల్ ఇచ్చే ప్రోత్సాహకాన్ని కూడా తగ్గిస్తూ, కొనుగోలు ధరను లీటర్‌కు రూ.71.86 నుంచి రూ.68.86 కు తగ్గించింది. '2026–27 ఇథనాల్ సప్లయ్ సంవత్సరానికి, ఇథనాల్ కోసం చక్కెర మళ్లింపును సున్నాకు తగ్గించాలని భారత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది' అని టెండర్ డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. ఈ పరిమాణ బిడ్ టెండర్‌లో చెరుకు రసం, చక్కెర లేదా చక్కెర సిరప్, బి–హెచ్‌వి మొలాసిస్ నుంచి ఉత్పత్తి చేయబడిన ఇథనాల్ కోసం ఎటువంటి ఆఫర్‌లు కోరబడలేదు' అని అది జోడించింది. ముడిచమురు దిగుమతులను తగ్గించడానికి, వాహన ఉద్గారాలను అరికట్టడానికి ధాన్యం ఆధారిత. చెరుకు ఆధారిత ఇథనాల్‌పై ఆధారపడిన ఇథనాల్ – మిశ్రిత పెట్రోల్ కార్యక్రమానికి ఫీడ్ స్టాక్ సేకరణలో ఈ పరిమితులు ఒక మార్పును సూచిస్తున్నాయి. డాక్యుమెంట్ ప్రకారం, మొక్కజొన్న, నూకలు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) సేకరించిన మిగులు బియ్యం, సి–హెవీ మొలాసిస్ నుంచి ఉత్పత్తి అయ్యే ఇథనాల్ కోసం ఈ టెండర్ బిడ్లను అనుమతిస్తుంది. మొక్కజొన్న ప్రోత్సాహకాన్ని లీటరుకు రూ.5.79 నుంచి రూ.2.79కి తగ్గించడం వల్ల ఆ ధాన్యం నుంచి ఇథనాల్ సరఫరా చేసే ఉత్పత్తిదారులకు రాబడి తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో చక్కెర ఆధారిత ఫీడ్ స్టాక్‌లను మినహాయించడం ప్రత్యామ్నాయ ముడిపదార్థాల ప్రాముఖ్యతను పెంచుతోంది. మహారాష్ట్ర, కర్ణాటక వంటి కీలక చక్కెర ఉత్పాదక రాష్ట్రాలలో తక్కువ వర్షపాతం కారణంగా, ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఏర్పడటంతో దేశీయ చక్కె ర లభ్యత, పెరుగుతున్న ధరలపై ఆందోళనల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద చక్కెర వినియోగదారు అయిన భారతదేశం దిగుమతి చేసుకునే ముడి సరుకుపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి ఇథనాల్ మిశ్రమాన్ని ఎక్కువగా ఉపయోగిస్తోంది. అయితే, ఇంధన ఉత్పత్తి కోసం చెరుకు, చక్కెరను మళ్లించడం, ముఖ్యంగా ఉత్పత్తి పరిమితంగా ఉన్నప్పుడు, ఆహార వినియోగానికి అందుబాటులోఉన్న సరఫరాలతో పోటీపడవచ్చు.ఇంధన భద్రతా లక్ష్యాలను తగినంత చక్కెర సరఫరాను కొనసాగించడం, దేశీయ ధరలను అదుపులో ఉంచడం వంటి అవసరాలతో సమతుల్యం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని తాజా టెండర్ స్పష్టం చేస్తోంది. చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని, ఉద్గారాలను తగ్గించే ప్రయత్నాలలో భాగంగా భారతదేశం 20 శాతం వరకు ఇథనాల్ కలిగిన ఇ–20గా పిలువబడే పెట్రోల్‌ను దేశ వ్యాప్త ప్రమాణంగా స్వీకరించింది. చెరుకు, ధాన్యాలు వంటి వ్యవసాయ ముడిపదార్థాల నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేసి, శిలాజ ఇంధన వినియోగంలో కొంత భాగాన్ని భర్తీ చేయడానికి దానిని పెట్రోల్‌తో కలుపుతారు. ఈ కార్యక్రమం దేశీయ డిస్టిలరీలకు గణనీయమైన మార్కెట్‌ను సృష్టించడంతోపాటు, రైతులకు, వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు డిమాండ్‌ను కూడా అందిస్తోంది. 2026–27 సేకరణ చక్రంలో చక్కెర ఆధారిత ఇథనాల్ నుంచి వైదొలగడం వల్ల ధాన్యం ఆధారిత ఉత్పత్తి ప్రాముఖ్యత పెరిగే అవకాశం ఉంది. బ్లెండింగ్ అవసరాలను తీర్చడంలో ఫీడ్ స్టాక్ లభ్యత, సేకరణ ధరలు, డిస్టిలరీ సామర్థ్యం కీలక అంశాలుగా మారతాయి.ఈ కొనుగోలు టెండర్ నవంబర్ 2026నుంచి అక్టోబరు 2027వరకు గల ఇథనాల్ సప్లయ్ సంవత్సరానికి సంబంధించినది.

# జింబాబ్వేపై టీమిండియా విధ్వంసం!

జింబాబ్వేతో రెండో టి–20లో భారత మహిళల జట్టు అదరగొట్టింది. తొలుత బౌలింగ్లో ప్రత్యర్థిని కట్టడి చేసిన టీమిండియా.. ఆ తర్వాత బ్యాటింగ్లో విధ్వంసం సృష్టించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగడంతో స్వల్ప లక్ష్యాన్ని భారత్ కేవలం 8.5 ఓవర్లలోనే ఛేదించింది. షఫాలీ వర్మ 25 బంతుల్లో 55 పరుగులతో విరుచుకుపడగా.. కెప్టెన్ స్మృతి మంధాన 23 బంతుల్లో 40 పరుగులతో మెరిపించింది. మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే మహిళల జట్టు భారత బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో సుమారు 100 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్లలో చిపో ముగేరితిరిపానో 32 బంతుల్లో 34 పరుగులతో టాప్ స్కోరర్గా నిలిచింది. జోసెఫిన్ న్కోమో 29 బంతుల్లో 24 పరుగులతో పోరాడింది. అయితే మిగతా బ్యాటర్లు భారీ స్కోరు చేయడంలో విఫలమయ్యారు. భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ జింబాబ్వేను ఒత్తిడిలోకి నెట్టారు. దీప్తి శర్మ బెలప్డ్ బిజాను ఔట్ చేయగా.. నందిని శర్మ కూడా వికెట్ సాధించింది. యువ క్రికెటర్ నికి ప్రసాద్ తన అంతర్జాతీయ క్రికెట్లో తొలి బంతికే వికెట్ తీసి ఆకట్టుకుంది. చిపో ముగేరితిరిపానోను రిచా ఘోష్ క్యాచ్ పట్టడంతో నికి ప్రసాద్కు తొలి వికెట్ దక్కింది. అనంతరం నికి ప్రసాద్ మరో వికెట్ సాధించడంతో జింబాబ్వే ఇన్నింగ్స్ మరింత ఒత్తిడిలో పడింది. భారత ఫీల్డర్లు కూడా కీలక పాత్ర పోషించారు. రనౌట్తో పాటు క్యాచ్ల ద్వారా జింబాబ్వే బ్యాటర్లను పెవిలియన్‌కు పంపారు. దీంతో జింబాబ్వే భారత్ ముందు కేవలం 103 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు షఫాలీ వర్మ, స్మృతి మంధాన అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి ఓవర్ నుంచే షఫాలీ బౌండరీలతో విరుచుకుపడింది. ఆరంభంలోనే ఫోర్, సిక్స్‌తో జింబాబ్వే బౌలర్లపై ఒత్తిడి పెంచింది. మరోవైపు మంధాన ఆచితూచి ఆడుతూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదింది. రెండో ఓవర్లో మంధాన వరుసగా రెండు ఫోర్లు కొట్టగా.. ఆ తర్వాత షఫాలీ కూడా తనదైన శైలిలో దూకుడు కొనసాగించింది. మూడో ఓవర్లో సిక్స్ బాదిన షఫాలీ.. నాలుగో ఓవర్లోనూ బౌండరీతో సత్తా చాటింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య భాగస్వామ్యం వేగంగా పెరిగింది. నాలుగో ఓవర్లో మంధాన వరుసగా నాలుగు ఫోర్లు బాదడంతో భారత స్కోరు ఒక్కసారిగా ఊపందుకుంది. ఐదో ఓవర్లో షఫాలీ వర్మ వరుస బౌండరీలతో విరుచుకుపడింది. ఆ ఓవర్లో నాలుగు ఫోర్లు సహా 21 పరుగులు రావడంతో జింబాబ్వే బౌలర్లు ఒత్తిడికి గురయ్యారు. పవర్ప్లే ముగిసే సమయానికి భారత్ వికెట్ నష్టపోకుండా 76 పరుగులు చేసింది. టి–20 అంతర్జాతీయ క్రికెట్లో తొలి ఆరు ఓవర్లలో భారత్ సాధించిన అత్యధిక స్కోర్లలో ఈ ప్రదర్శన కూడా చోటు దక్కించుకుంది. జింబాబ్వే బౌలర్లకు ఎక్కడా అవకాశం ఇవ్వకుండా షఫాలీ, మంధాన పరుగుల వరద పారించారు. షఫాలీ వర్మ తన విధ్వంసక బ్యాటింగ్తో ప్రేక్షకులను అలరించింది. బౌలర్ ఎవరన్నది పట్టించుకోకుండా బంతిని బౌండరీ దాటించడమే లక్ష్యంగా ఆడింది. ఏడో ఓవర్లో సిక్స్ బాది కేవలం 24 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తి చేసింది. ఆ వెంటనే మరో సిక్స్ కొట్టి జట్టును విజయానికి మరింత చేరువ చేసింది. చివరకు 25 బంతుల్లో 55 పరుగులు చేసిన షఫాలీ.. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో ఆకట్టుకుంది. బెలప్డ్ బిజా బౌలింగ్లో లాంగ్ఆన్లో క్యాచ్ ఇవ్వడంతో ఆమె ఇన్నింగ్స్ ముగిసింది. అప్పటికే భారత్ విజయం దాదాపు ఖాయమైంది. షఫాలీ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన అనుష్క శర్మతో కలిసి మంధాన లక్ష్యాన్ని పూర్తి చేసింది. మంధాన తన దూకుడును కొనసాగిస్తూ 23 బంతుల్లో 40 పరుగులు సాధించింది. ఆమె ఇన్నింగ్స్‌లో ఫోర్లు, సిక్సర్లతో పాటు చక్కటి టైమింగ్ కనిపించింది. చివరికి ఒలిండర్ చారే బౌలింగ్లో భారీ సిక్సర్ బాది మంధాన మ్యాచ్‌ను ముగించింది.



# 2–2తో సిరీస్ పంచుకున్న భారత్, విండీస్

బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో శనివారం రాత్రి జరిగిన ఐదో, చివరి టి–20లో వర్షం కారణంగా ఫలితం తేలలేదు. ఫలితంగా ఇరు జట్లూ 2–2తో సిరీస్‌ను పంచుకున్నాయి. వర్షం, ఆపై మైదానం తడిగా ఉండటంతో అంపైర్లు 9 ఓవర్ల చొప్పున మ్యాచ్‌ను ప్రారంభించారు. కానీ, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 7.4 ఓవర్లలో 118/5 స్కోరుతో జోరు మీద ఉన్న సమయంలో మళ్లీ వాన రావడంతో ఆట రద్దయింది. అప్పటికి ఇషాన్ కిషన్ (10 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 30), నమన్ ధీర్ (6 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 24 నాటౌట్) ధనాధన్ షాట్లతో అలరించి సిరీస్ విజయంపై రేపిన ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. విండీస్ సారథి హోప్‌కు ప్లేయర్ ఆఫ్ సిరీస్ అవార్డు లభించింది.



**చినుకులు..మెరుపులు.. నిట్టూర్పులు**

చిన్నస్వామి స్టేడియం రెండేండ్ల తర్వాత ఆతిథ్యం ఇచ్చిన పోరు వర్షం కారణంగా రెండు గంటలు ఆలస్యంగా (కుదించిన ఓవర్లతో) మొదలవగా.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆదినుంచి దూకుడు మంత్రం జపించింది. ఇన్నింగ్స్ నాలుగో బంతిని భారీ సిక్స్‌గా మలిచిన ఓపెనర్ అభిషేక్ (6) వెంటనే ఔటైనా.. వన్‌డౌన్‌లో వచ్చిన వరల్డ్ నంబర్ వన్ బ్యాటర్ ఇషాన్ ఉన్నది తక్కువ సేపే అయినా.. తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. రొమారియో వేసిన రెండో ఓవర్‌లో ఖతర్నాక్ షాట్లతో 6, 4,64 బాది 24రన్స్ రాబట్టాడు. షమార్ బౌలింగ్ లో మరో షాట్ కొట్టిన పావెల్‌కు క్యాచ్ ఇచ్చినా శాంసన్ (16) వరుసగా 4,6 బాదడంతో మూడో ఓవర్‌లోనే స్కోరు 50 దాటింది. ఐదో ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన పేసర్ స్ప్రింగర్ తన తొలి బంతికే శాంసన్‌ను బౌల్డ్ చేయగా.. వరుసగా రెండో ఫోర్లతో జోరు మీద కనిపించిన కెప్టెన్ అయ్యర్(22)ను షమార్ వెనక్కుపంపాడు. అయినా భారత జోరు తగ్గలేదు. ఆపై బాదే బాధ్యత తను నమన్ ధీర్ తీసుకున్నాడు. పాల్ బౌలింగ్‌లో ఎదుర్కొన్న తొలి మూడు బంతులకు 6,4,6 కొట్టడంతో 6.4 ఓవర్లకే స్కోరు వంద దాటింది. ఆపై, స్ప్రింగర్ బౌలింగ్లో మరో సిక్స్ కొట్టాడు. తిలక్ (7)ను స్ప్రింగర్ బౌల్ చేసిన తర్వాత మళ్లీ చినుకులు మొదలవడంతో రాత్రి10.18గంటలకు అంపైర్లు ఆట రద్దయినట్టు ప్రకటించడంతో ఆటగాళ్లతో పాటుఅభిమానులు నిరాశగా వెనుదిరిగారు.

ఆరోగ్యం

### 15 ఏళ్ల వయసులోనే

# జీర్ణవ్యవస్థ కేన్సర్

## ఢిల్లీలో వాయు కాలుష్యంతో సంబంధంపై నిపుణుల ఆందోళన

దేశంలో వాయు కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో, ముఖ్యంగా యువతలో జీర్ణవ్యవస్థకు సంబంధించిన కేన్సర్ కేసులు కనిపిస్తుండటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేయడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రి వైద్యులు తమ అవుట్ పేషెంట్ విభాగానికి (ఒపిడి) 15 సంవత్సరాల వయసున్న జీర్ణవ్యవస్థ కేన్సర్ బాధితులు కూడా వస్తున్నారని వెల్లడించడం ఆందోళన కలిగిస్తున్నది. ఢిల్లీలో ఈ శని, ఆదివారాల్లో (అక్టోబర్ 10, 11 తేదీలు) సర్ గంగా రామ్ ఆసుపత్రి, బ్రిటన్‌కు చెందినది క్రిస్టీ ఎన్‌హెచ్ఎస్ ఫౌండేషన్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో వెలువడిన అభిప్రాయాలను అనుసరించి, కొలొరెక్టల్ కేన్సర్‌తో పాటు ఇతర జీర్ణవ్యవస్థ కేన్సర్ల నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్సపై విస్తృత పరిశోధన అవసరం. కేన్సర్ నివారణ గురించి చర్చించేటప్పుడు పొగాకు వినియోగం, ఆహారపు అలవాట్లు, జీవనశైలి వంటి అంశాలకే పరిమితం కాకూడదు. ప్రజలు నివసించే పరిసరాలు, వారు పీల్చే గాలి నాణ్యతను పరిశీలించాలి. ముఖ్యంగా పిఎం 2.5, పిఎం 10 వంటి సూక్ష్మ ధూళి కణాలు, నైట్రోజన్ డయాక్సైడ్, భూమికి సమీపంలోని ఓజోన్ వంటి కాలుష్య కారకాల ప్రభావాన్ని అధ్యయనం చేయాల్సి ఉంటుంది. పిఎం 2.5 అనేది అతిసూక్ష్మమైన కాలుష్య కణాలు. ఇవి శ్వాసకోశంలోకి ప్రవేశించి ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి.



ఈ ఏడాది ప్రచురితమైన ఒక సమీక్షలో 70అధ్యయనాలను పరిశీలించగా, దీర్ఘకాలం పిఎం 2.5 కాలుష్యానికి గురికావడం, కొలొరెక్టల్ కేన్సర్ వంటి జీర్ణవ్యవస్థ కేన్సర్ల వల్ల మరణాల ప్రమాదం పెరగడం మధ్య సంబంధం ఉన్నట్లు వెల్లడైంది. మరో అధ్యయనం పిఎం 2.5, నైట్రోజన్ డయాక్సైడ్, ఓజోన్‌కు ఎక్కువగాగురికావడం, కేన్సర్ ప్రమాదం పెరగడం మధ్య సంబంధాలను గుర్తించింది. అయితే, ఈ పరిశోధనలు వాయు కాలుష్యం ఒక్కటే కేన్సర్‌కు కారకమని చెప్పలేం. ముఖ్యంగా యువతలో కేన్సర్ కేసులు పెరగడానికి కాలుష్యం కూడా ఒక కారణంగా పేర్కోవాలి. **ముందస్తు గుర్తింపు అవసరం...** వైద్య నిపుణులను అనుసరించి, చిన్నవయసులో జీర్ణవ్యవస్థ కేన్సర్ నిర్ధారణ కావడానికి కుటుంబంలో కేన్సర్ చరిత్ర, జన్యుపరమైన కారణాలు, ఆహారపు అలవాట్లు, జీవనశైలి, ఇన్ఫెక్షన్లు, పర్యావరణ ప్రభావాలు వంటి అనేక అంశాలు కారణమై ఉండవచ్చు. అందువల్ల ఒకే కారణాన్ని గుర్తించి నిర్ణయానికి రావడం సరైనది కాదు. భారతీయ ప్రజల ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా దీర్ఘకాలిక పరిశోధనలు నిర్వహించాలి. ఇంగ్లాండ్ లో 50 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న వారిలో కొలొరెక్టల్ కేన్సర్ వచ్చే యవకాశం, 2001లో ప్రతి లక్ష మందికి 3.9 ఉండగా, 2023 నాటికి అది 8.4కు పెరిగినట్లు ఒక విశ్లేషణ పేర్కొంది. దేశంలో 25 నుంచి 49 సంవత్సరాల వయసు గల వారిలో ఈ రేటు ప్రతి లక్ష మందికి 3.5గా ఉంది. అయినప్పటికీ, పట్టణ కేన్సర్ రిజిస్ట్రీలు కొలొరెక్టల్ కేన్సర్ కేసుల పెరుగుదలను సూచిస్తున్నాయి. కేన్సర్ భారాన్ని తగ్గించడానికి ప్రజల్లో అవగాహన పెంచడం, నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, అవసరమైన వారికి సరైన స్క్రీనింగ్ నిర్వహించడం, వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించడం ఎంతో ముఖ్యం. జీర్ణవ్యవస్థకు సంబంధించిన లక్షణాలు నిరంతరంగా కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి. మొత్తం మీద వాయు కాలుష్యం మరియు కేన్సర్ మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి భారత దేశంలో మరిన్ని పరిశోధనలు, మెరుగైన గాలి నాణ్యత పర్యవేక్షణ, సమగ్ర కేన్సర్ రిజిస్ట్రీలు అవసరం. కాలుష్య ఉద్గారాలను తగ్గించడం ప్రజారోగ్య పరిరక్షణకు కీలకం. అదే సమయంలో, కేన్సర్ ప్రమాద కారకాల నియంత్రణ, తగిన వైద్య పరీక్షలు, సకాలం లో రోగ నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

## ఊబకాయంపై డబ్ల్యుహెచ్ఒ ఆందోళన

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) పిల్లలు, కౌమారదశలో ఉన్నవారిలో ఊబకాయంపై ఆందోళన వ్యక్తంచేసింది. సమస్య నియంత్రణకు సంబంధించి తొలిసారిగా వైద్య మార్గదర్శకాలను విడుదల చేసింది. వీటిలో వయస్సును బట్టి చికిత్సా విధానాలను సూచించింది. తొమ్మిదేళ్ల లోపు పిల్లలకు బరువు తగ్గించే మందులు, బేరియాట్రిక్ శస్త్రచికిత్సలు సిఫారసు చేయలేదు. బదులుగా కుటుంబసభ్యుల భాగస్వామ్యంతో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమబద్ధమైన వ్యాయామం, జీవనశైలిలో మార్పులు తీసుకురావాలని సూచించింది. 10 నుంచి 19 ఏళ్ల వయసున్న కౌమారదశలోని వారికి జీవనశైలి మార్పులతో ఆశించిన ఫలితాలు రానప్పుడు, వైద్యుల పర్యవేక్షణలో కొన్ని ఆమోదిత ఊబకాయ నిరోధక మందులను పరిగణించవచ్చు. తీవ్రమైన ఊబకాయం ఉన్నవారిలో వైద్యప్రమాణాల ప్రకారం శస్త్రచికిత్సను పరిశీలించవచ్చు. అయితే, సెమాగ్లుటైడ్ వంటి మందుల దీర్ఘకాలిక



భద్రత, ప్రభావాలపై పిల్లల్లో తగిన పరిశోధనలు లేవని డబ్ల్యుహెచ్ఒ పేర్కొంది. ఊబకాయంతో కలిగే ఆందోళన, నిరాశ, ఆత్మవిశ్వాసం తగ్గడం, ఇతరుల నుంచి వేధింపులు వంటి మానసిక సమస్యలపైనా దృష్టిపెట్టాలని సూచించింది. శారీరక చురుకుదనాన్ని పెంచే వీడియో గేమ్స్, ఫిట్నెస్ యాప్‌లు, నడకను లెక్కించే పరికరాలను ప్రోత్సహించింది. 2024 నాటికి ప్రపంచవ్యాప్తంగా 519 ఏళ్ల వయసున్న సుమారు 17 కోట్ల మంది పిల్లలు, కౌమారదశలోని వారు ఊబకాయంతో బాధపడుతున్నట్లు అంచనా. భారత్‌లోనూ ఈ సమస్య పెరుగుతోంది. బాల్యంలోనే ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించడం, సరైన పోషకాహారం అందించడం, వైద్యుల సలహాతో చికిత్స పొందడం ద్వారా ఊబకాయాన్ని నియంత్రించవచ్చు.

## ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలకు ప్రొసీడింగ్ ఉత్తర్వులు అందజేయాలి

### యూనియన్ రాష్ట్ర కన్వీనర్ చక్రపాణి డిమాండ్




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** ఆదిలాబాద్ జిల్లాలో పని చేస్తున్న ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలకు వెంటనే ప్రొసీడింగ్ ఉత్తర్వులు అందించాలని ఎఐటియుసి అనుబంధ తెలంగాణ ప్రీ ప్రైమరీ టీచర్స్, ఆయాల యూనియన్ రాష్ట్ర కన్వీనర్ తోపునూరు చక్రపాణి అధికారులకు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఫంక్షన్‌లో ప్రీ ప్రైమరీ టీచర్స్, ఆయాల యూనియన్ జిల్లా సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా చక్రపాణి హాజరై మాట్లాడారు. జిల్లాలో విధులు ప్రారంభించి 4 నెలలు గడిచిన ఇప్పటి వరకు ప్రొసిడింగ్ అర్డర్లు ఇవ్వలేదని వెంటనే టీచర్ల కు, ఆయాలకు ప్రొసిడింగ్ ఉత్తర్వులు అందజేయాలని తెలిపారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలను నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేయాలన్నారు. పనికి తగ్గ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.విలాస్ మాట్లాడుతూ కనీస వేతన చట్టం ప్రకారం టీచర్లు, ఆయాలకు నెలకు రూ.26000 వేతనం చెల్లించాలన్నారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, ఉప ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లెపల్లి గంగయ్య, ప్రి ప్రైమరీ స్కూల్ టీచర్స్, ఆయాల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రే ఐశ్వర్యం, సహాయ కార్యదర్శి అనుక్ష, సహాయ కార్యదర్శి తెలంగ్ అజయ్ కుమార్, సభ్యులు కావ్య, మనిష, శివలీల తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి : విలాస్



**ప్రజాపక్షం/మావల:** జాతీయ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.విలాస్, జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో డిఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ఆరో రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని ఆదివారం విలాస్, సిర్ర దేవేందర్ సందర్శించి ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్స రాలుగా ఆరోగ్య శాఖలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎఐటియుసి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి




### ఎస్‌టియు డిమాండ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు) నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి నివేదికను తెప్పించడంతో పాటు, హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌టియు రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎఐఎస్‌టిఎఫ్ ఆడిటర్ ఎం.పర్వత్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌టియు 80 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో నిర్వహించనున్న వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల ఇండోనేషియా రాజధాని జకార్తాలో 40 దేశాల ప్రతినిధులు పాల్గొన్న అంతర్జాతీయ విద్యా సదస్సులో పాల్గొన్న ఎం.పర్వత్‌రెడ్డిని జిల్లా ఎస్‌టియు



శాఖ ఘనంగా సన్మానించింది. ఎస్‌టియు 80వ వార్షికోత్సవాలను నవంబర్ 18న ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.మధుసూదన్‌రెడ్డి ప్రకటించారు. సమావేశంలో ఎస్‌టియు ప్రతినిధులు కె.రమేష్, డి.ప్రభాకర్, కె.రఘురాంరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సత్యనారాయణ, బాలస్వామి, హనుమంతరెడ్డి, జమీల్ అహ్మద్, మురళి, ప్రవీణ్ కుమార్, నరసింహ, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, మండల బాధ్యులు శివశంకర్, హుస్సేన్, నారాయణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్‌లో 50 కిలోల తూకానికి అధికారులు సహకరించాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** వ్యవసాయ మార్కెట్ యార్డులో 50 కేజీల బస్తా తూకాన్ని అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య మార్కెట్ అధికారులను కోరారు. ఆదివారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ కార్మిక సంస్థల నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా ఎఫ్‌సిఐ, సిడబ్ల్యుసి, ఎస్‌డబ్ల్యుసి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్, మందుల బస్తాలు అన్ని కూడా 50 కేజీలు బస్తా తూకం అమలవుతుంటే, ఐకెపి ద్వారా రైతు పండించిన ధాన్యాన్ని 40 కిలోల తూకం చేస్తుంటే, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మాత్రం 60, 110 కిలోల తూకం అమలు చేయడం దుర్మార్గమన్నారు. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. ఈ తూకంతో హమాలీ కార్మికులపై విపరీతమైన భారం పడి ఆరోగ్యాలు పాడవుతున్నాయన్నారు. కార్మికుల శ్రమతో మార్కెట్ యార్డుకు ఆదాయం వస్తున్నా, వారి సంక్షేమం కోసం నయా పైసా ఖర్చు చేయడం లేదని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో హమాలీ కార్మికులు 60 కేజీల నుండి 110 కేజీల బరువు మోసి ఆరోగ్యం దెబ్బతిని, మోకాళ్ల నొప్పుతో నడవలేని స్థితికి చేరుకుంటున్నారన్నారు. జిల్లా అధికార యంత్రాంగం సహకరించి చట్ట ప్రకారం వ్యవసాయ మార్కెట్ యార్డులో 50 కేజీల బస్తా తూకాన్ని అమలు చేయాలని, లేని యెడల ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికయిన జిల్లా సంబంధిత అధికారులు, వ్యవసాయ కమిటీ స్పందించి జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డులో 50 కేజీల బస్తా తూకాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా ఓమయ్య డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఎఐటియుసి హమాలీ యూనియన్ అధ్యక్షులు అంజయ్య, కార్యదర్శి సాయిలు, కోశాధికారి నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలి

### అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క

**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రజా పోరాటాలతోనే సమస్యలను పరిష్కరింయుకోవాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క కోరారు. సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు కోసం తీసుకువచ్చిన 641జిఒను రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ఎకో టౌన్ పేరుతో తీసుకువచ్చిన 641జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ సిద్దాపూర్ గ్రామ ప్రజల అభిప్రాయం లేకుండా ప్రజలకు నష్టదాయకమైన డంపింగ్ యార్డును తీసుకురావడానికి జిఒ 641తీసుకురావడం అన్యాయమన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లెందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలను కాలుష్య కోరల్లోకి నెట్టి వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల పర్యావరణాన్ని రక్షించాల్సిన ప్రభుత్వం చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి రోగాల బారిన పడే విధంగా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. చెత్త డంపింగ్ యార్డు వల్ల పర్యావరణం కాలుష్యం కావడంతోపాటు స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే అస్కారం ఉందని అన్నారు. సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డును ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని, జిఒ 641ని రద్దు చేసే వరకు ఉద్యమాలు, పోరాటాలు, ధర్నాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని స్థానిక ప్రజలకు పిలుపునిచ్చారు. సిద్దాపూర్‌లో చెత్త డింపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే భూగర్భ జలాలు దెబ్బతిని తాగునీరు కలుషితమయ్యే అస్కారం ఉంటుందన్నారు. డంపింగ్ యార్డు చుట్టుపక్కల ఈగలు, దోమలు, క్రిమి కీటకాలు వంటి వ్యాధి కారకాలు పెరిగి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించకపోతే భూసారం దెబ్బతినడం, పంటలపై ప్రతికూల ప్రభావం పడటం, పరిసరాల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిద్దాపూర్‌తోపాటు పరిసర గ్రామాల ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకుంటే బాగుంటుందని, ప్రజల ఆరోగ్యం, పర్యావరణం కంటే ఏ అభివృద్ధి ముఖ్యం కాదని ఈ సందర్భంగా విమలక్క హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డు పోరాట కమిటీ జెఎసి చైర్మన్ రాంబాల్‌నాయక్, జెఎసి నాయకులు పినపాక ప్రభాకర్, వి.నారాయణరెడ్డి, ఈట గణేష్, దాస్‌రాంనాయక్, ఎల్లారం శేఖర్‌రెడ్డి, ఎమ్మె శ్రీలత సత్యనారాయణ, మెండే కృష్ణ యాదవ్, బాతుక దేవేందర్ యాదవ్, కోస్గి శ్రీనివాస్, మామిళ్ళ విఠల్, కళ్ళెం నర్సింహ్మారెడ్డి, వడ్డే బాలయ్య, ప్రతాప్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బొజ్జ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.







ట్యాంక్‌బండ్ వద్ద సద్దుల బతుకమ్మ సంబురాలు








# ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ కార్నివాల్‌కు విశేష స్పందన



## సంప్రదాయాలు, సంస్కృతితో అలరించిన వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు–2026లో భాగంగా సద్దుల బతుకమ్మ సందర్భంగా హెచ్ఎండిఎ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ దగ్గర నిర్వహించిన బతుకమ్మ కార్నివాల్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు ట్యాంక్‌బండ్‌ను పండుగ వాతావరణంతో కళకళలాడేలా చేశాయి. కార్నివాల్‌లో ఏర్పాటు చేసిన భారీ తేలియాడే బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాత్మక అలంకరణలు, థీమ్ ఆధారిత ఇన్‌స్టాలేషన్లు, ఫొటో బూత్‌లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సందర్శకులు ఈ ప్రత్యేక ఏర్పాట్ల వద్ద ఫొటోలు తీసుకుంటూ పండుగ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలంకరణలు వేడుకలకు మరింత శోభను చేకూర్చాయి. బతుకమ్మ ఘాట్ల ను ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలను హెచ్ఎండిఎ ఏర్పాటు చేసింది. భద్రత, సౌకర్యవంతమైన నిర్వహణకు చర్యలు తీసుకోవడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని సంప్రదాయ బతుకమ్మ వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ సంప్రదాయ కళారూపాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జానపద ప్రదర్శనలు, కళా కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. అలాగే చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఆహార పదార్థాలు, సంప్రదాయ ఉత్పత్తుల స్టాళ్లు ఏర్పాటు చేయడంతో స్థానిక కళాకారులు, వ్యాపారులు, ఔత్సాహికులకు తమ ఉత్పత్తులను ప్రదర్శించుకునే అవకాశం లభించింది. కార్నివాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడి స్క్రీన్‌ల ద్వారా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు అందించారు. ప్రజల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో బతుకమ్మ కార్నివాల్ ఘనంగా ముగిసింది. తెలంగాణ సంస్కృతి, సామాజిక ఐక్యత, స్థానిక ప్రతిభకు వేదికగా నిలిచిన ఈ వేడుకలు సంప్రదాయం, సమాజం, స్థానిక వ్యాపారాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చాయి.

# అమరజ్యోతి ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని రాష్ట్ర సచివాలయం సమీపంలోని అమరజ్యోతి ప్రాంగణంలో ఆదివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పాల్గొని మహిళలతో కలిసి సంప్రదాయబద్ధంగా బతుకమ్మను పేర్చారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా అలంకరించి, మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన శైలికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజ్యోతి ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. అంతకుముందు మంత్రి సీతక్క తన నివాసమైన ప్రజాభవన్‌లో కాంగ్రెస్ మహిళా నేతలు, వ్యక్తిగత సిబ్బందితో కలిసి పలు రకాల పూలతో బతుకమ్మను పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమరజ్యోతి ప్రాంగణానికి చేరుకుని మహిళలతో మమేకమై బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు భారీ సంఖ్యలో వేడుకలను విజయవంతం చేశారు.

**మంత్రి దామోదర్‌ను పరామర్శించిన సీతక్క**

నగరంలోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదివారం పరామర్శించారు. ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న దామోదర్ రాజనర్సింహ ఆరోగ్య పరిస్థితిని ఆమె అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీసిన మంత్రి సీతక్క, వైద్యుల సూచనలను పాటిస్తూ పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో పాల్గొనాలని ఆమె ఆకాంక్షించారు.

# నేడు ఫ్యూచర్ సిటీలో సిఎం పర్యటన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భారత్ ఫ్యూచర్ సిటీలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు ఇబ్రహీంపట్నంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం 5:30 గంటలకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని సందర్శిస్తారు. అనంతరం 6 గంటలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయుఎం) క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై సమీక్ష సమావేశంలో పాల్గొంటారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

# ప్రజావాణి కార్యక్రమాల రద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పరిపాలనా కారణాల రీత్యా సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిహెచ్ఎంసి, హైడ్రా, ఎంఎంసి, సిఎంసి ఆదివారం వేర్వేరుగా విడుదల చేసిన ఒక ప్రకటనలలో వెల్లడించాయి. ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 26న యథావిధిగా నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. తమ తమ పరిధిలోని ప్రజలు ఈ మార్పును గమనించి తమ వినతులు, ఫిర్యాదులను తదుపరి ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# మన ఓటే మన గొంతుక



**న్యూఢిల్లీ:** 'మన ఓటే మన గొంతుక. ప్రజాస్వామ్యం మన హక్కు. ఓటు చోరీపై ప్రశ్నించకుండా వదిలిపెట్టేది లేదు' అని వక్తలు ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమానికి మరింత బలం చేకూరుతోందన్నారు. 'ఓటు చోరీ, ప్రజాస్వామ్యంపై దాని ప్రభావం' అంశంపై ఢిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో సెమినార్ నిర్వహించారు. విద్యార్థులు, మేధావులు, యువజనులు హాజరయ్యారు. ప్రజాస్వామ్య హక్కులు, ఎన్నికల సమగ్రత పరిరక్షణ సంకల్పానికి ఈ సెమినార్ ప్రతిబింబించింది. సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి సుఖ్‌జిందర్ మహెసరీ, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు వీరాజ్ దేవాంగ్ ప్రసంగించారు.

ప్రభుత్వాన్ని ఎంపిక చేసుకునేందుకు ప్రజలకు ఉన్న హక్కును పరిరక్షించడానికి తోడు ఎన్నికల్లో అవకతవకలపై పోరాడటం అత్యవసరమన్నారు. మన ఓటే మన గొంతుక... ప్రజాస్వామ్యం మన హక్కు అని నాయకులు స్పష్టం చేశారు. ఓటు దొంగతనాన్ని ఉపేక్షించేది లేదని, ఇందుకు బాధ్యులైన వారిని నిలదీయడమే కాకుండా వారిని శిక్షించేంత వరకు విశ్రమించరాదని పిలుపునిచ్చారు. సెమినార్‌లో భాగంగా 'పది రోజుల్లో దద్దరిల్లిన ప్రపంచం' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

# జీతాల తగ్గింపు అన్యాయం

- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల జీతాలు తగ్గిస్తూ ప్రభుత్వం జి.ఓ 1195 తేవడం అత్యంత అన్యాయమని తెలంగాణ రక్షణ సేన(టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల జెఎసి నాయకులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 17 వేల మంది ఉద్యోగులుంటే, వారిలో కొంతమంది వేతనాలు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు పెరుగుతున్న ధరలతో కరువు పరిస్థితులు నెలకొని, ద్రవ్యోల్బణం నానాటికి పెరుగుతుంటే, ఉద్యోగుల జీతాలు తగ్గించడం ఏంటని ప్రశ్నించారు. కొందరి వేతనాలు పెంచి మరికొందరివి తగ్గించడం వెనుక ఉన్న వివక్ష ఏంటని నిలదీశారు. కేంద్రం నిధులు ఇస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సమయానికి వేతనాలు ఇవ్వకపోగా, శ్రమను దోచుకుంటుందని మండిపడ్డారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, వైద్యారోగ్య శాఖ మంత్రిని అప్రమత్తం చేసి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర నిబంధనల ప్రకారం ఏటా 5 శాతం జీతాలు పెరగాల్సి ఉండగా కోత పెట్టడం దారుణమన్నారు. దేశంలోని ఏడు రాష్ట్రా ల్లో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేశారని, కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. మంత్రిని కలిసి సమస్యలు చెప్పుకునేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.

# సిబ్బంది ఒత్తిడికి దూరంగా విధులు నిర్వర్తించాలి

- ఆయుధ, వాహనాలకు సిపి సజ్జనార్ ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ పేట్లబురుజులోని సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనర్ ఆదివారం సంప్రదాయబద్ధంగా ఆయుధ, వాహన పూజలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా నిలిచే పోలీసు ఆయుధాలు, పెట్రోలింగ్ వాహనాలకు ప్రత్యేక పూజలు చేసి పోలీసు సంప్రదాయాలను చాటారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయుధ పూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ అన్నారు. దుర్గామాత దివ్య ఆశీస్సులతో పోలీసు అధికారులు, సిబ్బంది ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో నిరంతరం నిమగ్నమయ్యే పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో మానసిక ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంత వాతావరణంలో బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు.హైదరాబాద్ నగర పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు దుర్గాష్టమి, విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాస్, చైతన్యకుమార్, రమణారెడ్డి, రాఘవేందర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రెజ్లింగ్ కుస్తీ పోటీల్లో సాయిమనీష్ గౌడ్‌కు రజతం



ప్రజాపక్షం/శామీర్‌పేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో మైత్రి గ్రౌండ్‌లో నిర్వహించిన రెజ్లింగ్ (కుస్తీ) పోటీల్లో రంగు సాయిమనీష్ గౌడ్ రజత పథకం సాధించారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటి ఉద్దెమర్రికి చెందిన రంగు నవీన్‌గౌడ్ విజయ దంపతుల కుమారుడు రంగు సాయిమనీష్‌గౌడ్ ఆదిలాబాద్ జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. కోచ్ శ్రీధర్ శిక్షణలో కఠినమైన రెజ్లింగ్ (కుస్తీ) క్రీడలో రాణిస్తు తన ప్రతిభను చాటుకున్నాడు. స్థానిక ఎంఎల్‌ఎ గూడెం మహిపాల్‌రెడ్డి చేతుల మీదుగా సాయిమనీష్ గౌడ్ రజిత పథకం అందుకున్నాడు. ఇటీవల 70వ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలో అండర్ 17 విభాగంలో 48 కేజీల పరిమితిలో రజత పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కోచ్ శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకుని రజత పతకం సాధించేలా కృషి చేసినందుకు కోచ్ శ్రీధర్‌తో పాటు సాయిమనీష్‌గౌడ్‌ను పలువురు ప్రశంసించారు. అంచెలంచెలుగా రాణిస్తు జాతీయ, అంతార్జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదగాలని ఆకాంక్షించారు.

## బట్టల పరమేశ్వర్‌కు ఘన సన్మానం



ప్రజాపక్షం/జవహర్ నగర్ : ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన బట్టల పరమేశ్వర్‌ను పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు పోలస అశోక్, మునిని గణేష్ గౌడ్, రెడ్డి సంఘం యువజన అధ్యక్షుడు కొథాటి కార్తిక్ రెడ్డి, జనసేన నాయకుడు కనుగంటి నరేందర్ యాదవ్, క్రిస్టియన్ మైనారిటీ కోఆర్డినేటర్ మెట్టు ప్రణీత్ కుమార్, బిజెపి నాయకుడు చిలుపూరి సాయికృష్ణ, విలేకరి కాసుల నరేష్ తదితరులు పాల్గొన్నారు. పరమేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, ఆయన నాయకత్వంలో ఎంఆర్‌పిఎస్ బలోపేతం కావాలని, అణగారిన వర్గాలకు మెరుగైన సేవలు అందాలని ఆకాంక్షించారు.

## వైద్య చికిత్సకు రూ.లక్ష సిఎం సహాయ నిధి



ప్రజాపక్షం/కూకట్‌పల్లి : అత్యవసర వైద్య చికిత్స కోసం హనుమాన్ నగర్ కాలనీకి చెందిన మెరీనాకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.లక్ష విలువైన సిఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఒసి మంజూరు పత్రాన్ని ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. వెంకటేశ్వరనగర్ డివిజన్ పరిధిలోని మెరీనా వైద్య చికిత్స నిమిత్తం సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం రూ.లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని నిరుపేదలకు సిఎం సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని అన్నారు. వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందేలా సహకరించిన గాంధీకి మెరీనా కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశినాథ్ యాదవ్, తిరుపతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

## తూంకుంటలో దుర్గాదేవిగా అమ్మవారు



ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట డివిజన్ తూంకుంటలోని గాయత్రీ మహాక్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆదివారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్‌విఎల్‌ఎన్ మూర్తి ఆధర్యంలో గాయత్రీ మహాక్షేత్రంలో వేద పండితుల మంత్రోచ్చరణలతో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఉత్సావాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శినమిచ్చింది. తూంకుంట చుట్టుపక్కల పరిసర ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తరించారు.

## బతుకమ్మ నిమర్జనానికి నీరు కరువు

ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి సర్కిల్ కార్యాలయం పరిధిలోని సూరారం కట్ట మైసమ్మ బతుకమ్మ ఘాట్ వద్ద సిఎంసి అధికారుల అర కొర ఏర్పాట్లతో మహిళలు బతుకమ్మలు ఆడి వదలడానికి నీరు ఏర్పాటు చేయకపోవడం విడూరంగా మారింది. బతుకమ్మ ఘాట్‌లో సరిగ్గా నీరు లేకపోవడంతో మహిళా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు బతుకమ్మలు వదలడానికి నీరు అందకపోవడంతో మహిళలు కిందికి వంగి మరి ప్రమాదకరంగా బతుకమ్మలు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక నాయకులు ముందస్తుగానే కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌ను కలిసి ఏర్పాట్లు చేయాలని వినతి పత్రాలు ఇచ్చిన కొంపల్లి సిఎంసి అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# విలువైన సంస్థను కాజేసేందుకు కుట్ర?

- డిజిటల్ సంతకాల ఫోర్జరీ, తప్పుడు పత్రాలతో షేర్ల బదిలీ చేసినట్లు ఫిర్యాదు
- బృహస్పతి టెక్నాలజీస్ వ్యవహారంలో కేసు నమోదు..

ప్రజాపక్షం/హైదరాబాద్: తాను స్థాపించి అభివృద్ధి చేసిన సంస్థలో తనతో పాటు భార్య, కుమారుడికి ఉన్న వాటాలను వారి అనుమతి లేకుండానే ఇతరుల పేర్లపైకి అక్రమంగా బదిలీ చేశారని వచ్చిన ఫిర్యాదుతో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. డిజిటల్ సంతకాలను ఫోర్జరీ చేయడం, నకిలీ ఈ మెయిల్ ఖాతాలు సృష్టించడం, కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసిఎ)కు తప్పుడు పత్రాలు సమర్పించడం ద్వారా కంపెనీ యాజమాన్యాన్ని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని బృహస్పతి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ సి.వెంకటరమణారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై తొలుత జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును తదుపరి దర్యాప్తు కోసం హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం.. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొఫెసర్ సి.వెంకటరమణారెడ్డి 2006–07లో కరీంనగర్‌లో బృహస్పతి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను స్థాపించారు. సంస్థలో ఆయనకు 5,000, ఆయన భార్య వీణారెడ్డికి 4,900, కుమారుడు నిఖిల్‌రెడ్డికి 100 వాటాలు ఉన్నాయని పేర్కొన్నారు. తొలుత సంస్థ కార్యకలాపాలను స్వయంగా పర్యవేక్షించిన ఆయన, అనంతరం తన వద్ద విద్యార్థిగా ఉన్న రాజశేఖర్ పాపోలు సంస్థలో చేరడంతో పరిపాలనా బాధ్యతలను అప్పగించారు. కుమారుడు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తర్వాత కూడా సంస్థ కార్యకలాపాలపై మార్గనిర్దేశం చేస్తూ వచ్చారు. 2025 జూలై 29న రాజశేఖర్ పాపోలు తనను తాను సంస్థ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్‌గా పేర్కొంటూ మీడియా, సామాజిక మా ధ్యమాల్లో ప్రచారం చేసుకోవడంతో వెంకటరమణారెడ్డి సంస్థ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఒసి) రికార్డులను పరిశీలించినట్లు ఫిర్యాదులో తెలిపారు. తనతో పాటు భార్య, కుమారుడి వాటాలు తమ అనుమతి లేకుండా రాజశేఖర్ పాపోలు, ఆయన భార్య గాదిరాజు హైమావ తి పేర్లపైకి బదిలీ అయినట్లు గుర్తించానని పేర్కొన్నారు. ఇందుకోసం ఎలాంటి చెల్లుబాటయ్యే వాటాల బదిలీ పత్రాలపై సంతకాలు చేయలేదని, ఎలాంటి ప్రతిఫలం కూడా పొందలేదని ఫిర్యాదులో ఆరోపించారు.



రాజశేఖ ర్ పాపోలు, ఆయన భార్య హైమావతి, చార్టర్డ్ అకౌంటెంట్ వెంకటశివ బాలచంద్ర చక్కా కుమ్మక్కై తన డిజిటల్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని, తన పేరుతో నకిలీ ఈమెయిల్ ఖాతాలు సృష్టించి, వాటి ద్వారా ఎంసిఎకు తప్పుడు పత్రాలు, వార్షిక నివేదికలు సమర్పించారని వెంకటరమణారెడ్డి ఆరోపించారు. ఈ పత్రాల ఆధారం గా తనను, తన భార్యను, కుమారుడిని కంపెనీ రికార్డుల నుంచి తొలగించి, నిందితుల పేర్లను యాజమాన్య హో దాల్లో చూపించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ అక్రమాలపై తాను, తన కుమారుడు ప్రశ్నించగా రాజశేఖర్ పాపోలు సంస్థను స్వాధీనం చేసుకున్నట్లు అంగీకరించడంతో పాటు, తిరిగి వాటాల గురించి మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రాణహాని కలిగిస్తామని బెదిరించినట్లు ఫిర్యాదుదారు ఆరోపించారు. సంస్థకు సంబంధించిన రికార్డులు, డిజిటల్ సంతకాలు, ఎంసిఎ దాఖలు పత్రాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, నిందితుల బ్యాంకు ఖాతాలు, ఆస్తులను స్తంభింపజేసి, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. దర్యాప్తు అనంతరం తన వాటాలు, డైరెక్టర్ హోదాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## దివ్యాంగురాలుకు ఎంఎల్‌ఎ ఆర్థిక సాయం



ప్రజాపక్షం/తాండూరు : ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. పెద్దేముల్ మండల పరిధి బండమీదిపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు చాకలి పుష్పలతకు రూ.50వేల ఆర్థిక సాయం అందజెసి ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి తన ఊదరతను చాటుకున్నారు. సాధరణ ఎన్నికల సమయంలో దివ్యాంగురాలు చాకలి పుష్పలతను చూసిన ఎంఎల్‌ఎ చలించిపోయ్యారు. అందుకు స్పందించిన ఎంఎల్‌ఎ దివ్యాంగురాలికి స్కూటిని ఇప్పిస్తానని మాట ఇచ్చారు. ఈ మేరకు పుష్పలతకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తనకు ఆర్థిక సాయం చేసిన ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డికి పుష్పలత ధన్యవాదాలు తెలియజేశారు. అందుకు సహకరించిన మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మం చి మనసున్న ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డిని బండమీదిపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, పిఎసిఎస్ చైర్మన్ మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ జగన్, మండల కార్యదర్శి కల్కోడ నర్సిములు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.

### బతుకమ్మ ఉత్సవాలు చారిత్మాత్మకం

తాండూరు పట్టణ పరిధి 12వ వార్డు సాయిపూర్‌లో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు. తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరాజబాల్‌రెడ్డి ఆధర్యాన నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలకు స్థానిక ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్ రెడ్డి హజరైనారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరాజబాల్‌రెడ్డితో కలసి ముం దుగా బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ సంబారాల్లో భాగంగా మహిళలతో కలసి ఆడిపాడారు. బతుకమ్మ ఉత్సవాలకు హజరైన ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్ రెడ్డితో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరాజబాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి రైతు ఎంఎల్‌ఎతో కలసి స్టెపులు వేశారు. దీంతో బతుకమ్మ ఉత్సవాలకు మరింత శోభను సంతరించుకుంది. ఈ ఉత్సవాలకు స్థానిక నాయకులు, పలువురు కౌన్సిలర్‌లు, మహిళలు పాల్గోన్నారు.

## దూల్‌పేటలో రూ.16 లక్షల గంజాయి పట్టివేత

ఒడిశా నుంచి తరలిస్తుండగా
32 కిలోలు స్వాధీనం.. ఒకరి అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఒడిశా నుంచి హైదరాబాద్‌లోని దూల్‌పేటకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠా కార్యకలాపాలను ఎక్సైజ్ పోలీసులు అడ్డుకున్నారు. మంగళూరు బస్తీకి స్కూటీపై 32 కిలోల గంజాయిని తీసుకువస్తున్న సాకేత్ బాబును అరెస్టు చేసి, గంజాయితో పాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేశారు. దూల్‌పేట ఎక్సైజ్ సిఐలు ప్రవీణ్‌కుమార్, విప్లవ్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి ఈ దాడి నిర్వహించారు. ఒడిశా నుంచి గంజాయిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి విక్రయించేందుకు తరలిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ వ్యవహారంలో సాకేత్ బాబుతో పాటు అజ్జిత్ కుంబ్లీ, రాహుల్ కుంబ్లీ, హాట్ గర్ల్ దేవిదాస్, హాట్ గాడ్ సంజయ్‌లపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.ఈ కేసులో పట్టుబడిన నిందితుడిని, స్వాధీనం చేసుకున్న గంజాయిని కోర్టులో హాజరుపరిచినట్లు సిఐ వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించి ఇతర నిందితుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది.

## దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్



ప్రజాపక్షం/కూకట్‌పల్లి : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ శనివారం సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూసాపేట డివిజన్‌లోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయకమిటీ చైర్మన్ రాచమళ్ల బిక్షపతి గౌడ్, ఆర్.శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ నగర్‌లో శివా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కైతలాపూర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్‌లో జిట్టా సునీల్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంజనేయ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో ఏర్పాటు చేసిన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తూము వేణు, పటోళ్ల నాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్ తూము ఎల్లారావు, కర్క పెంటయ్య, తూము మనోజ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు తూము సంతోష్, కాలికోట శంకర్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సలీం, మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎండీ చున్ను పాషా, కాంగ్రెస్ నాయకులు కాస నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్ పోలీసుల తక్షణ స్పందన

### తప్పిపోయిన ఇద్దరు పిల్లలు సురక్షితం!



ప్రజాపక్షం/జవహర్‌నగర్ : జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల మానవతా దృక్పథం, అప్రమత్తత మరోసారి నిరూపితమయ్యాయి. కనిపించకుండాపోయిన ఇద్దరు మైనర్ బాలురు కేవలం 90 నిమిషాల వ్యవధిలోనే సురక్షితంగా తల్లి ఒడికి చేరడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. వివరాల్లోకి వెళ్తే కాప్రా మండలం, గబ్బిలాల్‌పేట్, కెసిఆర్ నగర్‌కు చెందిన పులికంటి అనురాధ భర్త మరణించగా, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఈశ్వర్ (15), మహేందర్ (7) ఉన్నారు. అయితే అక్టోబర్ 18వ తేదీ మధ్యాహ్నం సమయంలో ఆ ఇద్దరు పిల్లలు ఇంట్లో నుండి అదృశ్యం కావడంతో ఆ తల్లి ఆందోళన చెందింది. పిల్లలు ఎక్కడ కనిపించకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఆమె వెంటనే డయల్ 100 ద్వారా జవహర్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే జవహర్‌నగర్ పోలీసులు క్షణం కూడా ఆలస్యం చేయకుండా రంగంలోకి దిగి వివిధ కోణాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల వేగవంతమైన స్పందన ఫలితంగా కేవలం 90 నిమిషాల వ్యవధిలోనే ఇద్దరు పిల్లలను క్షేమంగా గుర్తించారు. అనంతరం వారిని ఎంతో ప్రేమగా పోలీస్ స్టేషన్‌కు చేర్చి, తల్లి అనురాధ సమక్షంలో ఆమెకు అప్పగించారు. తమ పిల్లలు సురక్షితంగా తిరిగి దక్కడంతో ఆ తల్లి ఆనందానికి అవదుల్లేవు. కష్టకాలంలో తమ ఆవేదనను అర్థం చేసుకుని, క్షణాల వ్యవధిలో స్పందించి పిల్లలను సురక్షితంగా అప్పగించిన జవహర్‌నగర్ పోలీసుల బృందానికి ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల సేవలను పలువురు స్థానికులు ప్రశంసిస్తున్నారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్ష ణే కాకుండా, బాధితులకు అండగా నిలవడం లో జవహర్‌నగర్ పోలీసులు ఎప్పుడూ ముం దుంటారని మీ భద్రతే మా ప్రాధాన్యత నినాదానికి ఈ ఘటనే నిదర్శనమని మరోసారి రుజువైంది.



భగత్‌సింగ్ మార్గ్‌లో ఆదివారం గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని, స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ముంతాజ్, పాషా, ఖయూం, ఖదీర్, యాదగిరి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆట, పాటలతో ఆడపడుచుల సందడి

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలు!



ప్రజాపక్షం/నవాబుపేట్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను నవాబుపేట్ మండలంలోని మైతాఫ్ ఖాన్ గూడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తెలుగు దుర్గయ్య, ఉపసర్పంచ్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో మహిళలు, ఆడపడుచులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ఆటపాటలతో సందడి చేసిన ఆడపడుచులు



బొంరాస్‌పేట్ : కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో అధివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ వేడుకల్లో గ్రామ అడపడుచులు ,మహిళలు ,చిన్నారులు ,భక్తుశ్రద్దలత ఉత్సవంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను సిద్ధం చేసుకొని గ్రామంలోని దుర్గామాత భవాని మందిరం వద్దకు వచ్చిన మహిళలు అడిపడరు . ఈ సందర్భంగా మహిళలు సంప్రాదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ,అటపాటలతో సందడి చేశారు. గ్రామస్తులంతా కలిసి వేడుకల్లో పాల్గోనడంతో మందిరం పరిసరాల్లో పండుగ వాతావరణంలో నెలకొంది తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్ గ్రామస్తులు తదితరులు పాల్గోన్నారు.

### కూకట్‌పల్లిలో...



కూకట్‌పల్లి సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారం అంబరాన్నంటాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేస్తూ పండగ ను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో కాచా రంలావణ్య పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో భాగమయ్యారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మను పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు ఆనందోత్సాహాలతో వేడకలను నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం విశేషం. మహిళల ఆటపాటలు, కోలాటాలతో వేడుకల ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది.

## తాళం వేసిన ఇంట్లో చోరీ



ప్రజాపక్షం/చర్లపల్లి : తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డ సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వి వరాల ప్రకారం కుషాయిగూడ పిఎస్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన ఎ.జయలక్ష్మి (72) శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి షాపింగ్ చేసి సాయంత్రం వచ్చే లోపే ఇంటి గ్రిల్ గేట్ తెరచి ఉండడం, బీరువా తెరిచి ఉండడాన్ని గమనించారు. బీరువాలో ఉన్న 14 గ్రాముల రెం డు జతల బంగారు చెవి కమ్మలు, 25 గ్రాముల వెండి గొలుసు,80 గ్రాముల వెండి పట్టీలు కనిపించలేదు.గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## రూ.65 లక్షలతో అమ్మవారికి అలంకరణ



ప్రజాపక్షం /దౌల్తాబాద్ : కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం బలంపేట్ గ్రామంలో రూ.60లక్షలతో అమ్మవారి అందంగా అలంకరించారు. గత మూడు సంవత్సరాలుగా గ్రామంలో అమ్మవారిని స్థాపించి ఉత్సవాలను జరుపుకుంటూ వస్తున్నారు. అలాగే ప్రతి సంవత్సరం కూడా ఇలా డబ్బులతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహిస్తారు. కాగా ఈ సంవత్సరం కూడా రకరకాల నోట్లతో రూ.65 లక్షలతో ఎంతో అందంగా అలంకరించారు.అమ్మవారిని చూడడానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.

## హిందూ దార్మిక సమితి ద్వారా ధర్మా ప్రవచనాలు



ప్రజాపక్షం/పరిగి : హిందు దార్మిక సమితి ద్వారా దార్మిక సమితి ద్వారా హిందు ధర్మా ప్రవచనాలు మన సనాతన సంస్కృతిని జీవన విధానాన్ని నైతిక విలువలను పెంపొందించడానికి ఎంతో తోడుపడతాయని డాక్టర్ బాస్కర్ యోగి అన్నారు. పరిగి మండల పరిధిలోని ఖుదానంద్ పూర్ గ్రామంలో దేవి నవారాత్రుల ఉత్సవాలలో భాగంగా భాస్కర ఫౌండేషన్ ద్వారా భాస్కర్ యోగి హిందు దార్మిక సమితి ప్రవచనాలు నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో సర్పంచు యాదయ్య, ఉపసర్పంచు నర్సింలు , యాదయ్య, ,రామచంద్రయ్య, పద్మమ్మ ,అంజి తదితరులు పాల్గోన్నారు.

## ఎఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ పూజ



ప్రజాపక్షం/వికారాబాద్ : ఎఆర్ కార్యాలయంలో అయుధపూజ కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ శాఖలో అయుధ పూజకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని పేర్కోన్నారు. ప్రజలరక్షణ శాంతిభద్రల పరిరక్షణ,నేరాల నియంత్రణలో అయుధాలు, పోలీస్ వాహనాలు కీలక పాత్ర పోసిస్తాయని తెలిపారు. అయుధాలు, మందు గుండు సామాగ్రి అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలని నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని పోలీస్ సిబ్బందిని కోనియాడరు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి రాజేష్‌మీనా, వీరేష్, నాగరాజు, సిబ్బంది పాల్గోన్నారు.

## రూ.2లక్షల ఎల్‌ఒసి అందజేసిన స్పీకర్ గడ్డం

ప్రజాపక్షం/వికారాబాద్‌రూరల్ : వికారాబాద్ మండల పరిధిలోని అత్తెల్లి గ్రామ ఉపసర్పంచు అమృతమ్మ సత్యయ దంపతుల కుమారుడు ప్రశాంత్ కుమార్ ఈ నెల 10వ తేదీన కొత్తగాడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రశాంత్ కుమార్ తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ అసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలియడంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ రూ.2లక్షల ఎల్‌ఒసిని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్ కుమార్ త్వరగా కోలుకోవాలని కోరారు. అతని కుటుంబానికి అండగ ఉంటానని తెలిపారు.



